KLVA102M238

జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 41 సంచిక: 4 విజయవాడ 20-6-2008 పేజీలు : 16 వెల: రు 5.00

లోపలి పేజీలలో.....

- విప్లవోద్యమ అభివృద్ధి క్రమాన్నీ, దానిలో వచ్చిన ధోరణుల్నీ ఆచరణ ఫలితాలనూ సావధానంగా చర్చిద్దాం - విశ్వం
- అమెరికా ఎక్సిల్ కార్మికుల సమ్మె
- రైతాంగాన్ని గెంటివేసే కోస్తా కారిడార్
- సామ్రాజ్యవాదుల కొరకు జీవ ఇంధన పంటలు

ప్రజలపై పెనుభారం మోపి, ఖజానానింపుకునే పెట్రోధరల పెంపును వ్యతిరేకించండి!

చివరికి భారత ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచింది. పెట్రోలును లీటరుకు ఐదు రూపాయలు, డీజిలు 3 రూ.లు, గ్యాసు సిలెండరును 50 రూ. పెంచింది. దీనికితోడు పెట్రోలు, డీజిలుపై ఎక్సైజు సుంకాన్ని 1 రూ. తగ్గించింది. ముడిచమురు దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని 5 శాతం తగ్గించింది. ప్రజలపై45 వేల కోట్ల రూ.లు భారం మోపింది. ఫలితంగా ద్రవ్యోల్బణం 9 శాతానికి చేరుతుందనీ, త్వరలో రెండంకెల స్థాయిని దాటుతుందనీ ఆర్థిక నిపుణుల అంచనా. అంటే ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న ధరలు రాకెట్ వేగంతో రోదసిలోకి దూసుకుపోతాయి.

పెట్రో ధరల పెంపుదల తర్వాత దేశ ప్రజల నుద్దేశించి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగినందున దేశంలో ధరలు పెంచక తప్పలేదని అన్నారు. వినియోగాన్ని తగ్గించుకోవాలని, ఇంధన వ్యయాన్ని తగ్గించి ప్రతి చుక్క పెట్రోలునూ ఆదా చేయాలనీ ప్రజలను కోరారు. ధరలనదుపులో వుంచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తమ అమ్మకంపన్నును తగ్గించుకోవాలని కోరారు. వెనువెంటనే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రం పెంచిన ధరలను తామే భరించి, పాత ధరలకే అమ్ముతామంటూ ప్రకటించారు.

ఇది అసలు విషయాన్ని తిరగేసి చెప్పటం తప్ప మరేమీ కాదు. పెట్రో ఉత్పత్తులపై రాష్ట్రాల అమ్మకంపన్ను 20-30 శాతం వరకూ వుంది. దీనివల్ల రాష్ట్రాలకు 37 వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌నే తీసుకుంటే కేంద్రం పన్ను తగ్గించినందువల్ల 600 కోట్ల రూపాయల ఆదాయం తగ్గుతుంది. అంతకు ముందు 1800 కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. కాగా ధరలు పెరిగినందున పన్ను రేటు తగ్గించినా అమ్మకంపన్ను నుండి ఆదాయం 425 కోట్లు పెరుగుతుంది. కాగా ఆదాయంలో తగ్గుదల 175 కోట్ల రూపాయలు మాత్రమే. ముఖ్యమంత్రి పెంచిన గ్యాసు ధర 50 రూపాయలు పెంచకుండా పాత ధరకే అమ్ముతానని ప్రకటించాడు. దీనివల్ల అదనంగా రావలసిన అమ్మకంపన్ను ఆదాయాన్ని కోల్పోతాడు తప్ప నష్టపోయేదో, తాను భరించేదో ఏమీ వుండదు.

ధరను మించిన పన్నులు

ఇప్పుడు పెంచిన ధరల ప్రకారం పెట్రోలు ధర 5 రూపాయలు పెరిగి 56 చేరుతున్నదనుకుంటే, ఆ ధరలో వివిధ విభాగాలు యిలా వుంటాయి. (రమారమిగా వేసినవి. పైసల్లో కొంత తేడా వుంటుంది.)

ఉత్పత్తి, రవాణా, లాభం కలిపి పెట్రోలు ధర రూ॥లు	24-00
కేంద్ర కస్టమ్స్, ఎక్సైజు	16-50
అదనపు ఎక్సైజు	6-00
రోడ్లు అభివృద్ధి సెస్	1-50
ఆంధ్రప్రదేశ్ అమ్మకంపన్ను	8-00
మొత్తం ధర	56-00

అంటే లీటరకు 24 రూపాయలు ధర మీద కేంద్రం 24 రూపాయలు పన్నులు వేస్తుండగా రాష్ట్రం 8 రూపాయలు పన్నులు వేస్తున్నది. కేంద్రానికి వస్తున్న ఎక్సైజు ఆదాయంలో సగం 1,25,000 కోట్ల రూపాయలు పెట్రోలియం ఉత్పత్తుల నుండే వస్తున్నది. వీటిపై కస్టమ్స్ డ్యూటీ వల్ల 1,04,900 కోట్లు వచ్చింది. దాదాపు 2,30,000 కోట్ల రూపాయలు పన్నుల రూపేణా కేంద్రం పొందుతుండగా రాష్ట్రాలు అమ్మకంపన్ను ద్వారా మరో 36 వేల కోట్లు పొందుతున్నాయి. ప్రస్తుతం ఎక్సైజు, కస్టమ్స్‌ను తగ్గించినందువల్ల కేంద్రానికి 22 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఆదాయం తగ్గుతుంది. ఇంకా 2 లక్షల 44 వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది.

చమురు నుండి కేంద్రం, రాష్ట్రాలకు 2001-02లో రూ.73 వేల కోట్లు పన్నుల ఆదాయం రాగా, అది 2002-03లో 96 వేల కోట్ల రూపాయలకూ, 2003-04లో లక్ష కోట్లకూ, గత ఏడాది లక్షా 64 వేల కోట్లకూ పెరిగింది. ఈ ఏడాది రెండు లక్షల 44 వేల కోట్లకు చేరింది. ఇవికాక చమురు అభివృద్ధి సెస్ క్రింద ఓఎన్‌జిసి, ఐఓఎల్‌ల నుండి టన్ను చమురుపై 2500 రూపాయలు వసూలు చేస్తున్నది. ముడిచమురు ధరలు పెరిగినప్పుడల్లా ప్రభుత్వానికి రాబడి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నది.

అమెరికాలో పెట్రోలు ధర గ్యాలను 4 డాలర్లుగా వుంది. అంటే రమారమి లీటరు 1 డాలరుంది. అంటే దాదాపు 45 రూపాయలు. అమెరికా జీవన వ్యయంతో పోలిస్తే ఇది పెద్దరేటు కాదు. ప్రపంచ ముడిచమురు వినియోగంలో 4వ వంతు అమెరికానే వాడుకుంటుంది. అమెరికా ప్రభుత్వానికి కోటి కోట్ల రూపాయలు పన్నుల ఆదాయం వుంటుంది. కనుక పెట్రో ధరలు పెంచి వుంచటంలో పెట్రో కంపెనీలతోపాటు ప్రభుత్వాలకు కూడా స్వంత ప్రయోజనాలుంటున్నాయి.

దేశంలోనూ, ప్రపంచంలోనూ, ప్రత్యేకించి భారత్, చైనాలలో, వినియోగం పెరిగినందున డిమాండు పెరిగి ధరలు పెరుగుతున్నాయని అమెరికా ప్రచారం చేస్తున్నది. ప్రధాన మంత్రి తన ప్రసంగంలో పరోక్షంగా ఈ వాదనను అంగీకరించారు. వినియోగం తగ్గించమనీ, ప్రతిచుక్క యింధనాన్ని ఆదా చెయ్యమని పిలుపునిచ్చారు. ఈ వాదనలో వాస్తవముందా?

వినియోగం పెరుగుదల కారణమా?

"ప్రపంచ పెట్రోలు వినియోగ పెరుగుదల బలంగా లేదన్న ముఖ్యఅంశాన్ని మనం గుర్తించాలి" -ఈ మాటలన్నది పెట్రో పరిశ్రమకు ద్రవ్యమందించే బ్యాంకుల్లో మొదటి స్థానంలో వున్న జె.పి. మోర్గాన్ ఫండ్‌కు ముఖ్యమార్కెట్టు విశ్లేషకుడు డెవిడ్ కెల్లి.

అమెరికా ప్రభుత్వపు ఇంధన సమాచార సంస్థ ఇటీవలి నివేదిక ప్రకారం ఆర్థికమాంద్యత వల్ల అమెరికాలో పెట్రోలు వినియోగం రోజుకు లక్షా 90 వేల బ్యారెల్సు తగ్గుతుందని తెలిపింది. చైనాలో వినియోగం రోజుకు 70 లక్షల బ్యారెల్సు వుందనీ, దీనిలో 32 లక్షల బారెల్సు గత ఏడాది దిగుమతి చేసుకోగా, ఈ ఏడాది 36 లక్షల బ్యారెల్సుకు పెరుగుతుందని తెలిపింది. యూరపు, అమెరికాలలో వినియోగం తగ్గుదల కంటే ఈ పెరుగుదల తక్కువే. అంతేకాక పెట్రోలియం ఎగుమతి చేసే దేశాల సంస్థ (ఓపెక్) 2008లో ముడిచమురు డిమాండు మార్పుచెందకుండా రోజుకు 8.7 కోట్ల బ్యారెల్సు వుంటుందని అంచనా వేసింది. కనుక అంతర్జాతీయ మార్కెట్టులో ముడిచమురు ధరల పెరుగుదలకు వినియోగం బాగా పెరిగిపోవటం అనేది కారణం కాదు.

ఇంతేగాక మరోవైపున సరఫరా కూడా పెరుగుతున్నది. ప్రపంచంలో అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తిదారైన సౌదీ అరేబియా తన ఉత్పత్తి 11 శాతం పెంచి 2008లో 1 కోటి 32 లక్షల బ్యారెల్సు రోజుకు ఉత్పత్తి చేస్తున్నది. బ్రెజిల్‌లో కొత్తనిల్వలు బయటపడ్డాయి. దీనిని బయటకు తీస్తున్నది. దాని ఉత్పత్తి వెనిజులాతో సమానమౌతుంది. కనుక సరఫరా తగ్గినందువల్ల కూడా ధరలు పెరగలేదు. అమెరికా ఆయిలు కంపెనీల ముఖ్యులందరూ హాజరైన టెక్సాస్‌లో జరిగిన సదస్సు "సరఫరా డిమాండును మించిపోతున్నదనీ, నిల్వలు పేరుకుపోతున్నాయనీ, త్వరలో ధరలు తగ్గక తప్పద"నీ అభిప్రాయపడింది. అమెరికాలో మాస్టర్‌కార్డుతో పెట్రోలు కొంటారు. మాస్టరుకార్డు లెక్కల ప్రకారం డిమాండు 5.8 శాతం తగ్గింది. తగ్గిన డిమాండు మేరకు రిఫైనరీలు తమ ఉత్పత్తిని తగ్గిస్తున్నాయి. మామూలుగా ఈ సీజనులో 95 శాతం సామర్థ్యంతో పనిచేసే రిఫైనరీలు 84 శాతం సామర్థ్యంతో మాత్రమే పనిచేస్తున్నాయి.

భవిష్యవాణిజ్య జూదం

మరి కారణమేమిటి? 2003లో అమెరికా పార్లమెంటు సభ్యులతో కూడిన కమిటి ముడిచమురు బ్యారెలు 60 డాలర్లు వున్న సమయంలో పరిశీలన జరిపి, బ్యారెలు 25 డాలర్లు వుండగా మిగిలిన 35 డాలర్లు భవిష్య వాణిజ్య జూదంవల్ల పెరిగిందని నిర్ధారణకు వచ్చింది. ఇప్పుడు 2008లో ముడిచమురు బ్యారెలుకు 123 డాలర్లకు చేరుకోగా దానిలో 60 శాతం భవిష్య వాణిజ్య జూదం వల్లనేనని తేలుతున్నది. అంటే ముడిచమురు బ్యారెలు ధర 50-55 డాలర్ల మధ్య వుండగా, భవిష్య వాణిజ్యం దానిని 128 డాలర్లకు పెంచింది. అసలు వాస్తవ ధర ఎంతో జె.పి.మోర్గాన్ వంటి బ్యాంకుల, ఎక్సాన్, మొబిల్ వంటి ఆయిలు కంపెనీల యాజమాన్యాలనికి మాత్రమే తెలుసు.

అమెరికాలో భవిష్యవాణిజ్యాన్ని అదుపుచేసే కమీషన్ వుంది. అది ఇటీవల తన నియమాలను కొంత సడలించింది. (తరువాయి 2వ పేజీలో)

ప్రకటన

రైతాంగంపై పోలీసుకాల్పులను ఖండించండి!

నిజామాబాద్‌జిల్లా ఆర్మూర్‌లో బకాయిలు చెల్లించమని కోరుతున్న రైతాంగంపై తుపాకీ కాల్పులకు పాల్పడటాన్ని, ముగ్గురు రైతులను గాయపరచటాన్ని రైతు-కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) తీవ్రంగా ఖండిస్తున్నది. తన కర్తవ్యాన్ని మరచి, రైతాంగానికి డబ్బు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వ వైఫల్యాన్ని తప్పపడుతున్నది. రైతు రాజ్యమంటున్న కాంగ్రెసు ప్రభుత్వం తానే సమస్యలు సృష్టించి పరిష్కారమడిగిన రైతాంగంపై పాశవిక అణచివేతకు పాల్పడటం గర్హనీయం.

కలెక్టరు సమక్షంలో రైతాంగానికీ, వ్యాపారికీ మధ్య ఒప్పందం జరిగింది. ఎర్రజొన్న విత్తనాల పంటకు క్వింటాలుకు రూ.1500 చెల్లించడానికీ, మొత్తం పంటనంతా కొనడానికీ వ్యాపారి అంగీకరించాడు. ఆ విధంగానే పంటను రైతాంగం ఆ వ్యాపారికి అందించారు. వాయిదాలుగా 28 కోట్ల రూపాయలు రైతాంగానికి చెల్లించి, ఇంకా రూ.50 కోట్లు వ్యాపారి బకాయి పెట్టాడు. ఖరీఫ్ సీజన్‌తో మళ్లీ పంట వేయాల్సిన తరుణం రావటంతో బకాయిలు చెల్లించమని రైతాంగం అడిగారు. ఫలితం లేక కలెక్టరు నుండి ముఖ్యమంత్రి వరకూ విజ్ఞప్తులు చేశారు. చూస్తాము చూస్తామన్న మాటలే తప్ప చేసిందేమీ లేకపోవటంతో రైతాంగం నిరాహారదీక్షలు ప్రారంభించారు. శాంతి, భద్రతల పేరిట ప్రభుత్వం వీరిపై విరుచుకు పడింది. తాము మధ్యవర్తిగా ఒప్పందం జరిగినందున, అది అమలు అవుతుందో లేదో పర్యవేక్షించాల్సిన ప్రభుత్వం, వ్యాపారిపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా రైతాంగంపై విరుచుకుపడి తానెవరి పక్షాన వుంటుందో చెప్పింది.

ప్రభుత్వం చేసిన కాంట్రాక్టు ఫార్మింగు చట్టం ప్రకారం, రైతులతో ఒప్పందం చేసుకున్న మొత్తాన్ని పొలం వద్దే పూర్తిగా చెల్లించి పంటను తీసుకువెళ్లాలి. కలెక్టరు సమక్షంలో జరిగిన ఒప్పందమన్న నమ్మకంతో రైతాంగం పంటనందజేశారు. అయినా ప్రభుత్వం పట్టనట్లే వూరకుంది. వ్యాపారి నెలల తరబడి చెల్లింపులు చేయకుండా వున్నా పట్టించుకోలేదు. రైతాంగం ప్రభుత్వం దృష్టికి తెచ్చినా నిమ్మకు నీరెత్తినట్లు వూరకుంది. కాల్పుల తర్వాత మిగిలిన పంట కొనమని మార్కెఫెడ్ వంటి ప్రభుత్వ సంస్థలకు ఆజ్ఞాపించానంటూ రైతాంగాన్ని బుజ్జగింప చూస్తున్నది. కాంట్రాక్టు ఫార్మింగు విధానం వల్ల రైతాంగానికి ఎనలేని మేళ్లు వనగూడుతాయని టిడిపి ప్రభుత్వమూ, నేటి కాంగ్రెసు ప్రభుత్వమూ ప్రచారాన్ని చేశాయి. కాంట్రాక్టు ఫార్మింగు వల్ల రైతాంగం బడా వ్యాపారుల, కంపెనీల దయాదాక్షిణ్యాలకు వదలివేయబడతారని ఎర్రజొన్న రైతాంగపు అనుభవం తెలుపుతున్నది.

ఆర్మూరు ప్రాంతంలో 16 మండలాల్లో 60 వేల ఎకరాల్లో ఎర్రజొన్న సాగు రైతాంగం చేస్తున్నారు. వీరంతా పేద, మధ్యతరగతి రైతులే. గత ఏడాది రూ.1100 మాత్రమే వ్యాపారులు చెల్లించారు. ఇక్కడి రైతుల నుండి సేకరించిన విత్తనాలను రాజస్తాను, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అమ్ముతారు. అక్కడి రైతాంగం ఈ పంటను సాగు చేస్తారు. దీనిని పశుగ్రాసంగా వాడతారు. ఢిల్లీ మార్కెట్టులో క్వింటాలు 2500 రూపాయలకు పైగానే యిక్కడి వ్యాపారులు అమ్ముకుంటారు. ఢిల్లీ వ్యాపారులు ఉత్తరాది రైతాంగానికి ఇంకా ఎక్కువ రేటుకు అమ్ముతారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ, మార్క్‌ఫెడ్ వంటి అనేక సంస్థలున్న ప్రభుత్వం ఇక్కడి రైతాంగం నుండి కొని, ఉత్తరాది రైతాంగానికి అమ్మితే, ఈ మధ్య దళారుల దోపిడీ పోయి, యిరుపక్షాల రైతాంగానికి సరసమైన ధర దక్కేది. కానీ ప్రైవేటీకరణను సర్వరోగ నివారణా మంత్రంగా జపిస్తున్న పాలకులు రైతాంగాన్ని బడా వ్యాపారుల దోపిడీకోరలకు ఎరగా వేయటానికే పూనుకున్నారు. ప్రస్తుత సమస్యకు మూలకారణమిది కాగా, మిగిలిన పంట యిప్పుడు కొంటానంటూ బుజ్జగించటమూ, వ్యాపారుల మధ్య పోటీ, అమ్ముకోలేక బకాయా పడ్డాడు; రైతులు హింసాకాండకు దిగారు వంటి వాదనలు చేయటమూ సమస్యను ప్రక్కదారి పట్టించేవి.

- **జొన్న రైతాంగానికి బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలి!**
- **ఎర్రజొన్న విత్తనాల వాణిజ్యం, మార్క్‌ఫెడ్, ఏ.పి. సీడ్స్ సాగించాలి!**

విజయవాడ,
17-6-2008.

ఎస్.ఝాన్సీ
అధ్యక్షులు
రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)

శ్రామికవర్గ విప్లవ కవి శ్రీశ్రీ 25వ వర్ధంతి

"కార్మికలోకపు కళ్యాణానికి. శ్రామికలోకపు సౌభాగ్యానికి" తన నవ్యకవిత్వాన్ని సమర్పిస్తానని "ప్రతిజ్ఞ"బూని, తన ఆఖరి శ్వాస వరకూ (15 6 1983) తన సాహిత్యపు ఆఖరి అక్షరందాకా పీడిత ప్రజల పక్షాన నిలిచిన శ్రీశ్రీ మరణించి 25 సంవత్సరాలయింది. తెలుగువారి సాంఘిక, సాహిత్య, భాషా రంగాలలో ప్రజాస్వామిక సంస్కరణలకు కందుకూరి, గురజాడ, గిడుగులు దారులు వేయగా, వాటిని విస్తరించి విప్లవ మార్గం పట్టించినవాడు శ్రీశ్రీ అందువల్లనే శ్రామిక ప్రజానీకం శ్రీశ్రీని తమ"వాడి"గా భావించి, ఆయన కవిత్వపు వేడిని కొత్తతరాల గుండెలలోకి నేరుగా దూసుకుపోయే కృషిని తన కర్తవ్యంగా స్వీకరిస్తుంది.

రెండు ప్రపంచ యుద్ధాల నడుమ, పెట్టుబడిదారీ ప్రపంచమంతా ఘోర ఆర్థిక మాంద్యంలో (1929-33) చిక్కుకుని విలవిలలాడుతూ, ఫాసిస్టు నియంతృత్వానికీ, దురాక్రమణ యుద్ధాలకూ సంసిద్ధమౌతున్న కాలంలో శ్రీశ్రీ తన నవ్యరీతులతో ప్రేయసి వియోగంలో తపిస్తున్న తెలుగు కవిత్వాన్ని భూమార్గం పట్టించాడు. శ్రామిక జన జీవన సౌందర్యాన్ని దానికి లక్ష్యం చేశాడు.

1955 ఉప ఎన్నికల సమయంలో, అభివృద్ధి నిరోధకశక్తులూ, ఇటీవల సామ్రాజ్యవాదానికి అమ్ముడుపోయిన పోస్టు మోడర్న్ శక్తులూ శ్రీశ్రీపై నీచమైన దాడులు చేశారు. ఇవి వ్యక్తిగతంగా శ్రీశ్రీపై చేసిన దాడులుగా కన్పించినా, కమ్యూనిస్టు సిద్ధాంతం, ఉద్యమాలపై చేసినవే. కమ్యూనిస్టు పార్టీపై నిందా ప్రచారం సాగించటానికి ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి దృఢంగా మద్దతుగా నిలిచిన శ్రీశ్రీని ఆనాడు ఎంచుకున్నాయి. ఆయన మరణించినా ఆయన కవిత్వం వర్గ దృక్పథాన్ని సమున్నతంగా నిలిపినందున మార్క్సిస్టు-లెనినిస్టు అవగాహనపై సాగుతున్న నేటి దాడికి మళ్లీ ఆయనను లక్ష్యంగా ఎంచుకున్నాయి. అయినా అవి ఎర్రజెండ రెపరెపలనూ, శ్రీశ్రీ కవిత్వ అగ్ని కిరీటపు ధగధగలనూ మసకబార్చలేకపోయాయి.

1965లో ఏర్పడిన పౌర ప్రజాస్వామ్య హక్కుల సంస్థకు రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీశ్రీ నిర్బంధాన్ని ఖండించాడు. శ్రీకాకుళం రైతాంగ పోరాటాన్ని నెత్తురుటేరుల్లో ముంచి దోపిడీ వర్గాల దుర్నీతిని ఎలుగెత్తి ఖండించాడు శ్రీశ్రీ. కా॥ తరిమెల నాగిరెడ్డి ఏర్పాటు చేసిన పార్వతీపురం కుట్ర కేసు డిఫెన్సు నిధికి విరాళాలివ్వవలసిందిగా ప్రజలకు శ్రీశ్రీ విజ్ఞప్తి చేశాడు. పౌర ప్రజాస్వామిక హక్కుల రక్షణకు ఉద్యమ నిర్మాణంలో పాలుపంచుకున్నాడు. నిర్మాణ, ప్రచార కృషిలో విస్తృతంగా పాల్గొన్నాడు. ప్రజలను ఉత్తేజపరిచాడు.

సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజాల కాడి క్రింద నలిగిపోతున్న తెలుగు ప్రజానీకపు పోరాటాలకు శ్రీశ్రీ కవిత్వం ఒక మార్చింగ్ సాంగ్ . అది శ్రమైక జీవన సౌందర్యాన్ని కవిత్వీకరించింది. అది విరామమెరుగకుండా వెలుగుజిమ్మే అగ్ని సరస్సున వికసించే వజ్రం. గత 75 సంవత్సరాలుగా ప్రతి తరాన్ని ఉర్రూతలూపే శ్రీశ్రీ కవిత్వం ఆకర్షిస్తోంది. ఉత్తేజపరుస్తోంది.

ఉద్యమాలే ఊపిరిగా జీవించిన జయంతి రామలక్ష్మణమూర్తి మరణానికి సంతాపం

1931 జూలై 1న విజయనగరంజిల్లా జగ్గాపురంలో జన్మించిన జయంతి రామలక్ష్మణమూర్తి 2008 మే 21న తన 77వ యేట అనారోగ్యంతో మరణించారు. వారి మరణానికి జనశక్తి తన సంతాపాన్ని ప్రకటిస్తోంది.

జయంతి జీవితం 14వ ఏట నుండే ఉద్యమాలతో పెనవేసుకుపోయింది. 1945లో తన స్వగ్రామం జగ్గాపురంలో శ్రీరామ నవమినాడు ప్రారంభించిన శ్రీరామ జయంతి గ్రంధాలయ స్థాపనతో ఆయన గ్రంధాలయోద్యమం ప్రారంభమైంది. ఆ గ్రంధాలయ ప్రభావం చుట్టుప్రక్కల 40 గ్రామాలకు విస్తరింపచేశారు. సైకిల్‌పై పుస్తకాలు పెట్టుకొని గ్రామగ్రామానా పుస్తకాలు ఉచితంగా రెండు దశాబ్దాలపాటు అందించారు. రాష్ట్రేతర ఆంధ్రులకు కూడా పోస్టు ద్వారా అందించేవారు. ఆయనది సరిహద్దులులేని ఉద్యమం. సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా గ్రంధాలయాలకు ఆర్థికం సేకరించేవారు. విజయనగరంజిల్లాలో నూటికి పైగా గ్రందాలయాల స్థాపన, ప్రారంభోత్సవాలలో ఆయనకు ప్రత్యక్ష పాత్ర వుంది. ఉపాధ్యాయునిగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌లో కార్యకర్తగానూ, 1967-1983 మధ్యకాలంలో రాష్ట్ర కార్యదర్శిగాను పనిచేశారు. శ్రీకాకుళంలో గిరిజనోద్యమ సందర్భంగా ప్రభుత్వ నిర్బంధానికి గురైన ఉపధ్యాయుల కుటుంబాలను పరామర్శిస్తూ, అరెస్టయినవారి బెయిల్‌కోసం విశేష కృషి చేశారు.

మూఢనమ్మకాలను పారద్రోలే కార్యక్రమాలను జనవిజ్ఞాన వేదిక సహకారంతో నిర్వహించారు. వయోజనులకు రాత్రి పాఠశాలలు నడిపారు. సారావ్యతిరేక, అశ్లీల వ్యతిరేక ఉద్యమాలకు చేయూతనందించారు.

ఆ విధంగా నిరక్షరాస్యత నిర్మూలనకూ, విద్యావ్యాప్తికి, ప్రగతిశీల సాహిత్య ప్రచారానికి, గ్రంధాలయాలస్థాపనకు, ఉపాధ్యాయ ఉద్యమాభివృద్ధికి, శాస్త్రీయ భావాల వ్యాప్తికి నిరంతరం కృషి చేసిన, నిరాడంబర జీవితాన్ని గడిపిన జయంతి చిరస్మరణీయుడు.

వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేస్తున్నాం.

కామ్రేడ్ వేమన ఆదినారాయణకు జోహార్లు

కా॥ వేమన ఆదినారాయణ హృద్రోగంతో 17-6-08 ఉదయం 3 గంటలకు హఠాత్తుగా కన్నుమూసారు. ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడైన కా॥ఆదినారాయణ మేడే, పెట్రో ధరల పెంపుకు నిరసన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న జ్ఞాపకాలింకా చెరగకముందే ఆయనను కోల్పోవటం విచారాన్ని కల్గిస్తున్నది. జనశక్తి ఆయనకు విప్లవ జోహార్లు తెలుపుతున్నది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుతున్నది.

(1వ పేజీ తరువాయి)

భవిష్యవాణిజ్యదారుడు కొనుగోలు ధరలో 8 శాతం చెల్లించి ముడిచమురు కొనుగోలు చేయవచ్చును. అంటే బ్యారెలు 128 డాలర్లు వుంటే 8 డాలర్లు తాను చెల్లించి, 120 డాలర్లు బ్యాంకుల నుండి అప్పు తీసుకుంటాడు ఆ విధంగా సబ్ ప్రైమ్ రుణాలలో వచ్చిన నష్టాలను బ్యాంకులు పూడ్చుకుంటున్నాయి. అవి పెట్రోలు ధరలు పెరిగేలా చూస్తున్నాయి. భవిష్యవాణిజ్యం వల్ల ఎక్కువ భాగం ముడి చమురు వీటి ఆధీనంలోనే వుంది.

అమెరికా సామ్రాజ్యవాదమే కారణం

ముడిచమురు ధరల పెరుగుదల అంటే అన్ని ఉత్పత్తి కార్యకలాపాల ఖర్చులూ పెరుగుతాయి. విద్యుత్తు, రవాణా ఛార్జీల పెరుగుదల వెంటనే కన్పిస్తుంది. పెట్రోలియం ఉత్పత్తులను ముడిసరుకుగా (ప్లాస్టిక్స్, పాలియెస్టరు మొదలగు) వాడే పరిశ్రమల ఉత్పత్తుల ధరలన్నీ పెరుగుతాయి. వీటిని అంతిమంగా భరించేది ప్రజలే కనుక అమెరికా సామ్రాజ్యవాదం ముడిచమురులో భవిష్యవాణిజ్యాన్ని పెంచి, వాణిజ్యాన్ని డాలరుతో ముడిపెట్టి, అమెరికా ప్రజలనూ, ప్రపంచ ప్రజలనూ దోపిడీ చేసుకుని తాను బయటపడుతున్నది. మరో మాటల్లో చెప్పాలంటే అమెరికా సామ్రాజ్యవాదం తన ఆర్థిక సంక్షోభ భారాన్ని ప్రపంచ ప్రజలపై రుద్దుతున్నది.

ముడిచమురు ఉత్పత్తిపై -అది ఏ దేశంలో సాగుతున్నా-గుత్తాధిపత్యం నాలుగు అమెరికా కంపెనీలది. ముడిచమురు భవిష్యవాణిజ్యంపై గుత్తాధిపత్యం కూడా నాలుగు అమెరికా బ్యాంకులదే. కనుకనే మధ్య ప్రాచ్య దేశాలపై, వాటి ముడిచమురు వనరులపై ఆధిపత్యం కొరకు దురాక్రమణ యుద్ధాలు సాగిస్తూ, ఆ యుద్ధ భారాన్నంతా ప్రపంచ ప్రజలపై రుద్దుతున్నది. ముడిచమురు ధరల పెరుగుదలకు అసలు కారణమిది.

పులితోకపట్టుకుని నక్క

భారతదేశ ముడిచమురు అవసరాలలో 30 శాతం వరకూ దేశీయంగా ఉత్పత్తి అవుతుండగా మిగిలినది దిగుమతి చేసుకుంటున్నారు. భారతదేశంలో ఓ.ఎన్.జి.సి. ముడిచమురును వెలికితీసి, ఐ.ఓ.సి., హెచ్.పి.సి.ఎల్., ఐ.బి.పి. వంటి రిఫైనరీలకు అంతర్జాతీయ రేటుకు అమ్ముతున్నది. ధరలను నియంత్రించే బాధ్యతను ప్రభుత్వం వదలివేసి, మార్కెట్టుశక్తులే నిర్ణయిస్తాయన్న విధానాన్ని అనుసరిస్తున్నది. ఉత్పత్తి ఖర్చులను బట్టి కాకుండా ఉక్కుమిల్లులు ఉక్కుధరలను టన్ను 60 వేలకు పెంచినట్లుగానే ఓ.ఎన్.జి.సి. కూడా అంతర్జాతీయ ధరలకు అమ్ముతున్నది. కాగా ఓ.ఎన్. జి.సి.కి ఉత్పత్తి వ్యయం బ్యారెలుకు 30 డాలర్లు మించదు. కనుకనే ప్రస్తుత పెంపుదల సందర్భంగా ఓ.ఎన్.జి.సి. వంటి కంపెనీలను 45 వేల కోట్ల రూపాయలను ఈ లాభాల నుండి రిఫైనరీలకు చెల్లించమని ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వం బ్యారెలు 90 డాలర్లు దాటినప్పుడు, ధరలు పెంచింది. ఇప్పుడు 120 అయింది కనుక నష్టాలంటున్నది 30 శాతం దేశీయ ఉత్పత్తిపై వస్తున్న లాభాలను కలిపితే, నష్టం ప్రభుత్వం చెబుతున్నదానికన్నా చాలా తగ్గుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన రేటుకే అమ్ముతున్న రిలయన్సు ఇండస్ట్రీస్ చమురు రిఫైనరీ విభాగం 2005-06 రూ.5915 కోట్లు లాభం రాగా, 2007-08లో రూ.10,372 కోట్లకు పెరిగింది. అంటే రిలయన్సు లాభాలు 3 ఏళ్లలో రెట్టింపు కాగా, ప్రభుత్వ రిఫైనరీలకు నష్టాలెలా వచ్చాయి? నష్టాల అంకెలన్నీ అతిశయోక్తులే.

ఉదాహరణకు పెట్రోలు, డీజిలు, వంటగ్యాసు ధరను, అవి దిగుమతి చేసుకుంటే ఎంత ఖర్చవుతుందో దాన్నిబట్టి నిర్ణయిస్తున్నారు. నిజానికి ముడిచమురు దిగుమతి చేసుకుని శుద్ధి చేసి, వీటిని తయారు చేస్తున్నాం. దిగుమతి చేసుకుంటున్న పెట్రోలు మొత్తం వినియోగంలో 3 శాతమే, డీజిలు 6 శాతమే, వంటగ్యాసు 22 శాతమే. వీటిని దిగుమతి చేసుకున్న రేటు అంటే రవాణా, ఇన్సూరెన్సు ఛార్జీలు అదనంగా కలుపుతున్నారు. కనీసంగా నష్టాల అంచనా 15 శాతం ఎక్కువగా వుంటుంది. గత ఏడాది ఈ లోపాన్ని గుర్తించిన ఆర్థికశాఖ నష్టాల అంచనాను 78 వేల కోట్ల నుండి 70 కోట్లకు తగ్గించింది. పెంచక తప్పదని ప్రజల నొప్పించడానికి, ఊహాజనిత నష్టాలని తెలిసినా ప్రభుత్వం పెంచి చూపిన లెక్కలనే ప్రచారం చేస్తున్నది.

దేశ వనరుల ధారాదత్తం

ఈ దిగుమతులను తగ్గించేందుకూ దేశీయ ఉత్పత్తిని పెంచుకోవలసి వుండగా, దేశీయ వనరులను విదేశీ కంపెనీలకు అమ్మివేస్తున్నారు. దేశీయ కంపెనీలనే వాటికి యిచ్చిన వనరులను కూడా అవి విదేశీ కంపెనీలకు అమ్ముకుంటున్నాయి. కెజి బేసిన్‌లో డి-6 బ్లాకును రిలయన్సు కంపెనీకివ్వగా, అది షెల్ కంపెనీకి లాభానికి అమ్ముకుంది. షెల్ కంపెనీ ఇక్కడి నుండి వెలికితీసే గ్యాసు, ముడి చమురును అంతర్జాతీయ రేటుకు అమ్ముతుంది. అంటే మన ముడిచమురును మనకే అధిక ధరలకు అమ్ముతుంది.

వెలికితీసేందుకు మన వద్ద పెట్టుబడులు లేనందున విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామంటున్నారు. ఓ.ఎన్.జి.సి. నైజీరియాలోనూ, రష్యాలోని సఖాలిన్‌లోనూ ముడిచమురు వెలికితీతకు ఒప్పందాలు చేసుకుంది. అంటే తగిన సాంకేతిక పరిజ్ఞానమూ, పెట్టుబడులు ఓ.ఎన్.జి.సి. వద్ద ఉన్నాయని తెలుస్తున్నది. వాటినే దేశీయ ముడిచమురు వెలికితీతకు వినియోగిస్తే, విదేశీ దోపిడీ నుండి బయటపడతాము. ముడిచమురు ధరలు మన అదుపులోనే వుంటాయి. కాగా సామ్రాజ్య వాదుల ముందు మోకరిల్లే మన పాలకులు మన వనరులన్నీ సామ్రాజ్య వాదుల పరంచేసి దేశ ప్రజలపై దోపిడీని రుద్దుతున్నారు.

చమురు వనరుల వృధా

అంతేకాక, దేశంలో పెట్రో ఉత్పత్తుల వినియోగాన్ని విచక్షణా రహితంగా పెంచివేసే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఆ విధంగా మన సహజ వనరులు దుర్వినియోగమవుతున్నాయి. వ్యక్తిగత రవాణా వాహనాలను-కార్లు, మోటారు సైకిళ్లు- పెంచుతున్నది. సామూహిక ప్రజారవాణా సాధనాలను నిరుత్సాహపరుస్తున్నది. ఉదా: హైదరాబాదు నగరంలో రోడ్డు స్థలంలో 5 శాతం ఆక్రమిస్తున్న బస్సులు 60 శాతం ప్రయాణీకులను గమ్యాలకు చేరవేస్తుండగా, 80 శాతం స్థలాన్ని ఆక్రమిస్తున్న కార్లు 10 శాతం మందిని మాత్రమే రవాణా చేస్తున్నాయి. 4 గురు ప్రయాణీకులను తీసుకువెళ్లే కారుకు కావలసిన స్థలం కన్నా, అంతమందినే తీసుకువెళ్లే ఆటోకు మూడవ వంతు స్థలం అవసరం. అయినా ఆటోలవల్లే ట్రాఫిక్ అంతా అస్థవ్యస్థమౌతున్నదంటూ, కార్లకోసమే వేల కోట్ల రూపాయలు వెచ్చించి, ఇళ్లు కూలగొట్టి, స్వయంఉపాధినిచ్చే షాపులను తొలగించి రోడ్లు ఖెడల్పు చేస్తున్నారు. ఏ ఇంధనమూ అవసరంలేని, ఆరోగ్యకరమైన సైకిళ్లతో ఈ రోడ్లపై ప్రయాణించడం ప్రాణాలతో చెలగాటమైంది. ఈ వక్తిగత వాహనాలలో 80 శాతం వరకూ ఆరు మహానగరాలలోనే వున్నాయంటే నగరాలలో వాయుకాలుష్యానికీ, తత్పర్యవసానంగా నగర జీవుల అనారోగ్యానికీ ఎలా కారణమౌతున్నాయో వేరుగా వివరించనక్కరలేదు. పర్యావరణ దినోత్సవం నాడే ధరల పెంపుదల రావటం, ఒకేచోటకు వెళ్లుతున్నవారు వేరువేరు కార్లలో కాకుండా ఒకే కారులో వెళ్లటం వంటి పరిష్కారాలను సూచించటం విచిత్రంగానే వుంది. ఇది ధనికుల ఖర్చును తగ్గిస్తుందే తప్ప కార్ల వినియోగాన్ని తగ్గించదు. అసలు కారణాలను తొలగించకుండా చిట్కాలను పరిష్కారాలుగా చూపుతున్నారు. అణు ఇంధనంతోనహా సాంప్రదాయేతర ఇంధనంపై కేంద్రకరించాలని ప్రధాని అన్నారు. పెట్రో ధరల పేరుతో అమెరికాతో అణుఒప్పందాన్ని ఒప్పించజూస్తున్నారు. అణుఇంధనం కోసం అమెరికాపై ఆధారపడే విధానమిది.

పేదల పేరిట ధనికులకు సబ్సిడీలు

డీజిలు రేటు పెంపుదల వల్ల డీజిలు పంపుసెట్లు వాడే రైతాంగం స్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టయ్యింది. ప్రభుత్వాల నుండి ఏ మద్దతూ అందక సాగుభారమై అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతాంగానికి ఇది పెనుభారమే. బస్సు, లారీల రవాణా ఛార్జీలు పెరిగి, ధరల పెరుగుదల రూపంలో ఆ భారమంతా ప్రజలపైనే పడుతుంది మరోవైపున ఐదు నుండి 50 లక్షల ఖరీదు చేసే కార్లను కొన్న ధనాఢ్యులు డీజిలు వాడుతున్నారు. 3 రూపాయలు పెంపుదల వారికే మాత్రమూ భారం కాకపోగా, పెట్రోలుతో పోల్చినప్పుడు లాభదాయకంగా వుంది. దీనితో డీజిలు కార్లు పెరుగుతున్నాయి. జనాభాలో 15 శాతంగా వున్న ధనిక వర్గాల కార్ల వాడకాన్ని పెంచే విధంగా ధరలు నిర్ణయించి, నాలుగు కార్ల తయారీ గుత్త కంపెనీలు దేశవనరులను తరలించుకుపోయేందుకు వీలైన విధానాలను ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఒక్క మారుతీ కార్ల సుజకీ కంపెనీ గత ఏడాది రాయల్టీ పేరిట 100 కోట్లు, విడిభాగాల పేరిట 700 కోట్లు తరలించుకు పోయింది.

భారతదేశాన్ని పాలిస్తున్న దోపిడీ వర్గాలు ప్రజల జీవితాలను నానాటికీ దుర్భరం చేస్తున్నాయి. ప్రజల ఆదాయాలను కొల్లగొట్టి తమ జేబులు నింపుకుంటున్నాయి. దేశ సహజ, ఆర్థిక, మానవ వనరులన్నింటినీ సామ్రాజ్యవాదులపరంచేసి మన పిల్లల జీవితాలను కారుచీకటిలోకి నెట్టివేస్తున్నాయి. పాలకుల ఈ దాడిని తిప్పికొట్టేందుకు ఈ క్రింది డిమాండ్లతో ప్రజలు ఉద్యమించాలి.

- పెంచిన డీజిలు, వంటగ్యాసు ధరలను తగ్గించాలి!
- ప్రజా రవాణా సాధనాలైన రైల్వేలు, బస్సులకు డీజిలు తక్కువ రేటుకివ్వాలి!
- వ్యక్తిగత మోటారు రవాణా వాహనాల వినియోగంపై ఆర్థికనియంత్రణ విధించాలి!
- ప్రజారవాణా వ్యవస్థలను విస్తరించి, పటిష్టం చేయాలి!
- దేశీయ చమురు ఉత్పత్తిని పెంచి, దిగుమతులను తగ్గించే విధంగా ధరల విధానం వుండాలి!
- పెట్రోలియం రంగం ప్రభుత్వ అధీనంలో వుండాలి.
- ఈ రంగంలో విదేశీ కంపెనీలన్నింటినీ తొలగించాలి.
- సమగ్ర ఇంధన వినియోగ విధానాన్ని ప్రజా ప్రయోజనాల దృష్టితో రూపొందించాలి!
- తరిగిపోని ఇంధన వనరులపై (గాలి, నీరు, సూర్యరశ్మి) కేంద్రీకరించాలి.
- ప్రత్యామ్నాయంగా అణుఇంధనాన్ని ప్రతిపాదించరాదు.

విప్లవ కమ్యూనిస్టు పక్ష పత్రిక

విప్లవోద్యమ అభివృద్ధి క్రమాన్నీ, దానిలో వచ్చిన ధోరణుల్నీ ఆచరణ ఫలితాలనూ సావధానంగా చర్చిద్దాం!

విశ్వం

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమమూ, భారత విప్లవోద్యమమూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ముందుకు వస్తున్నది. ఈ క్రమంలో రాజకీయ, సిద్ధాంత, ఉద్యమ, నిర్మాణ సమస్యలు ఉత్పన్నమైనాయి. ఒకప్పటిదానిలో భాగంగానే నేడు సిపిఐ(ఎం-ఎల్)గా వున్న మా నిర్మాణం కూడా వీటినెదుర్కొంటూ వున్నది. నేటి మా నిర్మాణం 1969 నాటి ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు కమిటీ: ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు కమిటీ (విప్లవకారులు), భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (మార్క్సిస్టు-లెనినిస్టు) (యుసిసిఆర్ఐ (ఎం-ఎల్); సిపిఐ(ఎం-ఎల్)-జనశక్తి; సిపిఐ(ఎం-ఎల్) -జనశక్తి, సిఓసి: సిపిఐ(ఎం-ఎల్) యూనిటీ ఇనిషియేటివ్ లలో కొనసాగుతూ నేటి సిపిఐ(ఎం-ఎల్)గా రూపొందింది. అందులో భాగమే నేటి మా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ.

మా ఈ నిర్మాణానికి నిలకడైన రాజకీయ విధానం వుంటూ వచ్చింది. పట్టువిడుపులతో కూడిన ఎత్తుగడల విధానం, నిలకడైన కేడరు పునాది, ప్రజాపునాది కలిగి వుంది. ఇది ఒక సజీవమైన రాజకీయ శక్తిగా గుర్తింపు కలిగివుండి ఎదుగుతున్నది. రాజకీయ, సైద్ధాంతిక, ఉద్యమ, నిర్మాణపర విషయాలలో ఇతర నిర్మాణాల నుంచి విమర్శలనూ, దాడులనూ, విచ్ఛిన్నాలనూ ఎదుర్కొంటూ నిలబడుతున్నది.

1969లో తలెత్తిన అవకాశవాద పెడధోరణులను సిద్ధాంత రీత్యా, ఆచరణరీత్యా, నిర్మాణరీత్యా ఎదుర్కొన్నది. ఈ సంఘర్షణలో ఆనాటి నాయకత్వం రెండుగా చీలిపోయింది ఒకటి- టి.ఎన్. డి.వి. నాయకత్వాన రూపొందించుకున్న విధానాలను కాపాడుకొంటే రెండవది- సి.పి. నాయకత్వాన వాటి నుండి వైదొలగి అతివాద, ఒంటెత్తువాద లక్షణాలను సంతరించు చేసుకోవటమే కాకుండా, అతివాద. ఒంటెత్తువాదాన్ని ఒక ప్రత్యేక విధానంగా, ఎత్తుగడల ఉద్యమానికి ఒక జోడింపుగా సిద్ధాంతీకరించుకున్నది. ఈ ధోరణి వామపక్ష అతివాద సెంటిమెంటు, ఆయుధాల పట్ల ఆకర్షణల ఆసరాతో ఒక విధానంగా ముందుకు వచ్చింది. ప్రజల నిర్మాణశక్తికంటే, ప్రజాప్రతిపటనాశక్తికంటే, సాయుధ దళాల బలంతో, పాక్షికమైన పోరాట పద్ధతులతో దోపిడీవర్గాల నుంచి ప్రజలను విముక్తి చేయగలమనే విధానాన్ని పాటించింది. ఈ ఆకర్షణ, సెంటిమెంటు విధానాలను తట్టుకొని, అన్ని రంగాల్లో మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని ప్రాతిపదికగా చేసుకొని కృషి చేస్తూ వచ్చినదే నేటి సిపిఐ(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ.

ఆనాటి విభేదాలు విప్లవ పంథాకు సంబంధించినవే కాక, దేశ ఆర్థిక-రాజకీయ స్థితిగతులూ, విప్లవ పరిస్థితిలోని స్వీయాత్మక-భౌతికమైన అంశాల మధ్య ఉండవలసిన సంబంధాన్ని గురించిన అవగాహనలో తేడాలూ; ప్రజాతంత్రవాదులూ, మేధావులూ, సాహిత్య కారులూ, వారి వారి సంఘాలూ నూతన ప్రజాతంత్ర విప్లవంలో నిర్వహించవలసిన పాత్ర ఎలా వుండాలి అన్న అంశంలో తేడాలూ వున్నాయి. వీటన్నింటిలోనూ రెండు అభిప్రాయాలూ, విధానాలూ చర్చలలోనూ, ఆచరణ లోనూ ఆనాడు సంఘర్షించుకున్నాయి.

చారుమజుందార్ నాయకత్వంలో సాగిన అతివాద, ఒంటెత్తువాదం, వ్యక్తిగత హింసావాదాల నుండి ఈ రెండు విధానాలూ విడగొట్టుకుని వ్యవహరించాయి. అయినా చంద్రపుల్లారెడ్డి నాయకత్వాన వున్న నిర్మాణం బూర్జువా ఆస్థిపరవర్గ ఆధిక్యతా భావానికి గురై, చారుమజుందార్ నాయకత్వానవున్న ఆనాటి సిపిఐ (ఎం-ఎల్) అనుసరిస్తున్న విధానాల పట్ల తామెందు లోనూ తక్కువ కాదు అన్న వైఖరిని చేపట్టింది. రాజకీయ, సిద్ధాంత విషయాలలో విప్లవ ప్రజా ఉద్యమ విధానాలకీ, అతివాద-ఒంటెత్తువాద వ్యక్తిగత హింసావాద విధానాలకీ మధ్యన నిలబడే ఒక నిర్మాణాన్ని రూపొందించి, ఆచరించామనీ, రెంటినీ ఛాంపియను చేస్తున్నామనీ చెప్పుకుంది.

ఈ విధానాల ఆచరణ-వాటి పర్యవసానాలూ తర్వాతి కాలంలో ఆ నిర్మాణంలోనే పరిశీలనకు వచ్చాయి. దానిపై ఆ నిర్మాణం తీవ్ర ఆంతరంగిక చర్చలకు గురై ఒక్క నిర్మాణంగా వుండలేక-పలు చీలికలకు గురైంది. కామ్రేడ్ సత్యన్నారాయణసింగ్ నాయకత్వాన వున్న తాత్కాలిక కేంద్ర కమిటీ సి.పి.ఐ (ఎం-ఎల్) ప్రావిజనల్ సెంట్రల్ కమిటీలో చేరిపోయి-విడిపోయిన వాటిలోని ఒక శాఖగా నేటి సిపిఐ(ఎం-ఎల్)

> **విప్లవకారులందరి లక్ష్యం, ఆశయం ఒకటైనపుడు వారు వేరువేరుగా గడించిన అనుభవాలు గూడా అందరివి కాగలగాలి. అందులోని పొరపాట్లకు, తప్పులకు అందరం బాధ్యత వహించాలి. వాటి మూలంగా వచ్చే గొప్పతనం మొత్తం విప్లవోద్యమం యొక్క గొప్పతనంగానే అంతిమంగా మిగులుతుంది.**

న్యూడెమోక్రసీ వుంది. మిగిలిన శాఖలు వివిధ నిర్మాణాలుగా అఖిల భారత స్థాయిలోనూ, కొన్ని రాష్ట్ర స్థాయిలోనూ కొనసాగుతూ కూడా వున్నాయి.

ఇక చారు మజుందార్ నాయకత్వంలోని సిపిఐ (ఎం-ఎల్), దాని ఒంటెత్తు విధానాలూ, వ్యక్తిగత హింసా విధానాల ఫలితంగా 1970-71లో ఆంతరంగిక సంఘర్షణలకు లోనై వివిధ నిర్మాణాలుగా చీలిపోయింది. చారు మజుందార్ నాయకత్వాన గల సిపిఐ(ఎం-ఎల్) విధానాలకు నుంచి కొంతమంది వ్యవస్థాపక నాయకులతో సహా ముఖ్యులు విడగొట్టుకుని తమ తమ నిర్మాణాలను ఏర్పరచుకున్నారు. మరికొందరు ఆ విధానాలను సంస్కరించిన రూపంలో అమలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో ఏర్పడిన నిర్మాణం అలాంటిదే.

1975 నాటికి ఈ నాలుగు ధోరణులు గల నిర్మాణాలన్నీ తమ తమ శైలిలో రాజ్యానికీ, రాజ్యపు సామ్రాజ్యవాద అనుకూల, ఫ్యూడలు అనుకూల విధానాలకూ వ్యతిరేకంగా ప్రచార, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాయి. ఇది వాటి మధ్యనున్న సామాన్యాంశం(కామన్ పాయింట్). ఎమర్జెన్సీ తదనంతరం పాలకవర్గాల విధానాలనూ, నిర్బంధాన్ని ఎండగట్టడంలో ఐక్యత వున్నట్లు కనపడినా, తిరిగి ఎన్నికల విషయంలో విభేదాలు తలెత్తాయి. ఎమర్జెన్సీ తదనంతర కాలంలో ఏర్పడిన ప్రభుత్వాలను అంచనా వేయడంలోనూ; ఏర్పడిన వెసులుబాటులను వినియోగించు కోవటంలోనూ అతివాద ఒంటెత్తు, మితవాద ఒంటెత్తువిధానాలూ; పాలక మురాల పట్ల భ్రమాపూర్వక విధానాలూ-విప్లవకారుల మౌలిక డాక్యుమెంట్లను కుదుపుకు గురిచేశాయి ఎన్నికలను వినియోగించు కోవటం, ప్రజాసంఘాల నిర్మాణం, వాటి దృక్పథం- ఆచరణా, ప్రధాన వైరుధ్యాన్ని నిర్వచించటంలో పునరాలోచనా, ప్రజా ప్రతిఘటన, సాయుధ దళాల "ప్రతిఘటన"-దాని ఆచరణలు మరోసారి పరిశీలనకు వచ్చాయి. తీవ్రమైన విభేధాలతో విడిపోయి శత్రుపూరిత వాతావరణంలో నలుగుతున్న నిర్మాణాలు ఒకరినొకరు పరామర్శించుకోగల, సన్నిహితం కాగల అవకాశాన్ని పై పరిస్థితి కల్పించింది. అయినా చాలా పాక్షికంగా మాత్రమే ఈ సానుకూల వాతావరణాన్ని విప్లవ నిర్మాణాలు వినియోగించుకోగలిగాయి.

ఇదే సందర్భంలో సోషలిస్టు శిబిరం తన సారాన్ని కోల్పోవటం, సోషల్ సామ్రాజ్యవాదంగా మారిన రష్యా ప్రపంచాధిపత్యం కొరకు అమెరికాతో పోటీపడటం, చైనాలో సాంస్కృతిక విప్లవం పట్ల భిన్నాభిప్రాయాలు మొదలుకావటం, భారత పాలకుల వర్గ స్వభావం గురించి తికమకల్కు, కొన్ని గందరగోళాల మధ్యన కూడా, మౌలిక విబేధాలపై చర్చ లేకుండానే, ఈ నిర్మాణాలు తమ, తమ శైలిలో గిరిజన, రైతుకూలీ, కార్మిక జన బాహుళ్యంలో కృషి చేశాయి. ఫలితంగా పునాది వర్గాల ప్రజా ఉద్యమాలు ప్రజ్వరిల్లాయి. తూర్పుగోదావరి, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్‌జిల్లాల్లో ప్రజలు మిలిటెంటు ఆందోళనలూ, పోరాటాలూ సాగించారు. నాటి మా యు.సి.సి.ఆర్.ఐ(ఎం-ఎల్) పాత శ్రీకాకుళం జిల్లాలో గిరిజన సంఘాన్ని పునరుద్ధరించింది. వీటన్నింటి ప్రభావంతో అనేక రాజకీయ శక్తులూ, ప్రజలూ విప్లవశక్తుల వైపు చూడసాగారు. తూర్పు గోదావరిజిల్లా కొండమొదలు ప్రజానీకం మా నాయకత్వాన దోపిడీ వర్గాల, రాజ్యాంగ శక్తులదాడులను సాంప్రదాయక ఆయుధాలతో త్రిప్పికొట్టారు. 1982 నవంబరు 28న ప్రజలే నిజమైన వీరులని మరోసారి నిరూపితమైంది. కొండమొదలు కొండ ఎక్కదూ, దిగదూ అని శాపనార్థాలు పెడుతున్న వారికి ఆ పరిమిత ప్రాంత ఉద్యమం తగిన సమాధానమిచ్చింది. వరంగల్లు, జగిత్యాల, సిరిసిల్లల్లో ఫ్యూడలు భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను ఆర్గనైజ్ చేసిన ఫలితంగా ప్రజల పాత్రా, భూస్వామ్య వ్యతిరేక రాజకీయాలపాత్ర మరొకసారి ముందుకు వచ్చింది.

ఈ కాలంలో తెలంగాణాలో రెండు, మూడు, నాలుగు విప్లవ గ్రూపులు వాటి వాటి పంథా విశిష్టతను నిరూపించుకునే ప్రయత్నంలో "పరస్పర హరణోద్యమా"న్ని సాగించాయి. దీని ఫలితంగా భూస్వామ్య వ్యతిరేక మిలిటెంటు పోరాటాలు గందర గోళంలో పడ్డాయి. సరిగ్గా ఈ కాలంలోనే యీ ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న నిర్మాణాలు తిరిగి చీలికలకు గురయ్యాయి. సాయుధ పోరాట విరమణ చేశామన్న నాటి పీపుల్సువార్ (నేటి మావోయిస్టు) పార్టీలో విబేధాలు మొదలయ్యాయి. ఆ గ్రూపు నిర్మాతలు(కొండపల్లి, సత్యమూర్తులు) దాని నుండి వైదొలిగారు. పుల్లారెడ్డి గ్రూపు అఖిలభారత స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో మూడు, నాలుగు చీలికలకు గురైంది (ఎస్.ఎన్.ఎస్.తో ఒక చీలిక. ఓడి సేకేలతో మరో చీలిక, పైలా వాసు. రవి. చంద్రంలతో మరో చీలిక) మితవాద అవకాశవాదుల్ని, ప్రతిఘటనా పోరాట వ్యతిరేకుల్ని ఓడించమని పుల్లారెడ్డి. పుల్లారెడ్డి అరాచక రాజకీయాలను ఓడించమని సిపిఐ(ఎం-ఎల్) ప్రజాపంథా నిర్మాతలు పిలుపునిచ్చారు. సరిగ్గా వారి మధ్యన ఈ ఆంతరంగిక సంఘర్షణ మొదలైన కాలంలోనే, ఆ ఐక్య నిర్మాణంతో నాటి యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) ద్వైపాక్షిక చర్చలు ప్రారంభించింది. ఈ చర్చల్లో ఐక్యకార్యక్రమాలు సాగించాలని నిర్ణయించుకున్న దశలో, ఆ పార్టీ పైన పేర్కొన్న విధంగా చీలిపోయింది.

దీనికి ముందు యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) ఎమర్జెన్సీలో కేంద్ర స్థాయిలో రెండుగా చీలిపోయింది. ఎమర్జెన్సీ తదనంతర పరిస్థితిని అంచనా కట్టడం, ఎన్నికలు తదితర అంశాలపై విబేధాలు మొదలై, సిద్ధాంత పోరాటమా? లేక ఉద్యమ నిర్మాణమా? దేనికి ప్రాధాన్యత యివ్వాలి? అన్న అంచుల దాకా ఆంతరంగిక చర్చలు సాగాయి. రాష్ట్ర కమిటీ కార్యదర్శి రామ లింగాచారి కేంద్ర కమిటీ కార్యదర్శి డివికి వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీని, క్యాడరును త్రిప్పాలని విఫలయత్నం చేశాడు. అతివాద పెడధోరణికి గురై దెబ్బతిన్న శ్రీకాకుళం గిరిజనోద్యమాన్ని పునర్నిర్మించే బాధ్యతగల కమిటీకి నాయకుడిగా కృషి మొదలుపెట్టి ప్రాథమిక ఫలితాలు సాధించిన ఆత్మ సంతృప్తి చెందాడు. కూడగట్టిన నిర్మాణ శక్తులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ అడ్రసులేనిదిగా మారిపోవటంతో, తను ఒంటరిగా మిగిలిపోయి వాగాడంబర రాజకీయా లను ఆశ్రయించాడు. అంతేకాక తెచ్చిపెట్టుకున్న గంభీరతతో పార్టీలో వాతావరణ మాయని సృష్టించి, పార్టీ కార్యదర్శి బాధ్యతకూ, రాష్ట్ర కమిటీకీ రాజీనామా చేసి(1977 అక్టోబర్-నవంబర్), నిర్దిష్ట విప్లవ నిర్మాణ బాధ్యత నుండి వైదొలగి వాగాడంబరాన్ని ఆశ్రయించాడు. ఇతరులపై పనికిమాలిన వెటకారం చేసే ప్రక్రియను చేపట్టి, ఏ అనుభవాన్నీ విప్లవ ప్రజానీకానికి, నేటి తరానికీ అందకుండా చేసిన 'ఘనాపాటి'. ఈ ఘనాపాటిని నిలబెట్టుకోలేదనీ, ఇముడ్చుకోలేదనీ మా నిర్మాణాన్ని తెలిసో తెలియకో ప్రశ్నించేవాళ్లు -ఆ నాయకుడి బాధ్యతనూ, పాత్రనూ ప్రశ్నించకుండా, ఉద్యమాన్ని నిర్మాణాన్ని నిలకడగా సాగిస్తున్న మా నాయకత్వాన్ని దానికి బాధ్యులను చేయటం గత పాతిక సంవత్సరాలుగా సాగుతూనే వుంది.

> **మా ఈ నిర్మాణానికి నిలకడైన రాజకీయ విధానం వుంటూ వచ్చింది. పట్టువిడుపులతో కూడిన ఎత్తుగడల విధానం, నిలకడైన కేడరు పునాది, ప్రజాపునాది కలిగి వుంది. ఇది ఒక సజీవమైన రాజకీయ శక్తిగా గుర్తింపు కలిగివుండి ఎదుగుతున్నది. రాజకీయ, సైద్ధాంతిక, ఉద్యమ, నిర్మాణపర విషయాలలో ఇతర నిర్మాణాల నుంచి విమర్శలనూ, దాడులనూ, విచ్ఛిన్నాలనూ ఎదుర్కొంటూ నిలబడుతున్నది.**

ఆ తర్వాత రెండేళ్లకు(1981 ప్రారంభంలో) టి.వి ఏకపక్షంగా నాటి మా నాయకత్వాన్ని మితవాదులనీ, మరుగుజ్జులనీ పేర్లుపెట్టి, ప్రత్యామ్నాయ నిర్మాణాన్ని సాగిస్తున్నామని ముద్రవేసి, ప్రజా ఉద్యమాల్నీ, ప్రజాసంఘాలనూ, పార్టీనీ ఆఘమేఘాల మీద చీల్చి వేశాడు. ఈ ముద్ర వేసిన కాలంలోనే తూర్పు గోదావరి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కోరాపుట్ జిల్లాల్లో పార్టీ నిర్మాణ, ప్రజా ఉద్యమ నిర్మాణ కృషిలో నిమగ్నమై వున్నాం. బయటి ప్రపంచానికి వెల్లడించుకోని ఫలితాలను పొందుతున్న కాలమది. మితవాద, ఒంటెత్తు పోకడతో తోటి నిర్మాణాల సిద్ధాంత విభేధాలను పేకేజ వేసుకోవటంతో సరిపెట్టుకుని, ఒక రకపు అచేతనలోకి జారిపోయిన నాయకుడు. శ్రీకాకుళం గిరిజనోద్యమాన్ని పునర్నిర్మించడం తన వల్లనే సాధ్యమని గిరిజనోద్యమంలోని కొన్ని శక్తుల్ని తన వెంట తీసుకువెళ్ళాడు. ఆ తర్వాత మరొక నాయకుడు మరోసారి మాకు మితవాద అవకాశవాదులమని ముద్రవేసి సరైన దిశలో వర్గ పోరాటాన్ని నడిపేది తానేనని ఇంకొద్దిగా మిగిలిన వాళ్లను చేరదీశాడు. 1969 నాటికి నిర్మితమై, ఆ తర్వాత అతివాద అవకాశవాదానికి బలయిన శ్రీకాకుళం గిరిజన ప్రాంతం పైన పేర్కొన్న ముగ్గురి నాయకుల నిర్మాణం క్రిందనే వుంది. గిరిజన ప్రాంతం మరోసారి వీరి అవకాశవాద రాజకీయాలకు కేంద్రమయింది.

ఇక ఉద్ధాన ప్రాంతంలో మెజారిటీ భాగం పుల్లారెడ్డి నాయకత్వాన వున్న నిర్మాణంతోనూ, తర్వాత ప్రజా పంథాలోనూ వుంది. ఆ నిర్మాణంలో వివిధ సందర్భాల్లో వచ్చిన చీలికల ఫలితంగా సంఘటిత ప్రాంతంగా నిలబడలేకపోయింది. ఇంకా మిగిలిన ఉద్ధాన ప్రాంతంలో లిబరేషన్, లిన్‌పియావో, పీపుల్స్‌వార్ గ్రూపులు తమ తమ నిర్మాణాలను కొనసాగిస్తున్నాయి.

ఈ నిర్మాణాలన్నీ శ్రీకాకుళం జిల్లాలో వుండి, శ్రీకాకుళం గిరిజనోద్యమాన్ని పునర్నిర్మించే మాట అటుంచి, తమ తమ అవకాశవాద రాజకీయాలకు ఈ ప్రాంతాన్ని ప్రయోగశాల చేశాయి ఈ దివాళాకోరుతనాన్ని-కప్పిపెట్టుకోవటానికి, శ్రీకాకుళం గిరిజనోద్యమాన్ని పునరుద్ధరించటంలో మా నిర్మాణం విఫలమయిందనీ, అందుకు మా మితవాద రాజకీయాలే కారణమనీ నిందా ప్రచారం చేస్తున్నారు. తామెందుకు పునర్నిర్మించలేక పోయారో ఒక్క మాటకూడా చెప్పరు. తమ సమీక్షలేమిటో తెలియనివ్వరు.

1984లో మా నిర్మాణం (నాటి యు.సి.సి.ఆర్.ఐ (ఎం-ఎల్) కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డితో మొదలుపెట్టిన ఐక్యతా చర్చలు ఆ నిర్మాణంలోని చీలికల ఫలితంగా గందరగోళంతో నడిచాయి. చంద్రపుల్లారెడ్డి నుండి విడిపోయిన ప్రజాపంథా నాయకత్వం అనుసరించిన ఐక్యతా విధానం (వచ్చి మాలో చేరండన్న ఐక్యతా వైఖరి) ఫలితంగా అనేక ఐక్యకార్యాచరణలు సాగినప్పటికీ ఐక్యతగా పరిణమించలేదు. మేము ఇతరులతో ఐక్యతా చర్చలు సాగిస్తూన్నప్పటికీ, మా నిర్మాణాన్ని దృఢపరచు కొనే పార్టీ ఆంతరంగిక పోరాటాన్ని ఎన్నడూ విడిచి పెట్టలేదు. ఆటంకాలను అధిగమిస్తూ, ఆర్థిక లోటులు, అనేక నిర్మాణ ఒడిదుడుకుల మధ్యనే కార్యకలాపాలు సాగించుతూ వచ్చాం. అవసరమైన స్థాయిలో ఒక పార్టీకి కావాల్సిన అన్ని ఏర్పాట్లతో మా కృషిని కొనసాగిస్తూ వున్నాం. ఈ కృషిలో హృదయపూర్వకంగా అంకితమై కొన్ని దశాబ్దాల కాలం పని చేసిన కామ్రేడ్స్ వున్నారు. వారిలో కొంతమంది అలసిపోయి వెనక్కి తగ్గారు. కొంతమంది ఇతర రాజకీయ ధోరణులు చేపట్టి మా నిర్మాణంలో వాటిని చలామణి చెయ్యాలని విఫలయత్నం చేసి వైదొలగిపోయారు. ఇటువంటి వారి చర్యలతో మా నిర్మాణం కొన్ని నష్టాలకు గురైనప్పటికీ నిలదొక్కుకొన్నది. పార్టీలో నిరంతర సంఘర్షణతో పార్టీ స్థాయినీ, రాజకీయ నిర్మాణ విలువలనూ నిలబెట్టుకుంటూ వస్తోంది. ఇది ఒక విప్లవ పార్టీకి వుండవలసిన అత్యంత సహజమైన గతిక్రమం. దీనికి మేము గర్వపడుతున్నాం. ఈ సందర్భంగా మేము కొంత మంది నాయకులను కించ పరిచామనే, కార్యకర్తలను కించపరిచామనే, బయటకు గెంటివేసామనే వాదనలకు తావేలేదు.

సరిగ్గా ఈ కాలంలోనే కొంతమంది మేధావులు రంగం మీదకు వచ్చారు. గొప్ప చదువులూ, గొప్ప అధ్యయనాలు చేశామన్న అహంభావప్రదర్శనలో మిడిమిడి జ్ఞానంతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని సమీక్షించటం మొదలు పెట్టారు. ఇంతవరకూ చరిత్రకు అందని నూతన కోణాలను ఆవిష్కరిస్తున్నామంటూ నిజమైన చరిత్రను

[illegible] శకాల అజెండాకు పరిష్కారంగా చూపారు. వీరి కోణం నుండి ప్రారంభమైనా(కుల, మత, ప్రాంతీయ వగైరా) చివరకు వర్గ పోరాటాన్ని తిరస్కరించే అంతిమలక్ష్యం దగ్గరకే చేరారు. కొత్త బిచ్చగాళ్లూ అక్కడికే చేరుతున్నారు.

మార్క్సిజంపైనా-విప్లవోద్యమాలపైనా దాడులు

1980 దశకంలో మార్క్సిస్టు సిద్ధాంతంపైనా, దాని ఆచరణపైనా ప్రతీపశక్తులు మరోసారి దాడిని ఎక్కుపెట్టాయి. వర్గాలకు ఉనికిలేదనీ, వర్గపోరాటానికి కాలం చెల్లిందనీ, ప్రజలు వర్గాలతో సంబంధం లేకుండా సమూహాలుగా గుర్తింపులకోసం ఉద్యమిస్తారనీ, ఇవే సమాజాన్ని సంస్కరిస్తాయన్న వాదనలతో ముందుకు వచ్చారు. వీటికే ఆధునికానంతరవాదమనీ, సబ్‌ఆల్టర్న్ వాదమనీ సిద్ధాంత ముసుగులు తొడిగారు. కాలం చెల్లిన ఉత్పత్తి సంబంధాలైన ఫ్యూడలిజంతో చేతులు కలిపి, దానికి ప్రాణం పోస్తూ పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాదం మరణశయ్యపై తన జీవితకాలాన్ని పొడిగించుకొనేందుకు సాగిస్తున్న నయావలస దోపిడీ అణచివేతలతో మానవళి పురోగమనాన్ని అడ్డుకుంటున్నది. ఫలితంగా అన్ని వర్గాల, సెక్షన్ల ప్రజలకూ, జాతులకూ, దేశాలకూ ఈ దోపిడీ వ్యవస్థ బందిఖానా అయింది. వర్గాల మధ్య, ప్రజల మధ్య, జాతులమధ్య, దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యత్యాసాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఊపిరాడకుండా చేస్తున్న ఈ పరిస్థితి నుండి బయట పడాలన్న ప్రజల ఆశలూ, ఆకాంక్షలూ ప్రజాస్వామిక డిమాండ్లుగా పెల్లుబుకుతున్నాయి. ఈ ప్రజాస్వామిక డిమాండ్లకు ఛాంపియన్లుగా కమ్యూనిస్టు విప్లవకారులు నిలబడాల్సి వుంది. ఒంటెత్తు పోకడలతో వీటిని పట్టించుకోకుండా రంగాన్ని దోపిడీ వర్గాలకు వదిలి వేయటం విప్లవకారులలోపం కాగా, పాలకవర్గాలు పథకం ప్రకారం వర్గపోరాటానికి ప్రత్యామ్నాయంగా ఆధునికానంతర, సబ్‌ఆల్టర్న్ వాదాలను ముందుకు తెచ్చాయి. ఢిల్లీ జెఎన్‌యుతో మొదలుపెట్టి రాష్ట్రానికొక విశ్వ విద్యాలయాన్ని ఎంచుకొని ఈ వాదాలకు పీఠాలనేర్పరచి అధ్యయనాల పేరిట మేధావులను కొనివేసి మార్క్సిజానికి వ్యతిరేక ప్రచారంలోకి వారిని దింపాయి. అవి విప్లవ నిర్మాణాలపై కేంద్రీకరించి దాడి చేసాయి. ఈ దాడిని మా నిర్మాణం కూడా ఎదుర్కొంది. నిర్మాణం లోపల ఈ వాదనలు తెచ్చినవారు పార్టీ ఆంతరంగిక చర్చకు నిలవలేక వైదొలగిపోయారు ఇలా వివిధ విప్లవ నిర్మాణాల నుండి వైదొలగినవారే ఈ శ్రామికవర్గేతర సిద్ధాంతాలకు ప్రచారకులుగా ఆంధ్రప్రదేశ్‌లో ముందుకు రావటం విచిత్రమనిపించినా, వివిధ విప్లవ నిర్మాణాలు తమ శ్రేణుల వర్గ రాజకీయ, సిద్ధాంత చైతన్య పెంపుదల పట్ల వహించిన నిర్లక్ష్యాన్ని కూడా సూచిస్తున్నది. కొన్ని విప్లవ నిర్మాణాలు ఈ దాడికి తలవంచి, ఏదో ఒక రూపంలో ఏదో ఒక మేరకు దానిని ఆమోదించగా, మరికొన్ని గాలికి ఊగిపోయే ఆకుల్లా ఈ దాడికి అల్లాడిపోయి, తమ నిజాయితీని నిరూపించుకునే ప్రయత్నాల్లో పడ్డాయి. ఆంతరంగిక పార్టీ సంఘర్షణను నడపటంలో పూనిక వహించిన మా నిర్మాణం ఈ దాడిని ఎదుర్కొని వర్గపోరాట పతాకాన్ని సమున్నతంగా నిలుపగలిగింది.

నిరంతర పోరాటాల నుండి బోల్షివిక్ నిర్మాణం ఏర్పడుతుందన్న అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ అనుభవాలను జీర్ణించుకొని మా నిర్మాణం నడుస్తూ వచ్చింది. అన్యవర్గ ధోరణులపై రాజకీయ, సిద్ధాంత పోరాటాన్ని సాగిస్తూనే, కేంద్రీకరించి ఉద్యమ నిర్మాణానికి చర్యలు తీసుకుంది. కొన్ని పాకెట్లలో ఉద్యమాలను నిర్మించింది. మరింత ధృఢ నిర్ణయంతో కొత్త పాకెట్లను ప్రారంభించింది. విప్లవ ప్రజాపంథాను ఆచరించి చూపాలనుకున్నది. చేసి చూపింది.

ఈ పరిణామాలు సాగుతున్న సమయంలోనే, ఐక్యతాక్రమం కూడా సాగింది. 1991-92 లో మూడు విప్లవ సంస్థల మధ్య చర్చల ద్వారా త్రైపాక్షిక ఐక్యతను సాధించటంలో మా నిర్మాణం భాగస్వామిగా వుంది. స్వల్పకారణాలు, తప్పుడు సమాచారంపై ఆధారపడి, వాటినే సాకులుగా చూపి ఒకడుగు ముందుకు వేసిన ఐక్యతాక్రమం నుండి నేటి న్యూడెమోక్రసీ నాయకత్వం వెనక్కు తగ్గింది. మిగిలిన రెండు నిర్మాణాలు ఐక్యతా క్రమాన్ని కొనసాగించాయి. కార్యక్రమం, పంథాలకు సంబంధించిన అనేక అంశాలపైన ఐక్య డాక్యుమెంట్లను రూపొందించగలిగాయి. ఏర్పడిన ఐక్య నిర్మాణం, కొత్త నిర్మాణమే తప్ప ఒక నిర్మాణంలో మరొక నిర్మాణం చేరటంగా ఎవరూ భావించలేదు. సిపిఐ(ఎం-ఎల్) రెసిస్టెన్స్, యుసిసిఆర్(ఎం-ఎల్) స్థానంలో సిపిఐ (ఎం-ఎల్) జనశక్తి అన్న కొత్తపేరుతో వ్యవహరించాలని నిర్ణయించాయి. కార్యక్రమం, పంథాలలో కొన్ని సూత్రీకరణల పట్ల తేడాలున్నప్పటికీ పట్టువిడుపుల

బాధ్యత నిర్వహించకుండా, వాటిని వదిలివేసి వెళ్లినవారి గురించి పల్లెత్తు మాట కూడా అనకుండా, ఉద్యమాన్నీ, త్యాగపూరిత ఉద్యమశక్తులనూ, నాయకత్వాన్ని దృక్పధరహితులని నిరూపించేందుకు పూనుకోవటంలోనే వారి ద్రోహచింతన అర్థమవుతుంది.

వైఖరితో ఐక్యతను సాగించాయి.

అయితే ఈ నిర్మాణం ఏర్పడిన కొద్దికాలానికే కార్యక్రమం, పంథాలకు సంబంధించిన అంశాలపైన కంటే, ఆనాడు బయట అలుముకునివున్న ఆధునికానంతరవాదాలు నాయకత్వంలోని ఒక సెక్షన్ను ఆవరించాయి. నిర్మాణంలోని కొన్ని శక్తులు కమ్యూనిస్టు మూల సిద్ధాంతాలను ప్రశ్నార్థకం చేస్తూ, కమ్యూనిస్టు నిర్మాణమంటేనే నియంతృత్వమనీ, స్వేచ్ఛవుండదనీ, కమ్యూనిస్టులు నెలకొల్పిన విలువలూ సాంప్రదాయాలపై దాడిచేస్తూ తమ పవిత్ర స్వేచ్ఛా సిద్ధాంతాలను వ్యాప్తి చేయ మొదలుపెట్టాయి. చరిత్రను పునర్నిర్మించాలనే పేరుతో కమ్యూనిస్టు నిర్మాణాలపైనా, కమ్యూనిస్టు ఉద్యమంపైనా దాడులకు పూనుకున్నాయి. దాని ప్రభావం సిపిఐ(ఎం-ఎల్) జనశక్తిలోని శ్రేణులలోకి చొరబడింది. దానిని ఎదుర్కోవలసి వుండగా, అది చేయకుండా, నిర్మాణంలో చర్చ జరపకుండా ఆ విధానాలనే నిర్మాణంపై రుద్దేందుకు పూనుకోవటంతో ఆంతరంగిక సంక్షోభ మేర్పడింది. కార్యక్రమం, పంథా, ఐక్యతా ప్రకటనల్లో సాధించిన ఐక్యతా అవగాహనలకు విఘాతం ఏర్పడింది. ఇంతేకాక "తాకట్టులో భారతదేశం" గ్రంథంలో భారత బూర్జువా వర్గం దళారీ స్వభావం కలిగివుందా, లేదా అన్న సందేహంలో కాౖ తరిమెల నాగిరెడ్డి వున్నాడంటూ అపభ్రంశపూర్వక పరిశోధన మొదలుపెట్టాయి. చారుమజుందారు అతివాద రాజకీయాలు విప్లవ ప్రజా పంథాను అడ్డుకున్నాయనే విశ్లేషణ వుండకూడదని రెండవ ముద్రణగా అచ్చయిన "తాకట్టులో భారతదేశం" పుస్తకాల పంపిణీని నిషేధించింది. ఈ మొత్తం విషయాలపై గందరగోళం కల్పించి "పాత (Erst while) యుసిసిఆర్ఐ (ఎం-ఎల్) సెక్షను ప్రతిఘటనా పోరాటాలకు వ్యతిరేకి" అనీ, "మహిళా, దళిత ఉద్యమాలకు వ్యతిరేకి" అనీ, "దళాల నిర్మాణానికి వ్యతిరేకి" అనీ భావోద్వేగాలు రెచ్చగొట్టింది. కేడరును తప్పుదోవ పట్టించింది. వివిధ జిల్లాల్లో పై ధోరణిని వ్యతిరేకించిన వారిపైన కుట్రపూరితంగా వ్యతిరేకతలను రెచ్చగొట్టాయి; వత్తిళ్లను ప్రయోగించాయి. ఇలా ఎందుకు జరిగిందన్నది పరిశీలించవలసిన అంశమే

ఉద్యమాలు ఒక స్థాయి వరకూ పెరిగి ఆగి పోతున్నాయనీ, స్థంభనకు లోనవుతున్నాయనీ పాత సి.పి.ఐ. (ఎం.ఎల్) రెసిస్టెన్సీ నిర్మాణం అంగీకరించింది. దీని నుండి బయటపడి ఉద్యమాలను పురోగమింప చేయటానికి లోతైన సమీక్ష అవసరమనీ; విప్లవ పరిస్థితిలోని భౌతిక అంశం పట్ల స్థూలమైన అవగాహన నిర్మాణానికి వున్నప్పటికీ నిర్దిష్టతలోకి వచ్చి తగిన కార్యక్రమాన్ని రూపొందించాలనీ; అదే సమయంలో స్వీయాత్మక అంశమైన ఉద్యమ నిర్మాణ కృషిని కూడా విప్లవ ప్రజాపంథా వెలుగులో పరిశీలించి లోతైన సమీక్షకు గురిచేయాలనీ; ఇవి మాత్రమే ఉద్యమాల పురోగమనానికి హామీనివ్వగలుగుతాయనీ; జిల్లాల వారిగా ఇలాంటి సమీక్షలు జరిపి ఒక అవగాహనకు రావాలనీ సి.పి.ఐ. (ఎం.ఎల్) జనశక్తి రాష్ట్ర కమిటి నిర్ణయించింది.

ఇలాంటి సమీక్షకు సిద్ధపడని నాయకత్వంలోని ఒక సెక్షను దగ్గరిదారులను వెతక పూనుకుంది. ఐదు ప్రజాస్వామిక ప్రవాహాలంటూ, వీటిని పట్టించుకోనందువల్లనే కమ్యూనిస్టు ఉద్యమం భారతదేశంలో విఫలత చెందుతుందంటూ మార్క్సిస్టు-లెనినిస్టు విశ్లేషణ, నిర్మాణ పద్ధతులను గాలికి వదిలేశారు.

ఈ ధోరణిని రాష్ట్ర కమిటి సభ్యులు ఐదుగురు ఎదుర్కొన్నారు. కాబట్టి సిపిఐ(ఎం-ఎల్) జనశక్తిలోని విబేధాలు పార్టీ కార్యక్రమం, పంథాలలో వున్న తేడాలకంటే, కార్మికవర్గేతర అవగాహనలను పార్టీపై రుద్దేందుకు జరిగిన ప్రయత్నాల ఫలితమే. ఆ కాలంలో పెరిగిన ఐక్యతా కాంక్ష, సాధించిన ఫలితాలు, ప్రభావాలు అనతి కాలంలోనే సమసిపోయాయి.

దీని పర్యవసానమే సిపిఐ(ఎం-ఎల్) జనశక్తిలో చీలిక. పెదధోరణులనేదుర్కొన్న శక్తులు సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి-సిఓసిగా నిర్మాణయుతలైనారు. ఈ నిర్మాణం గత యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) నిర్మాణానికి సంబంధించిన వారు ప్రధాన భాగంగా, సిపిఐ(ఎం-ఎల్) రెసిస్టెన్సు నుంచి వచ్చిన కామ్రేడ్స్, ప్రజాపంథా నుంచి వచ్చిన కామ్రేడ్స్‌తో సి.పి.ఐ(ఎం-ఎల్) జనశక్తి సి.ఓ.సిగా రూపొందింది. సిపిఐ(ఎం-ఎల్) జనశక్తిలో వచ్చిన పెదధోరణులకు భిన్నమైన రాజకీయ, నిర్మాణ, ఉద్యమ దృక్పధాలను చేపట్టింది. యుసిసిఆర్ఐగా వున్న కాలంలో సాగుతూ వచ్చిన ఉద్యమాలను విడువకుండా కొనసాగిస్తూ వచ్చింది. వాటి అభివృద్ధికి కొన్ని చర్యలు చేబట్టాలని ఆలోచించింది. రెసిస్టెన్స్, ప్రజాపంథాలు సాగిస్తూ వచ్చిన ఉద్యమ కృషినీ వదిలిపెట్టలేదు. ఉత్తర కోస్తాలో ఈ ఐక్యత మరింత ప్రాముఖ్యతను సంతరింపజేసుకొన్నది. అంగీకృత డాక్యుమెంట్లకు భిన్నమైన దృక్పధాన్ని, కమ్యూనిస్టేతర సిద్ధాంత ప్రభావాలను ఈ ఉద్యమాలపై రుద్దటానికి చేసిన ప్రయత్నాల నుండి వాటిని కాపాడుకునే ప్రయత్నం ఉత్తర కోస్తా కమిటి నాయకత్వం చేసింది.. ఉద్యమాలకు సంబంధించి అనుభవజ్ఞులైన కామ్రేడ్స్ డివి, రామలింగాచారి గ్రూపుల నాయకత్వాన దెబ్బతిన్న పాత శ్రీకాకుళ ఉద్యమ ప్రాంతమంతా వుంది. అనేక అనుభవాలనుండి మేము ఆ ప్రాంతం నుంచి 1988-89 సంవత్సరం నుండి విరమించుకొన్నాం.

శ్రీకాకుళం జిల్లాలో మాకు మిగిలింది కా॥ లరుణ, కొంతమంది మధ్యతరగతి ఉద్యోగులు మాత్రమే. కాంౖ ప్రకాష్ అప్పటికే క్రియాశీల కార్యకర్తగా వ్యవహరించలేని స్థితికి చేరాడు. ఈ స్థితిలోనే శ్రీకాకుళంలో వున్న శక్తులకు కొన్ని శక్తులను తోడుచేసి పార్టీ నిర్మాణాన్ని నిలబెట్టుకునే చర్యలు తీసుకున్నాము. దీనిలో భాగంగానే ఉద్యమ నిర్మాణ పంథాను కూడా నిర్వచించుకున్నాము. ఇతర నిర్మాణాల "క్రింద" వున్న ప్రాంతాల్లో పోటీకి దిగకూడదనుకున్నాము. శ్రీకాకుళం జిల్లాలోని సంబంధాలను; కృషి సాగించి మధ్యలో ఆగిపోయిన ప్రాంతాలను, వ్యక్తులను నిలబెట్టుకునే నిర్ణయం తీసుకొన్నాం. విజయనగరంజిల్లాలో పాత శ్రీకాకుళం జిల్లా ప్రాంతానికి అనుకుని వున్న కొత్త ప్రాంతంలో ఉద్యమం నిర్మించటానికి పూనుకున్నాము. విజయనగరంలో మిలిటెంటు ప్రజా ఉద్యమాన్ని నిర్మించాము. కోరాపుట్ జిల్లాలో ఉద్యమ నిర్మాణ కృషిని కొనసాగిస్తున్నాము. మల్కనగిరి ఏజన్సీ ప్రాంతం లోనూ, కోరాపుట్ జిల్లా మైదాన పట్టణాలలోనూ నాటి యు.సి.సి.ఆర్.ఐ (ఎం-ఎల్) రీజినల్ కమిటీ నాయకత్వాన 15 సంవత్సరాలపాటు సాగించిన కృషి వృధా కాలేదు. దానిని ఉద్యమమా? నిర్మాణమా? కార్యకలాపాలా? అని వెక్కిరించే రాజకీయరహితులు, క్రియాశూన్యులు ఉద్యమ వ్యతిరేకులు అన్ని సందర్భాలలో తటస్థపడ్డారు. నేడు గూడా తటస్థపడుతున్నారు. 1988-90ల నాటికి రీజినల్ కమిటీ నాయకులు అనారోగ్యాల మూలంగా కొంతమందీ, వ్యక్తిగతంగా సామాజిక, కుటుంబ వత్తిళ్లకు తట్టుకోలేక కొంతమందీ, వెనకకు తగ్గిన పరిస్థితి నుంచి పార్టీని నిర్మాణాన్ని నిలబెట్టడం. ఉద్యమ నిర్మాణానికి కొత్త చొరవలు చూపడమే మిగిలిన నాయకత్వం చేసిన పని. మిగిలి వున్న నాయకత్వం చేసిన చొరవల ఫలితంగానే నిర్మాణామూ అభివృద్ధి అయింది. ఉద్యమమూ నిర్మించబడింది. నిర్మించిన ఉద్యమాన్నీ, బతికివున్న నిర్మాణాన్నీ ఉద్యమాలపట్ల, పార్టీ నిర్మాణం పట్లా బాధ్యతలేనివారు చేసే సమీక్షలకు ఎలాంటి విలువలేదు. అవి శత్రువులకే ఉపయోగపడతాయి. రెచ్చగొట్టే రాతలు శత్రువు రెచ్చగొట్టే పద్ధతికి సంబంధించినవే కానీ వేరు కాదు. వారి ఆలోచనలు దురాలోచనలే. ఉద్యమాలను, ఉద్యమశక్తుల త్యాగపూరిత కృషిని-దృక్పధరహితమైనదని రుజువు చేసే ప్రయత్నాలన్నీ ద్రోహచింతనతో కూడినవే. చరిత్రను కొత్త కోణం నుంచి వ్రాస్తున్నామనే పేరుతో వాస్తవాలను తారుమారు చేసే వీరు ఎన్నటికీ సత్యాన్ని కనుగొనలేరు. వాస్తవాలను ప్రోగుచేసే పేరుతో వీరు అవకాశవాదానికి దిగి అవాస్తవాలపై ఆధారపడ్డారు. ఇలాంటి వారెన్నటికీ సత్యానికి చేరువ కాలేరు. వీరు విడుదల చేసిన పత్రాలు విప్లవోద్యమ విచ్ఛినకారులకు, ఐక్యతా విచ్ఛిన్నకారులకు మాత్రం తోడ్పడగలవు.

కూసే మేకం మేసే మేకాన్ని చెడగొట్టింది

"విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో శ్రీకాకుళం గిరిజనోద్యమ పునర్నిర్మాణ చర్యలు-ఫలితాలు (1991-2007)" "సిపిఐ(ఎం-ఎల్) మితవాద, సంస్కరణవాద ఆచరణపై మా విమర్శ-విశ్లేషణ" అన్న రెండు శీర్షికలతో వీరు విడుదల చేసిన పుస్తకం దగాకోరు విశ్లేషణకు పూనుకుంది. ఎందుకంటే, 1991-2007 మధ్యకాలంలో సిపిఐ(ఎం-ఎల్) జనశక్తిగా విజయనగరం-విశాఖజిల్లాలు ఒక కమిటిగా, శ్రీకాకుళంజిల్లా ఒక కమిటీగా పని చేశాయి. అలా పనిచేసిన పరిస్థితినీ, దాని అనుభవాలనూ, దుష్ఫలితాలనూ ప్రస్తావించని విశ్లేషణ యిది. పశ్చిమగోదావరి నుండి శ్రీకాకుళం జిల్లా వరకు ఐదు జిల్లాలకు ఉత్తరకోస్తా రీజినల్ కమిటీ ఉందనీ; దాని డైరెక్షన్‌లో కార్యకలాపాలు సాగాయన్న మరో వాస్తవాన్ని కూడా ప్రస్తావించకుండా దాటవేశారు. ఆ విధంగా ఆనాడు సిపిఐ(ఎం-ఎల్) జనశక్తిలో వుండి క్రమంలో సిపిఐ (ఎం-ఎల్) ఎన్‌డిలో చేరిన వారి ఉద్యమ నిర్మాణ కృషి ఏ విధంగా వుందోగూడ వివరిస్తే బాగుండేది. కాని దానిని కప్పిపెట్టారు. కనుకనే వీరిది దగాకోరు విశ్లేషణ. తాము నిర్ణయించుకున్న దాడికి అనుగుణంగా అర్థం చెప్పే విశ్లేషణ యిది. వారి ఉద్దేశ్యం స్పష్టమే. బాధ్యత నిర్వహించకుండా, వాటిని వదిలివేసి వెళ్లినవారి గురించి పల్లెత్తు మాట కూడా అనకుండా, ఉద్యమాన్నీ, త్యాగపూరిత ఉద్యమశక్తులనూ, నాయకత్వాన్ని దృక్పధరహితులని నిరూపించేందుకు పూనుకోవటంలోనే వారి ద్రోహచింతన అర్థమవుతుంది.

వారు విడుదల చేసిన పుస్తకంలోని సంక్షిప్త సమీక్షలో యిలా వ్రాశారు:

"అయితే శ్రీకాకుళం గిరిజనోద్యమ పునర్నిర్మాణ కర్తవ్యాన్ని మూడున్నర దశాబ్దాలు దాటినా ఏ విప్లవ పార్టీ పరిపూర్తి చేయలేకపోయిందనేది ఒక వాస్తవంగా వుంది. విషాదకర పరిణామమేమంటే ఈ పాత శ్రీకాకుళ గిరిజనోద్యమ గ్రామాల్లో అత్యధిక భాగంలో ఈ రోజున నయా రివిజనిస్టు పార్టీయైన సిపియం పీటముడి వేసుకుని వుంది. విప్లవ పార్టీ ప్రభావం కనిష్ఠ స్థాయికి కుదించుకుపోతోంది."

ఇంకా యిలా అంటున్నారు. "కా॥ టి.ఎన్, కా॥ డి.విలే మాకు స్ఫూర్తిప్రదాతలని ప్రకటించుకున్న విప్లవ పార్టీలు కూడా ఈ కర్తవ్యం వైపు పయనించలేక పోతున్నాయి. అయితే మేము ఇక్కడ గతంలో యుసిసిఆర్ఐ(ఎం-ఎల్)గా వుండి ప్రస్తుతం సిపిఐ(ఎం-ఎల్) (విశ్వం రాష్ట్ర కార్యదర్శి)గా వున్న పార్టీ నాయకత్వంలో సాగిన శ్రీకాకుళం గిరిజనోద్యమ పునర్నిర్మాణ కృషి గురించి మాత్రమే చర్చించ దలచుకున్నాం" (పేజీ 49)

1991 వరకూ జరిగిన కృషి గురించి కూడా చర్చించాల్సిందేమీ లేదట. ఆనాడు చేసుకున్న రివ్యూతో వారికేమీ విబేధాలు లేవు. 1991 తర్వాత కృషి గురించి మాత్రమే చర్చించదలచుకున్నారట. విచిత్రమేమంటే 1991 నుండి 1994 మూడు సంవత్సరాల్లో ఈ నిర్మాణం సిపిఐ(ఎం-ఎల్) జనశక్తిగా వున్న కాలాన్ని దాటవేయడమే. అంటే వారి ఆంతరంగిక నోటు రాజకీయ, నిర్మాణ సమస్యలు చర్చించి పరిష్కరించకోవటానికుద్దేశించి రాయలేదనీ, విశ్వం కార్యదర్శిగా వున్న రాష్ట్ర కమిటీపై దాడి చేయటం కోసం రాశారన్నది స్పష్టం.

ఆ మూడు సంవత్సరాల్లో శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యుడిగా వున్న కా॥ప్రకాష్‌కు ఆనాడు జరిగిన కృషి ఏమిటో తెలియదా? ఉత్తర కోస్తా ఆర్‌సిగా పశ్చిమ, తూర్పుగోదావరులు, విశాఖనగరంలో చేసిన కృషి ఏమిటో తెలియదా? దాని గురించి సంక్షిప్త సమీక్షలో ఎందుకు మాట్లాడడు? ఈనాడు తనకు "స్ఫూర్తిప్రదాతలు"గా మారిన నాయకులు ఆనాడు ఆ కమిటీల్లో నిర్వహించిన పాత్రా, సాగించిన విచ్ఛిన్నాలూ, వాటివల్ల జరిగిన నష్టాలను దాచిపెట్టడం కోసమేగా ఈ మౌనం.

వాళ్లు ఇంకా ఇలా రాసారు:

"ఆనాడు మూడు విప్లవ సంస్థల మధ్య ఐక్యతా చర్చలు సాగుతున్న సందర్భంలో 'కొండమొదలు" లాంటి మరో పునాది ప్రాంత వుద్యమం నిర్మించాల్సిన ఆవశ్యకత ఈ నాయకత్వానికి ఏర్పడింది."(పేజీ 50)

మేము కొండమొదలులాంటి ఉద్యమాలను నిర్మించే కృషిని ఎపుడూ వదిలివేయలేదన్న వాస్తవాన్ని వీరు తలక్రిందులుగా చెబుతున్నారు. ఎలా అంగీకరించినా, అంగీకరించకతప్పని సత్యమది. ఉన్న వనరులను, శక్తులను అంచనా వేసుకొని, ఒక ప్రాంతానెన్నుకుని, తగిన కేడరును కేటాయించి, ఉద్యమ నిర్మాణాన్ని సాగించటాన్ని, (తరువాతి వాక్యాలలో ఇదంతా అంగీకరిస్తూనే) తప్పు పట్ట పూనుకోవటమూ, ఇదంతా పాతశ్రీకాకుళం గిరిజన ప్రాంతంలో ఎందుకు చెయ్యలేదని కృత్రిమ పోటీ తెచ్చి, సెంటమెంటు సమస్యగా మార్చటమూ, ఇలా ఉద్యమాన్ని నిర్మించటంలో నాయకత్వానికేవో ఇతరేతర ప్రయోజనాలను

(తరువాయి 5వ పేజీలో)

పార్టీలో నిరంతర సంఘర్షణతో పార్టీ స్థాయినీ, రాజకీయ నిర్మాణ విలువలనూ నిలబెట్టుకుంటూ వస్తోంది. ఇది ఒక విప్లవ పార్టీకి వుండవలసిన అత్యంత సహజమైన గతిక్రమం. దీనికి మేము గర్వపడుతున్నాం. ఈ సందర్భంగా మేము కొంత మంది నాయకులను కించపరిచామనే, కార్యకర్తలను కించపరిచామనే, బయటకు గెంటివేసామనే వాదనలకు తావేలేదు.

ఇంధన ధరల పెరుగుదలకు కారణాలు

ఇండోనేసియా జాతీయ విమోచనా సంఘటన 13.5.2008

ఇండోనేసియాలో పెట్రోలు ధరలను ప్రభుత్వం 30 శాతం పెంచింది. విద్యార్థులు, పట్టణ పేదలు, కార్మికులు, రైతులు, మహిళలు ప్రతిరోజూ దేశమంతటా నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ధరల పెంపుదల అనివార్యమంటూ ప్రభుత్వం చేస్తున్న వాదనలను ఖండిస్తూ ఇండోనేసియా జాతీయ విమోచనా సంఘటన చేసిన ప్రకటన సంక్షిప్త అనువాదమిది. చమురు ఉత్పత్తి ఎగుమతి చేస్తున్న దేశంలో కూడా ధరల పెరుగుదలకు సామ్రాజ్యవాదమెలా కారణమో ఇది వివరిస్తున్నది.

- సంపాదకుడు.

అంతర్జాతీయంగా ఇంధన ధరలెందుకు పెరుగుతున్నాయో, వాటిననుసరించి దేశీయంగా ఇంధన ధరలెందుకు పెరుగుతున్నాయో పాలకులు వివరించటం లేదు.

1. ఇరాక్ నైజీరియా వంటి దేశాలలో రాజకీయ కల్లోలం వల్ల, ఇండోనేసియాలో నిల్వలు తరిగినందువల్ల, వెనిజులాలో చమురు పరిశ్రమను జాతీయ చేసినందువల్ల సరఫరా తగ్గింది. భారత్, చైనాలలోనూ, అమెరికాలోనూ వాడకం పెరిగి డిమాండు పెరిగింది. ఫలితంగా ధరలు పెరుగుతున్నాయి. దీనికి వాళ్లెలాంటీ ఆధారాలూ చూపటం లేదు.
2. ఏ పత్రికలోనూ చెప్పని కారణం- చమురులో స్పెక్యులేషన్ వాణిజ్యం. దీనివల్ల అంతర్జాతీయ ధరలు పెరుగుతున్నాయి.

ఇండోనేసియాలో ధరల పెరుగుదలకు కారణాలు

1. ఇండోనేసియాలోని చమురు, గ్యాసు కంపెనీ లన్నీ విదేశీ పెట్టుబడి ఆధీనంలో వున్నాయి. అవి ఉత్పత్తి చేసిన చమురును అంతర్జాతీయ మార్కెట్లో అమ్ముకుంటున్నాయి దేశంలో అమ్మినా అంతర్జాతీయ మార్కెట్టు రేటునే వసూలు చేస్తున్నాయి. కనుక అంతర్జాతీయ మార్కెట్టు రేటునే వసూలు చేస్తున్నాయి. కనుక అంతర్జాతీయ ధరలు పెరిగినప్పుడల్లా దేశంలో ధరలు పెరుగుతున్నాయి.
2. ఈ కంపెనీలు తమ ఉత్పత్తిలో 15 శాతం మాత్రమే దేశంలో అమ్ముతున్నాయి. మిగిలిన అవసరాల కోనం ప్రభుత్వం అంతర్జాతీయ రేటుకు కొంటున్నది. ఇది మన భూగర్భం నుండి వెలికి తీసారు గనుక 50 శాతమన్నా ఇక్కడ అమ్మాలి.
3. చమురును శుద్ధి చేసే పారిశ్రామిక సామర్థ్యం ఇండోనేసియాకు లేదు. ఇక్కడ వెలికి తీసిన చమురును ఇతర దేశాలకు తీసుకువెళ్లి శుద్ధిచేసి, తిరిగి తీసుకువచ్చి ఇక్కడ అమ్ముతున్నారు. కనుక అంతర్జాతీయ ధరలు పెరిగినప్పుడల్లా దేశంలో ధరలు పెరుగుతున్నాయి.
4. ఈ అమ్మకాలూ కొనుగోలూ కూడా బ్రోకర్ల ద్వారా జరుగుతున్నందున, వీటి ధరలు మరింతగా పెరుగుతున్నాయి. వీరి కమీషన్ 30 శాతం వరకూ వుంది. ముడిచమురు బ్యారలు 113 డాలర్లుంటే, ఈ బ్రోకర్ల లాభాలు 17 కోట్ల డాలర్లున్నాయి.
5. అన్నింటికంటే హీనమైన అంశమేమంటే, ముడి చమురు వెలికితీతకు విదేశీ కంపెనీలకైన ఖర్చునంతా (అన్వేషణ నుండి ఉత్పత్తి ప్రారంభం వరకూ) ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఇదంతా ప్రజల నుండి వసూలు చేసిన పన్నుల నుండే. దీనిని ఖర్చు రాబట్టడమంటున్నారు.

నిర్ధారణలు:

1. ఇండోనేసియా వైశాల్యంలో సగంగా వున్న 329 బ్లాకులలో సౌదీ అరేబియాకు దాదాపు సమమైన 30 వేల కోట్ల బ్యారళ్ల చమురు, గ్యాసు నిల్వలుండి, రోజూ 10 లక్షల బారళ్లు ఉత్పత్తి సాగుతుండగా, ఇండోనేసియా ప్రజలకు రూపాయి లబ్ధి కూడా అందటం లేదు.
2. ప్రజానుకూల ప్రభుత్వమేగనుక అధికారంలో వుంటే, ఇప్పటి ఉత్పత్తి వల్ల చమురు నుండి రోజుకు 12 కోట్ల డాలర్లు, గ్యాసు నుండి 2.3 కోట్ల డాలర్లు వస్తుంది. చమురు రంగాన్నంతా జాతీయంచేస్తే, బడ్జెట్టులోటు అన్నదే వుండదు.
3. ఖర్చు రాబడట్టడమన్న వ్యయం ఉండదు. ప్రతి ఏడాది 6 కోట్ల డాలర్లు ప్రభుత్వం దీనికి చెల్లిస్తున్నది.
4. చమురు శుద్ధి కర్మాగారాన్ని దేశంలో నెలకొల్పితే రవాణా, ఛార్జీలు, బ్రోకర్ల కమీషన్ కలిపితే 40 శాతం వరకూ ఆదా అవుతుంది.
5. వీటితో పోల్చినప్పుడు పేదలకిస్తున్నానని ప్రభుత్వం చెప్పుకుంటున్న సబ్సిడీ డాలరులో మూడవ వంతు కూడా లేదు. కనుక ధరలు పెరుగుదల పేదలపై భారాన్ని మోపుతోంది.

విదేశీ పెట్టుబడికి వలసగా ఎందుకుండాల్సి వచ్చింది?

1. ఇండోనేసియాలోని అన్ని రాజకీయశక్తులకూ అంతర్జాతీయ పెట్టుబడి అంటే కాళ్లు వణికి పోతాయి. అంతర్జాతీయ పెట్టుబడి విలువైన చమురు వనరులనూ, మానవ శ్రమను కొల్ల గొట్టుకుపోయేందుకు అనువైన చట్టాలను ఇవి చేశాయి. 2009లో ఎన్నికల్లో ఓట్లు సంపాదించుకునేందుకు ప్రతిపక్ష పార్టీలూ, ప్రాభవం కోల్పోయిన వృద్ధ నాయకులూ పెట్రో ధరల పెంపును వ్యతిరేకిస్తున్నారు తప్ప మన వ్యవస్థాపక అధ్యక్షుడు సుకర్నో, కాస్ట్రో, ఛావెజ్‌ల లాగా అంతర్జాతీయ పెట్టుబడిని ఎదిర్చగల ధైర్యం వీరికి లేదు.
2. ఆర్థిక, రాజకీయ వేత్తలు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు వంటి మేధావులు కూడా పిరికివారే కాక ఎక్కువ మంది అంతర్జాతీయ పెట్టుబడికి తమ తలను తాకట్టు పెట్టినవారే.
3. దేశీయ కంపెనీలు కూడా ఇదే మస్తత్వాన్ని కలిగి వున్నాయి విదేశీ పెట్టుబడి ఆదిపత్యాన్ని ప్రతిఘటించకపోగా, దానికి ఏజంట్లుగా మారాయి. ఇప్పుడు కూడా ఈ కంపెనీల సంఘాలు ధరల పెంపును సమర్థిస్తున్నాయి.
4. అంతర్జాతీయ పెట్టుబడినెదుర్కొనగల ప్రధాన శక్తి కార్మికవర్గం, పేదలూ తమ నిజమైన శక్తిని ఇంకా ప్రదర్శించలేకపోతోంది. అన్ని వర్గాలను ఐక్య పరచి ఉద్యమాన్ని అది ఉధృతం చేయాల్సి వుంది

ప్రజలకు పరిష్కారం:

1. చమురు, గ్యాసు పరిశ్రమను, ఇతర కీలక పరిశ్రమలనూ జాతీయంచేసి, ప్రజలపరం చేయాలి.
2. విదేశీ రుణాన్ని రద్దుచేయాలి.
3. చమురుశుద్ధి పెట్రో పరిశ్రమనభివృద్ధి చేసేందుకు వెనిజులా, బొలీవియా ప్రభుత్వాలూ, ప్రజలతో సహకారం నెలకొల్పాలి.
4. పర్యావరణ పరిరక్షణకు ఇతర ఇంధన వనరులను వినియోగించాలి.
5. పెట్టుబడిదారీవర్గాన్నీ, ప్రజలను మోసం చేస్తున్న పార్టీలను నెట్టివేసి, ప్రజల అధికారాన్ని నెలకొల్పాలి.

తక్షణ పరిష్కారాలు:

1. పెంచిన ధరలను రద్దుచేయాలి.
2. మాజీ అధ్యక్షుడు సుహార్తో, అతని తైనాతీల అక్రమార్జనను స్వాధీనం చేసుకోవాలి.
3. ప్రభుత్వోద్యోగుల జీతాలను 30 శాతం తగ్గించాలి.
4. ప్రైవేటు పెట్టుబడిని కొన్ని ఆంక్షలతో అదుపు చేయాలి.
5. కార్లపై పన్ను పెంచాలి.
6. ఆయిలు కంపెనీల లాభాలపై 35 శాతం పన్ను విధించాలి.

వలసాధిపత్యానికి వ్యతిరేకంగా, నూతన ప్రజా ప్రభుత్వానికి పిండరూపంగా, బలీయ ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. ప్రజా ప్రదర్శనలు పెంచి ధరల పెంపుదలను వెనక్కి కొట్టాలి. ప్రజాసమీకరణలతో చమురు కంపెనీలను స్వాధీనం చేసుకోవాలి. ప్రజలు అధికారాన్ని చేపట్టవలసిన సమయమాసన్నమైంది. ◈

(4వ పేజీ తరువాయి)

ఆపాదించటమూ గమనిస్తే, వీరికి దురుద్దేశ్యాలున్నాయని స్పష్టమౌతుంది. ఉద్యమ పునర్నిర్మాణం గురించి గుండెలు బాదుకుంటున్న వీరు ఒక ప్రజా ఉద్యమంపట్లా, దానిలో మమేకమై పనిచేసిన కార్యకర్తల కృషి పట్లా, దానికి నిరంతరం గైడెన్సునందిస్తూ వచ్చిన నాయకత్వం పట్లా చూపుతున్న కించపరిచే వైఖరి వారి నిజస్వభావాన్నే తెలుపుతుంది కనుకనే వీరిని మా నిర్మాణంలో వుంటూ ఇతరేతర శక్తుల తరఫున వ్యవహరించినవారిగా పరిగణిస్తున్నాము.

ఈ రెండు విషయాలు చాలు వారి స్వభావమేమిటో తెలియటానికి. విచ్ఛిన్నాలనూ, విచ్ఛిన్నాలు జరిపిన నాయకులనూ గురించి ఒక్కమాట మాట్లాడకుండా, ఉద్యమనిర్మాణం చేస్తున్న నిర్మాణంపై దాడులు చేయటం, ఉద్యమాన్ని కించపరచటం ద్వారా వారి కొత్త కోణాల పరిశీలన ఎవరి కోసమో, వాటి విలువ ఏపాటిదో అర్థమౌతుంది. అది నాయకుల పైనా కార్యకర్తలపైనా దాడి. కమిటీల ముందు తమ నోటును చర్చించి తిరస్కరించిన తర్వాత, మా అభిప్రాయాలను రిజర్వు చేసుకొని, క్రిందిస్థాయిలో పనిచేస్తామని చెప్పినవారు, మమ్మలను గెంటివేయజూడటంతో తప్పనిసరై బయట కొచ్చామని చెప్పుకుంటున్నారుగానీ, వారిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలేమిటో చెప్పలేకపోవటమే వారు విచ్ఛిన్నానికే సిద్ధపడి వ్యవహరించారన్నది రుజువు చేస్తున్నది.

వివిధ సందర్భాలలో వివిధ స్థాయిల్లో నిరంతరాయంగా ఆంతరంగిక పోరాటానికి మా నిర్మాణం ఎన్నడూ వెనుకాడలేదన్నది విస్పష్టమైన వాస్తవం. దానికి నిదర్శనం 1977 నుంచీ రామలింగాచారి లేవనెత్తిన సమస్యలను కూలంకషంగా చర్చించింది. రెండేళ్లపాటు (1979 సెప్టెంబర్ వరకు) చర్చించి చివరకు ఒక ప్లీనం ద్వారా దానిని ముగించింది. ప్లీనం నిర్ణయానికి కట్టుబడని రామలింగాచారి తన కొద్దిమంది అనుచరులతో వేరే నిర్మాణంగా వ్యవహరించాడు. ఇక డి.వి.గారు రాజకీయ నిర్ణయాలన్నింటికీ తననే అథారిటీగా గుర్తించమంటూ రాష్ట్ర కమిటీని, కేంద్ర కమిటీని ఇరుకునపెట్టి, దానికి తలవగ్గనందుకు, ప్రత్యామ్నాయంగా ఫంక్షను అవుతున్నారని పేరుపెట్టి ఒక్క సభ్యుడిని మినహా రాష్ట్ర కమిటీ మొత్తాన్నీ సస్పెండు చేసినందువలన ఒక కమిటీగా ఆర్గనైజ్ అయి ప్రజా ఉద్యమాన్ని, ప్రజాసంఘాలను, పార్టీని నిలబెట్టుకున్నాము. ఆ విచిత్రమైన వైఖరిని ప్రతిఘటించాల్సి వచ్చినందుకు తాత్కాలికంగా బాధపడ్డా, అది మాకు గర్వకారణమే.

1982-83లలో కామ్రేడ్ పుల్లారెడ్డి నాయకత్వాన ఉన్న సి పి ఐ(ఎం-ఎల్)తో సూత్రబద్ధతకు కట్టుబడే ద్వైపాక్షిక చర్చలు సాగించాం. విచిత్రమేమంటే మేము ఆ ద్వైపాక్షిక చర్చలలో వున్నపుడే వారి నిర్మాణం బీటలు వారి వుందన్న విషయాన్ని మేము గమనించలేక పోవడం. దాని నుండి చీలిన ప్రజాపంథా నాయకత్వంతో కామ్రేడ్ పుల్లారెడ్డితో ప్రారంభించిన చర్చలను కొనసాగించాము. కామ్రేడ్ పుల్లారెడ్డితో మొదలైన చర్చలు మూడు విషయాలపై కేంద్రీకరించి జరిగాయి. ఈ చర్చలు పరస్పరం అర్థం చేసుకొనడానికేగాక దళాలపాత్ర, ప్రధాన వైరుధ్యాన్ని నిర్వచించడంపై పరస్పరావగాహనకు, పరస్పరం లాభం పొందడానికి దోహదపడ్డాయి. దీని కొనసాగింపుగా రాష్ట్ర స్థాయిలో ఐక్యకార్యాచరణ సాగించ గలిగాము.

ప్రజాపంథా నాయకత్వంతో ఆగిన చర్చలను యు.సి.సి.ఆర్.ఐ(ఎం-ఎల్) ఆలిండియా కాన్ఫరెన్సు తర్వాత తిరిగి మేము పునరుద్ధరించాం. మమ్ములను రివిజనిష్టులనీ, మితవాదులనీ నిందించడం మాని ఐక్యతకు చేతులు చాచిన సిపిఐ(ఎం-ఎల్) రెసిస్టెన్స్ (కె.రామచంద్రన్) గ్రూపుతో గూడా మేము ఒకేసారి చర్చలకు పూనుకొన్నాం. ద్వైపాక్షిక చర్చలనుండి త్రైపాక్షిక చర్చలదాకా కొనసాగించాం. త్రైపాక్షిక ఐక్యతా నోట్ ద్వారా విభేదాలను తగ్గించుకొనడానికి కృషి చేశాం. ప్రజాపంథా (ఎన్.డి.) నాయకత్వం ఈ విషయంలో చీలిపోయింది. పైలా వాసుదేవరావు త్రైపాక్షిక ఐక్యతను ఆహ్వానించాడు. దానిలో భాగస్వామి అయ్యాడు. ప్రజాపంథా నాయకత్వం గతంలో (1984-85ల) లాగానే కుంటిసాకులతో ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నం చేసింది. బెంగాల్‌లో ఎన్.డి ఐక్యతా వైఖరులు నచ్చనివారు, పి.సి.సి. నుండి వచ్చిన విడివిడిగా వున్న గ్రూపులు పరిమళదాస్, జతీస్ దాస్‌లు కలిసి ఐక్యతా ప్రకటన ద్వారా ఐక్యమయ్యాం. ఈ ఐక్యతా చర్చలు రూపొందించిన విధానాలు మౌలికంగా సరైనవిగానే వున్నాయి. అయితే ఈ వ్యాసంలో ఇంతకు ముందు ప్రస్తావించినట్లుగానే ఆధునికానంతరవాదాల ప్రభావం ఈ నిర్మాణాన్ని అనతి కాలంలోనే ముంచెత్తింది. ఆంతరంగిక చర్చకు అవకాశం లేని ఈ నిర్మాణం నుంచి మేము వైదొలగి సి.పి.ఐ(ఎం-ఎల్) జనశక్తి ఆర్గనైజింగ్ కమిటీగా సంఘటితపడవలసి వచ్చింది.

సిపిఐ(ఎం-ఎల్) ఎన్.డి. ఒక కలగూర గంపగానే మిగిలింది. పుల్లారెడ్డి అరాచకవాదం, పైలా వాసుదేవరావు అవకాశవాదం, సి.పి.ఐ.(ఎం-ఎల్) జనశక్తి అవకాశవాదాలతో పోరాడి నిలబడిన సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కలగూర గంపలో ఎవరికి ఏ కూర కావాలో వారికి ఆ కూర దొరుకుతుంది. వీరి ఐక్యతా వైఖరి విచిత్రమైంది. వీరితో మేము విభేదిస్తూ, రాజకీయ పోరాటం సాగించాం. ఎవరినైనా చేర్చుకొనే హక్కూ తొలగించే బాధ్యత ప్రతి నిర్మాణానికి వుంటుంది. విప్లవోద్యమ ఐక్యతను దృష్టిలో పెట్టుకొని గూడా వ్యవహరించాలి. అవకాశం దొరికింది కదా అని బలహీనులనూ, ద్రోహచింతనతో వున్నవారినీ అడ్డం పెట్టుకొని తోటి నిర్మాణాన్ని దెబ్బతీయాలనుకోవడం, దాని నాయకత్వ విలువను తగ్గించాలనుకోవడంలోనే వారి అవివేకమంతా బయటపెట్టుకొన్నారు. వారి నిర్మాణం నుంచి కొందరు మా నిర్మాణంలోకి వచ్చినపుడు అత్యంత బాధ్యతగా వ్యవహరించాం. కొందరు మా నిర్మాణంలోనుంచి వారిలోకెళ్లినపుడు గూడా మేమలాంటి వైఖరితోనే వ్యవహరించాం. మాతో వ్యవహరించిన అన్ని సందర్భాలలోనూ వారే అతిగా వ్యవహరించారు. బాధ్యతారహితంగా ప్రవర్తించారు. ఏ స్థాయిలోనూ వారు వాస్తవాలపై ఆధారపడలేదు. లీగలిష్టు, కుతర్క పద్ధతులనే ఆశ్రయించారు. ఆవేశ రహితంగా చర్చించుకునే ప్రక్రియను మేమే ప్రారంభించాం. గుంటూరు పరిణామాల తర్వాత, వాటి గురించి 2002లో కేంద్రస్థాయి ప్రతినిధులం కూర్చుని చర్చించాం. సి.పి.ఐ(ఎం-ఎల్)గా ఏర్పడిన మా నూతన పార్టీ నాయకత్వం గూడా ఆ చొరవచూపింది. లెటర్ పెట్టింది. రెండు ప్రతినిధి వర్గాలు 2005 సెప్టెంబర్‌లో మాట్లాడుకొన్నాయి. కనుక సవ్యమైన రీతిని వదిలి విప్లవశక్తుల్లో అనైక్య వాతావరణాన్ని పెంచే పద్ధతులను వారు మానుకోవాలి. వారు బాధ్యత వహించిన ప్రాంతాలకు వారనుసరించిన వ్యూహం-ఎత్తుగడల ప్రాతిపదికపై గడించిన అనుభవాలను బేరీజు వేసి అందించమని వారిని కోరుతున్నాం. ఇతర నిర్మాణాలకు ఎత్తి చూపడానికి వారి కార్యాచరణను మదింపు-బేరీజు వేసి అందించడం నిర్మాణాత్మకమైన విమర్శ కాగలదు.

విప్లవకారులందరి లక్ష్యం, ఆశయం ఒకటైనపుడు వారు వేరువేరుగా గడించిన అనుభవాలు గూడా అందరివి కాగలగాలి అందులోని పొరపాట్లకు, తప్పులకు అందరం బాధ్యత వహించాలి. వాటి మూలంగా వచ్చే గొప్పతనం మొత్తం విప్లవోద్యమ యొక్క గొప్పతనంగానే అంతిమంగా మిగులుతుంది.

అయితే 1968-69 నుంచి వివిధ సందర్భాలలో కొన్ని ధోరణులు ముందుకొచ్చాయి. వాటిని తొలుత రాజకీయ, సిద్ధాంత స్థాయిలో చర్చించడం అవసరం. ఈ చర్చించే క్రమంలోనే ఆచరణాత్మక విషయాలలోకి వెళ్లి అంతిమ నిర్ణయానికి రాగులుగుతాం: ఎలాగూ మొదలుపెట్టాం కాబట్టి చర్చను కొనసాగించడమే ఉత్తమం. ◈

వేటలో మునిగివున్న తోడేళ్ల మంద

రిటైలు రంగంలోకి బడా విదేశీ కంపెనీల ప్రవేశానికి యుపిఏ ప్రభుత్వం పచ్చజెండా వూపిన నాటి నుండి వేటలో ఈ తోడేళ్లు తీరిక లేకుండా వున్నాయి. రిటైలు రంగంలో 11 లక్షల కోట్ల వ్యాపారం సాగుతున్నదని అంచనా కాగా, 2006లో ఈ తోడేళ్ల వాటా 5 శాతముంది. 2007 నాటికి 8 శాతానికి పెరిగింది. 2008లో 25 శాతానికి పెరిగింది. 2006లో వీటి సూపర్ షాపుల విస్తీర్ణం 6.8 కోట్ల చదరపు అడుగులుండగా 2008 నాటికి 31.6 కోట్ల చ. అడుగులకు పెరిగింది. అమెరికాకు చెందిన వాల్‌మార్ట్, బ్రిటన్‌కు చెందిన స్పెన్సర్, జర్మనీకి చెందిన మార్క్‌లు భారత బడా కంపెనీలతో ఒప్పందం చేసుకకుని రిటైలు వ్యాపారరంగాన్ని ఆక్రమిస్తున్నాయి. త్వరలోనే రిటైలు రంగంలో వున్న చిన్న వ్యాపారులు కోటి మందిని ఇవి తొలగించి వేస్తాయి.

భవిష్యవాణిజ్యంతో ఇప్పటికే ఆహార ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చౌకధరల దుకాణాలను దిక్కుమాలినవిగా చేసిన ప్రభుత్వం ధరలనదుపు చేయలేని దిక్కుమాలిన స్థితిలో పడింది. విదేశీ రిటైలు కంపెనీలు ఒకసారి యిక్కడ స్థిరపడిన తర్వాత ధరలను అంతర్జాతీయ స్థాయికి పెంచటమన్న పేరిట కూరగాయల ధరలను కూడా పెంచివేస్తాయి. అప్పుడిక ప్రభుత్వం చేతులు ముడుచుకు కూర్చుని "ధరల పెరుగుదల అభివృద్ధికి సూచిక"న పనికిమాలిన కబుర్లు చెబుతుంది.

అర్థికవాద, నిరంకుశ యూనియన్ నాయకత్వ విద్రోహానికి గురయిన అమెరికన్ ఏక్సిల్ కార్మికుల సమ్మె

ఫిబ్రవరి 26వ తేదీ నుండి సుమారు మూడు నెలలకాలంగా అమెరికన్ ఏక్సిల్ కంపెనీలోని కార్మికులు జరుపుతున్న సమ్మెను యాజమాన్యంతో కార్మికసంఘ నాయకత్వం చేసుకొన్న లాలూచీ ఒప్పందంతో ముగించాల్సి వచ్చింది.

ప్రపంచంలో కార్లు ఉత్పత్తి చేస్తున్న అతిపెద్ద కంపెనీ జనరల్ మోటార్స్ కార్పోరేషన్‌కు, 80% మేరకు కీలకమయిన విడిభాగాలను సరఫరా చేస్తున్న, ఆ కంపెనీకి అనుబంధ సంస్థ అయిన అమెరికన్ ఏక్సిల్‌లోని కార్మికులు గత 3 నెలలుగా, యాజమాన్యం డిమాండు చేస్తున్న 50% వేతనాల్లో కోత, యితర సౌకర్యాలలో కోతలను నిరసిస్తూ సమ్మె చేస్తున్నారు.

ఈ రకంగా యాజమాన్యాలు వేతనాలను, యితర సౌకర్యాలను కోత పెట్టాలన్న డిమాండు చేయటం, అందుకు అంగీకరించకపోతే ఉత్పత్తి కర్మాగారాలను మూసివేస్తామని బెదిరించటం అన్నది కేవలం అమెరికన్ ఏక్సిల్ కార్మికులకు సంబంధించిన సమస్యే కాక పోవటంతో, అమెరికన్ ఏక్సిల్ కార్మికులకు వివిధ ఆటోరంగ కంపెనీల కార్మికులు (డెట్రాయిట్ మిచిగాన్ తదితర నగరాల్లో) తమ సంఘీభావాన్ని తెలియచేయటం జరిగింది.

వాస్తవానికి అమెరికాలోని బడా కార్ల తయారీ కార్పోరేషన్లయిన జనరల్ మోటార్స్, ఫోర్డు, డైమ్లర్ క్రిజ్లర్‌లు తమ ఉత్పత్తుల అమ్మకాలు పడిపోయాయనీ. అందువలన లాభాలు క్షీణిస్తున్నాయనీ, ముడిసరుకుల రేట్లు పెరగటం వలన నష్టాలను చవిచూడాల్సి వస్తోందనీ, వాటాదారులకు డివిడెంట్లు పంచిపెట్టలేకపోతున్నామనీ, తక్కువ ఖర్చులతో తమతో పోటీపడుతున్న విదేశీ కార్ల కంపెనీ అయిన టయోటో, హుండాయ్‌లతో పోటీపడలేక పోతున్నామనీ వాదిస్తూ, తమ ఖర్చులను తగ్గించు కోవటం ద్వారా కంపెనీని నిలబెట్టుకొంటామన్న వాదనను చేస్తూ, తమ ఖర్చుల్లో ప్రధానంగా కార్మికులకు చెల్లించే వేతనాలు, యితర సౌకర్యాలకు చెల్లించే ఖర్చు చాలా ఎక్కువగా వుందనీ, కార్మికుల రిటైర్మెంటు అనంతర ప్రయోజనాలకు, ఆరోగ్య సౌకర్య ప్రయోజనాలకు వెచ్చించాల్సిన ఖర్చుభారం అధికాధికంగా వుందనీ, వాటిని తాము భరిస్తె నష్టాలు తప్పవనీ, అందువలన కార్మికుల వేతనాలు, యితర ప్రయోజనాల్లో కోత పెట్టక తప్పదనీ, రిటైర్మెంటు అనంతర ప్రయోజనాలనూ, ఆరోగ్య సౌకర్యాలను ప్రయోజనాలనూ భరించజాలమనీ, పర్మినెంట్ కార్మికుల జీతభత్యాలు చాలా ఎక్కువగా వున్నాయి కనుక వారిని పూర్తిగా తగ్గించివేసి, తాత్కాలిక -కాంట్రాక్టు పద్ధతుల ద్వారా నియమించబడ్డ కార్మికుల ద్వారా ఉత్పత్తి చేయించుకొంటామనీ 2002 సంవత్సరం నుండీ వాదిస్తూ, పర్మినెంటు కార్మికుల సంఖ్యలో బలవంతంగా కోతలు పెట్టాయి; ప్లాంట్లను అక్రమంగా లాకవుట్లకు గురిచేశాయి కొన్ని ప్లాంట్లను చౌకగా కూలికి కార్మికులు లభించే యితర ప్రాంతాలకు- మెక్సికోలాంటి యితర దేశాలకు, అలబామలాంటి యితర రాష్ట్రాలకు -తరలించటం జరిగింది.

1935 నుండే అమెరికాలో, జాతీయ కార్మిక సంబంధాల చట్టం ద్వారా, కార్మిక సంఘంలో సభ్యులుగా చేరే కార్మికులకు యాజమాన్యాల అక్రమ తొలగింపుల నుండీ, వేధింపుల నుండి (కార్మిక సంఘ కార్యకలాపాలు నిర్ణయించినందుకుగాను) రక్షణ లభిస్తూ వచ్చింది. అందువలన కార్మిక సంఘ ఉద్యమం బలపడి, కార్మికుల వేతనాల్లోను, యితర సౌకర్యాల్లోనూ మెరుగుదల సాధ్యమయింది. పలుపోరాటాల ద్వారా అమెరికన్ కార్మికులు వేతనాల పెంపుదలను, యితర ప్రయోజనాలనూ సాధించుకొన్నారు. రిటైర్మెంట్, ఆరోగ్య సౌకర్య ప్రయోజనాలను సాధించుకొన్నారు. కానీ 1970 నుండీ కార్మిక సంఘాలపై యాజమాన్యాలు దాడిని ప్రారంభించాయి. యూనియన్ సభ్యులను, కార్యకర్తలను వేధించటం, కక్ష సాధింపు చర్యలు జరపటం అన్నది పెరిగిపోయింది. కార్మిక చట్టాలను అతిక్రమించటం అన్నది యాజమాన్యాలకు పరిపాటి అయిపోయింది. చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యాలను ప్రభుత్వం ఏ రకంగానూ శిక్షించటానికి ప్రయత్నం చేయలేదు. కార్మిక చట్టాలను అమలుజరపాల్సిన జాతీయ కార్మిక సంబంధాల బోర్డు కార్మికులపైన యాజమాన్యాలు దాడి జరుపుతున్నా మిన్నకుండి పోయింది.

1973లో ప్రైవేటురంగంలో పనిచేసే కార్మికుల్లో 25% మంది యూనియన్ సభ్యులుగా వుండగా, ఆ సంఖ్య ఈ రోజు కేవలం 7.4%కి దిగజారిపోయిందంటే, కార్పోరేటు యాజమాన్యాలు యూనియన్లపై, యూనియన్ కార్యకలాపాలపై ఎంతటి భారీస్థాయిలో దాడులు జరిపాయో, ఎంతగా సంఘటితపడుతున్న కార్మికులను వేధించాయో, ఎంత మేరకు కార్మికుల సమిష్టి బేరసార హక్కులపై దాడి చేసి సఫలీకృతం చెందాయో, యిందుకు అమెరికన్ ప్రభుత్వం ఏ మేరకు పెట్టుబడి దారులైన యాజమాన్య వర్గాలకు సహకరించిందో అర్థమవుతుంది.

కార్మిక సంబంధ విషయాల్లో నిపుణులైన వారి అంచనా ప్రకారం 1980 సంవత్సరం వచ్చేటప్పటికి, యూనియన్ సభ్యులుగా వున్న ప్రతీ 20 మంది కార్మికుల్లోనూ ఒకరిని అక్రమంగా ఉద్యోగం నుండి యాజమాన్యాలు తొలగించే స్థితికి పరిస్థితులు చేరుకొన్నాయి.

డెబ్బైవ దశకం నుండి అమెరికన్ పెట్టుబడిదారీ కార్పోరేషన్లు సంఘటిత కార్మికోద్యమంపై (అమెరికన్) ఒక యుద్ధాన్ని ప్రకటించి, సంఘటిత కార్మికోద్యమాన్ని రూపుమాపేందుకు కంకణం కట్టుకొన్నాయి.

యూనియన్లను ధ్వంసం చేయటం, కార్మికుల సంఘటితత్వాన్ని రూపుమాపటం అన్న అంశాల్లో విజయం సాధించటంకోసం వివిధ యజమానులు చేసే దాడులకు, వాల్‌మార్టు కంపెనీ నాయకత్వం వహించి, వారందరికీ ఆదర్శప్రాయంగా ముందు నిలబడింది. ఇందుకు వాల్‌మార్ట్ చట్టబద్ధ, చట్టవ్యతిరేక ఎత్తుగడలను అనుసరించింది. పలురకాలుగా కార్మికులను వేధించటం ద్వారా వారు సంఘటితపడకుండా నిరోధించింది. కార్మిక సంఘాలను నిష్క్రియపరిచింది. యిందుకు అమెరికన్ రాజకీయ వాతావరణం (అమెరికాను డెమోక్రాట్లు పాలించినా, రిపబ్లికన్లు పాలించినా) పూర్తిగా తోడ్పాటు నిచ్చింది. మొత్తంగా చూస్తే అమెరికాలో నేడు కార్మికులను సంపదను పెంపొందించే ఒక మానవ సమూహశక్తిగా కాక, వాడుకొని విసరిపారవేసే వినియోగ వస్తువుగా పారిశ్రామిక యజమాన్యాలు పరిగణించే స్థితి ఏర్పడింది.

కార్మికుల జీతాల కోత, సౌకర్యాల్లో కోత, రిటైర్మెంటు ఆరోగ్య సదుపాయాల రద్దు చేస్తే తప్ప, తమ పరిశ్రమలు మనుగడలో వుండటం సాధ్యం కాదు, పోటీకి తట్టుకోవటం సాధ్యంకాదు అనే అసంబద్ధ. అబద్ధపు వాదనలతో పారిశ్రామిక యాజమాన్యాలు కార్మికులపై దాడి సాగిస్తున్నాయి.

పారిశ్రామిక యాజమాన్యాలు తమ ఉత్పత్తి కార్యకలాపాలను, చౌక కూలికి కార్మికులు లభించే, బడుగు దేశాల్లో ఉత్పత్తులను నిర్వహించి, విడిభాగాల దిగుమతి చేసుకొనే విధానాన్ని అనుసరించారు 1990లో అమెరికన్ జి.డి.పి.లో 2.5 శాతంగా వున్న ఉత్పత్తి చేయబడ్డ వస్తువుల దిగుమతులు 2006 సంవత్సరం వచ్చేటప్పటికి 6% పెరిగిపోయాయి. మరోవైపు విదేశాల నుండి తరలివచ్చే వలస కార్మికుల శ్రమను కారుచౌకగా కొల్లగొట్టుకోవటం, వారికి కల్పించాల్సిన చట్టబద్ధ సౌకర్యాలు కల్పించకుండా, శ్రమ చేయించుకోవటం అన్న విధానాన్ని యాజమాన్యాలు ముమ్మరంగా అవలంబించి కార్మికుల వేతనాలల్లో తమ ఖర్చులను తగ్గించి వేసుకోవటం మొదలుపెట్టాయి.

ఈ రకంగా ఒక సమగ్రమైన వ్యూహంతో, ఒక క్రమ పద్ధతిలో, కార్మికులను వేధించే ఎత్తుగడలతో, కార్మిక సంఘ ఉద్యమంపై దాడిచేసి, ఆ కార్మిక సంఘ ఉద్యమాన్ని నిర్వీర్యపరచిన అమెరికన్ బడా పారిశ్రామిక కార్పోరేట్ వర్గం, "ప్రపంచీకరణ ఫలితంగానూ, సాంకేతిక పరిజ్ఞానంలో సాధించిన పురోగతి వలనా, అమెరికన్ కార్మికోద్యమం సహజమైన మరణాన్ని పొందింది" అంటూ నమ్మబలుకుతున్నారు. నయా ఉదారవాద ఆర్థికవాద విధాన సమర్థకులైన మేధావులంతా ఈ అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారు.

ఈ రోజున అమెరికాలో సాధారణ విద్య కల పారిశ్రామిక కార్మికులు తమ వేతనాల్లో, సదుపాయాల్లో, ప్రయోజనాల్లో కోత పెట్టడానికి అంగీకరించాల్సిన విధిలేని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు.

ఈ నేపథ్యంలోనే యిప్పటికే అమెరికాలోని కార్ల ఉత్పత్తి పరిశ్రమలో పనిచేసే పర్మినెంటు పారిశ్రామిక కార్మికులు 80,000 మంది వరకూ ఉద్యోగాల్లో నుండి బలవంతంగా, వివిధ పథకాల పేరిట తొలగింపబడ్డారు.

జనరల్ మోటార్స్ కంపెనీ తన కంపెనీతోబాటు, తన అనుబంధ కంపెనీ అయిన డెల్ఫిలోనూ అనేక వేల మంది కార్మికులకు ఉద్వాసన చెప్పింది. 2007లో వారి రిటైర్మెంటు ప్రయోజనాల భారాన్ని కుదించుకొని, ఆ భారాన్ని యూనియన్ నిర్వహించేటట్టు చేసుకొని కేవలం ఈ కార్మికుల ఆరోగ్యభీమాపై పెట్టే ఖర్చునే, తాను ఉత్పత్తి చేసే ప్రతి వాహనంపైనా 1600 డాలర్లను తగ్గించుకొంది. 73,000 మంది కార్మికులకు కల్పించాల్సిన ఆరోగ్య సౌకర్యాలపై వెచ్చించాల్సిన ఖర్చులో సంవత్సరానికి 3 బిలియన్ల డాలర్లను ఆదా చేసుకొంది. ఆ మేరకు ఆ కార్మికులు ఆ ప్రయోజనంలో నష్టపోయారు. అంతేకాక తాను క్రొత్తగా నియమించుకొనే కార్మికుల జీతాల్లో 50% వేతనం తగ్గించుకోవటానికి యూనియన్‌తో ఒప్పందాలు చేసుకొంది. ఆ రకంగా క్రొత్తగా నియమితులయ్యే కార్మికులకు 2007లో గంటకు 51 డాలర్లు చెల్లించే వేతనం కేవలం 28 డాలర్ల మేరకు తగ్గించుకొనే ఒప్పందాన్ని చట్టబద్ధంగా రుద్దారు. అంతేకాక 6000 మంది కార్మికులకు ఉద్వాసన చెప్పటానికి యూనియన్ నుండి అనుమతిని సాధించుకొంది.

ఇదే రకంగా ప్రస్తుతం అనుబంధ సంస్థ అయిన అమెరికన్ ఏక్సిల్‌లో కూడా కార్మికుల వేతనాల్లో మరింత కోతను పెట్టాలనీ, సౌకర్యాల్లో కోత విధించాలనీ జనరల్ మోటార్స్ యాజమాన్యం డిమాండు చేసింది. ఇందువలన గణనీయంగా లాభపడేది జనరల్ మోటార్సు కంపెనీయే.

డానా హోల్డింగ్ కార్పొరేషన్‌లాంటి యితర పోటీదారులైన విడిభాగాల సప్లయింగ్ కంపెనీలతో పోటీపడి నిలదొక్కుకోవాలంటే, తాను కార్మికుల వేతనాల్లో భారీ ఎత్తున కోత పెట్టక తప్పదని అమెరికన్ ఏక్సిల్ యాజమాన్యం వాదించింది.

యాజమాన్యం చేసిన వేతన కోత (50%) ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ, యిప్పుడు చేసుకోవాల్సిన క్రొత్త వేతన ఒప్పందంలో వేతనపు కోతను అంగీకరించేది లేదంటూ 3,650 మంది ఏక్సిల్ కార్మికులు సమ్మెకు దిగారు. తన డిమాండును అంగీకరించకపోతే ప్లాంట్లను మూసివేస్తామని యాజమాన్యం బెదిరింపులకు దిగింది.

అయితే గత దశాబ్ద కాలంగా కార్ల పరిశ్రమ కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న యునైటెడ్ ఆటో వర్కర్స్ (యూనియన్) నాయకత్వం పరిశ్రమ యాజమాన్యాలు చేస్తున్న దాడులను త్రిప్పికొట్టడానికి అనుసరించాల్సిన కార్యాచరణను చేపట్టడానికి బదులు, యాజమాన్యాలతో సామరస్యపూర్వకంగా వ్యవహరిస్తూ, యాజమాన్యాల డిమాండ్లనే అంగీకరిస్తూ కార్ల ఉత్పత్తి పరిశ్రమల్లో ఒప్పందాలు చేసుకొనే వైఖరిని అవలంబిస్తోంది. దేశం నుండి పరిశ్రమ యితర ప్రాంతాలకు తరలించబడకుండా మొత్తం అందరి కార్మికులు పూర్తిగా నష్టపోకుండా రక్షించటంకోసం తాను యాజమాన్యాల డిమాండ్లను ఒక మేరకు అంగీకరిస్తూ, పరిశ్రమను రక్షిస్తున్నామనే వాదనను చేస్తోంది. ఆర్థికవాదంలోనిండా మునిగిన నాయకత్వం అంతకన్నా మరింకేం చేయడానికిగానీ, కార్మికుల హక్కులు రక్షించటానికి గానీ పోరాటాలకు పూనుకోదు.

అమెరికన్ ఏక్సిల్ కంపెనీలో కూడా అదే వైఖరిని యూనియన్ కేంద్ర నాయకత్వం అవలంబించింది. సమ్మె చేయటానికి యూనియన్ కేంద్ర నాయకత్వానికి, స్థానిక నాయకత్వాలకూ కూడా సుతారామూ యిష్టం లేదు. అయినా విధిలేని పరిస్థితుల్లో, కార్మికులు పూర్తిగా సమ్మె చేయటానికి సంసిద్ధమయిన పరిస్థితుల్లో, యూనియన్ నాయకత్వం కూడా ఆ సమ్మెదారులతోపాటు వున్నట్లు నటించింది. సమ్మెను విజయవంతం చేయటానికి నాయకత్వం ఏ రకమయిన కృషి కూడా చేయలేదు. మూడు నెలలు గడవనిచ్చి, యాజమాన్యంతో చర్చల తతంగం జరిపి, ఆఖరుకు యాజమాన్యానికి లొంగిపోయి, ఒక ఒప్పందాన్ని చేసుకొంది. నాలుగు సంవత్సరాల కాలంపాటు కొనసాగటానికి చేసుకొన్న ఆ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం గంటకు 28 డాలర్ల వేతనం చెల్లింపబడుతున్న కార్మికుల జీతం 18.50 డాలర్లకు తగ్గింపబడుతుంది. కీలకం గాని యితర శాఖలలో పనిచేసే కార్మికులకయితే గంటకు 14.50 డాలర్ల వేతనమే చెల్లిస్తారు. ఇక "త్రీ రివర్సు" ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకయితే గంటకు కేవలం 10 డాలర్ల వేతనమే చెల్లిస్తారు. కొత్తగా నియమింపబడే కార్మికుల కయితే గంటకు 11.50డాలర్ల వేతనం చెల్లిస్తారు. వీరికి ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలను పెంచనవసరం లేదు. అంటే అమెరికా ప్రభుత్వం దారిద్ర్యస్థాయిగా పరిగణించే స్థాయికి సమానమైన వేతనాలే క్రొత్త కార్మికులకు చెల్లింపబడతాయి. అంతేకాక 2000 మంది పర్మినెంటు ఉద్యోగులను (డెట్రాయిట్ ఫ్యాక్టరీలోని 900 మందితోసహా) కోత పెట్టవచ్చు.

అయితే లక్కడి పద్ధతి ప్రకారం ఈ ఒప్పందాన్ని ఆమోదిస్తూ కార్మికులు ఓటు వేయాలి.

ఈ ఒప్పందం కార్మిక విద్రోహ పూరితమయినదనీ, యాజమాన్యానికి యూనియన్ నిరంకుశ నాయకత్వం పూర్తిగా లొంగిపోయిందనీ డెట్రాయిట్‌లో పనిచేస్తున్న 1900 మంది కార్మికులూ ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నారు. యూనియన్ నాయకత్వాన్ని ఒక సమావేశంలో వారు నిలదీశారు.

ఈ ఒప్పందాన్ని ఆమోదింపచేయటంకోసం యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకత్వం నీచమయిన ఎత్తుగడలకు పాల్పడింది. తన విద్రోహ ఒప్పందాన్ని పూర్తిగా వ్యతిరేకించే డెట్రాయిట్ ప్లాంటు కార్మికులను ఒంటరిచేసి, వారిపై ఆర్థిక ఒత్తిడి తీసుకువచ్చి, సమ్మెదారులను వేధించే ఎత్తుగడలను అనుసరించింది.

ముందుగా ఈ ఒప్పందంపై ఓటింగ్‌ను చిన్న ఫ్యాక్టరీలలో బఫెలో, టోనావాండా, న్యూయార్కులలో గల ఫ్యాక్టరీలలో నిర్వహించి, ఆనక డెట్రాయిట్‌లో ఓటింగ్ నిర్వహించే విధంగా ఏర్పాటు చేసింది.

ఈలోగా "త్రీ రివర్సు" ఫ్యాక్టరీలోని కార్మికుల్లో, "ఒకవేళ డెట్రాయిట్ కార్మికులు ఈ ఒప్పందాన్ని అంగీక రించకపోతే, మేము ప్రత్యేక ఒప్పందం చేసుకొంటాం" అన్న భావనను రేకెత్తించి, కార్మికుల్లో చీలికను తీసుకువచ్చింది యూనియన్ కేంద్ర నాయకత్వం. ఆ చిన్న ఫ్యాక్టరీల్లో రెండింటినీ మూస్తాననే ప్రతిపాదనను యాజమాన్యం ఎప్పట్నించో చేస్తోంది. అందువలన చిన్న ఫ్యాక్టరీల్లోని కార్మికులు ఆ మూసివేతను తప్పించు కోవటంకోసం, విధిలేని పరిస్థితుల్లో వేతన కోతకు అంగీకరిస్తూ, ఆ లొంగుబాటు ఒప్పందాన్ని అంగీకరిస్తూ ఓటు వేశారు.

ఆ రకంగా యూనియన్ కేంద్ర నాయకత్వం నిరంకుశంగా తన లొంగుబాటు ఒప్పందాన్ని బల వంతంగా అమెరికన్ ఏక్సిల్ కార్మికులపై రుద్ది, వారి వేతనాలకోతకూ, హక్కుల రద్దుకూ, ఉద్యోగభద్రతాలేమికీ దారులు తెరిచింది.

ఇందుకు ప్రతిఫలంగా యూనియన్ యాజమాన్యం యూనియన్ నిర్వహించే "సంయుక్త కార్యక్రమాలు-శిక్షణ పథకాలకు" యాజమాన్యం పూర్తి శాతం నిధులు యిస్తుంది. ఈ పథకాలు-కార్యక్రమాలకు ప్రతినిధులుగా వుండే యూనియన్ కార్యకర్తలకు, జిల్లా యూనియన్ నాయకులకూ, కమిటీ సభ్యులకూ, సంయుక్త కార్యక్రమాల కమిటీ సభ్యులకూ, ప్రతినిధులకూ ఓవర్ టైం బోనస్ చెల్లించబడుతుంది. ప్రమోషన్ అవకాశాలు పదిలంగా వుంటాయి. ఇదికాక 50 బిలియన్ల డాలర్ల జి.ఎం. ఉద్యోగుల ఆరోగ్య నిర్వహణా పథకం యూనియన్ చేతుల్లోనే వుండి, నాయకులకు బహుళ ప్రయోజనాలను చేకూర్చిపెడ్తుంది.

ఈ రకంగా ఆర్థికవాదంలో కూరుకుపోయిన యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నిరంకుశ నాయకత్వం అమెరికన్ ఏక్సిల్ కార్మికుల ప్రయోజనాలకు నిర్లజ్జగా, బహిరంగంగానే విద్రోహంచేసి సమర్థించుకుంటోంది. ఇది కేవలం అమెరికన్ ఏక్సిల్ కార్మికులకు చేసిన విద్రోహమే కాదు. మొత్తం అమెరికన్ కార్ల ఉత్పత్తి పరిశ్రమ కార్మికులందరికీ చేసిన విద్రోహం. ఈ ప్రస్తుత ఒప్పంద ప్రాతిపదికన ఫోర్డు, క్రిజ్లర్, డెల్ఫీ తదితర ఆటో ఉత్పత్తిరంగ కంపెనీలలో కార్మికులకు మరింతగా విద్రోహం జరిపే ఒప్పందాలు చేయబడతాయి. ఆ పరిశ్రమరంగ కార్మికుల ప్రయోజనాలపై మరింతగా దాడి జరుగుతుంది. వారు సాధించుకున్న హక్కులూ, సౌకర్యాలూ కుదించబడతాయి. కార్ల ఉత్పత్తి కంపెనీల స్టాక్‌లలో వాటాదారులైన (వాటాలను కలిగివున్న) యూనియన్ నిరంకుశ నాయకులు, తమ వాటాలపై లాభాలు, తమకు గల ప్రత్యేక సదుపాయాలకోసం, కార్మికుల ప్రయోజనాలను యాజమాన్యాలకు అమ్మి వేయటానికి సిద్ధపడ్డారు.

వివిధ దేశాల్లోని ఉక్కు పరిశ్రమలోని కార్మికులూ, బొగ్గు గని కార్మికులూ తమ ఫ్యాక్టరీలు, గనులు మూసివేయటాన్ని ప్రతిఘటిస్తూ, తమ వేతన ఒప్పందా లను బలహీనపరచటానికి యాజమాన్యాలు చేసే ప్రయత్నాలను నిరోధిస్తూ, ప్రతిఘటించటానికి దీర్ఘకాలిక సమ్మెలను జరుపుతూ తమ ప్రయోజనాల పరిరక్షణకోసం పోరాడుతూ వుండగా, యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకత్వం ఈ రకంగా లొంగుబాటు వైఖరినీ, కార్మిక విద్రోహపూర్వక వైఖరినీ అవలంబించటం చూస్తే, ఆ యూనియన్ నాయకత్వం ఎంతగా రోసి పోయిందో అర్థమవుతుంది. **(తరువాయి 8వ పేజీలో)**

ఎరువులు-విత్తనాల కొరతకు ప్రభుత్వ విధానాలే కారణం

సేద్యం [illegible] సమస్యలు రైతాంగాన్ని [illegible] ఖరీఫ్ సీజను ప్రారంభమైయింది [illegible] విత్తనాలు, ఎరువులు. పంట రుణాలకోసం రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజనుకి ముందు రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, పంట రుణాలు సకాలంలో అందచేస్తామని పాలకులు పాట పాడుతూనే ఉన్నారు. అయినా పాలకులు ఏ సంవత్సరం ఆ మాట నిలబెట్టుకోలేదు. విత్తనాలు, ఎరువుల కోసం ఆందోళన చేయక తప్పటంలేదు ప్రైవేటు వ్యాపారుల దోపిడీకి గురికాక తప్పటంలేదు. ఈ సంవత్సరం మళ్లీ అదే పరిస్థితి ఏర్పడింది

రాష్ట్రంలో వివిధ పంటలకుగాను రైతుసేద్యానికి 40 లక్షల క్వింటాళ్ళ విత్తనాలు అవసరం. ఇందులో ప్రభుత్వరంగ సంస్థలు 13 19 లక్షల క్వింటాళ్ళు, ప్రైవేటు సంస్థలు 19.6 లక్షల క్వింటాళ్ళు రైతులకు విక్రయిస్తున్నాయి. ఇంకా 10 లక్షల క్వింటాళ్ళ దాకా రైతులే సమకూర్చుకోవాల్సి వస్తున్నది. విత్తనోత్పత్తిని అధికం చేయవలసిన ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏ.పి సీడ్స్) ఆ బాధ్యత నుండి చాలా వరకు వైదొలగటం వలన రైతులకు ఈ పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఈ క్రింది విత్తనాలను మాత్రమే రైతులకు అందచేస్తున్నది.

వేరుశెనగ 10 లక్షలు. సోయా చిక్కుడు లక్ష, కంది 26 వేలు. మినుము 10 వేలు. పెసర 15 వేలు, ఆముదం 10 వేలు. మొక్కజొన్న 80 వేలు. జొన్నలు 2 వేలు. నువ్వులు 6 వందలు. సజ్జ 5 వందలు. పచ్చికొట్ట పైర్లు 75 వేల క్వింటాళ్ళు. ప్రధాన పంట విత్తనాలు అయిన వరి, పత్తికి ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించక పోవటం గమనించాల్సిన అంశం

ఈ ఖరీఫ్ సీజనులో రైతులకు సరిపడే రకాల విత్తనాలను అందుబాటులో ఉంచామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా అందుకు సరైన ఏర్పాట్లు చేయకపోవటం వలన విత్తేతరుణం ప్రారంభమైనా విత్తనాలను అందుబాటులో ఉంచటంలో ప్రభుత్వం విఫలమైయింది. కొన్ని విత్తనాలు రైతుల అవసరాలకు అనుగుణంగా జరగలేదు. ప్రభుత్వం సేకరించే వేరుశెనగ విత్తనాలు 10 లక్షల క్వింటాళ్ళు. ఒక్క అనంతపురంజిల్లాలోనే రైతులకు 10 లక్షల క్వింటాళ్ళ వేరుశెనగ విత్తనాలు కావాలి. ఇంకా అనేక జిల్లాల్లో వేరుశెనగ ముఖ్యమైన పంటల్లో ఒకటిగా రైతులు పండిస్తున్నారు. అందువలన ప్రభుత్వం అందచేసే విత్తనాలు రైతుల అవసరాలను ఏ మాత్రం తీర్చవు. ఇప్పటికి ప్రభుత్వ సంస్థలు సేకరించింది 5.5 లక్షల క్వింటాళ్ళు మాత్రమే. అందువలన ప్రైవేటు వ్యాపారుల వద్ద అధికరేటుపెట్టి కొనుగోలు చేయక తప్పటంలేదు. పత్తికి సబ్సిడీలేకపోవటం వలన అధికరేటు పెట్టి పేద, మధ్యతరగతి రైతులు విత్తనాలు కొనుగోలు చేయవలసి వస్తున్నది. మోన్‌శాంటోలాంటి బహుళజాతి సంస్థలకంపెనీల ప్రచారానికి మోసపోయి బి.టి. విత్తనాలు అధిక ధరలకు కొనుగోలుచేసి తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు కోరుతున్న 1061, 1001 రకం వరి విత్తనాలు సేకరణ నామమాత్రంగానే చేసింది.

బయట మార్కెట్‌లో విత్తనాల ధరలు ఎక్కువగా ఉండటం, ఆ విత్తనాలపై నమ్మకంలేకపోవటంతో ప్రభుత్వ సంస్థల దగ్గర కొనుగోలు చేయటానికి, వాటి చుట్టూ కాళ్ళ చెప్పులు అరిగేలా రైతులు తిరుగుతున్నారు. జిల్లాలకు అందించవలసిన విత్తనాలు సరఫరా చేయటంలో ప్రభుత్వ విఫలత వలన విత్తనాలు అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అనంతపురంజిల్లాలో ఈ నెలాఖరుకు వేరుశెనగ విత్తటం ప్రారంభిస్తారు. జిల్లాలో 21 లక్షల ఎకరాల్లో ఈ పంటను పండిస్తారు. ఇందుకుగాను 10 లక్షల క్వింటాళ్ళ విత్తనం అవసరమైతే, ఇప్పటి వరకు ప్రభుత్వం సరఫరా చేసింది అత్యల్పమే, జూన్ 15 నుంచి రైతులు విత్తనాలు వేయటం ప్రారంభిస్తారు. ప్రభుత్వం 11 నుండి పంపిణీ చేస్తామని ప్రకటించినా 3.6 రకం 60 వేల క్వింటాళ్ళు, టి.ఎం.ఎ.రకం 3.5 లక్షల క్వింటాళ్ళు, జె.ఎల్.245, నారాయణి, పొలాచి రకాలు 1.4 లక్షల క్వింటాళ్ళు పంపిణీ చేయాలని నిర్ణయించింది. విత్తన సేకరణ బాధ్యతను ఆయిల్‌ఫెడ్, హాకాలకు అప్పగించింది. ఇప్పటి వరకు 3.5 లక్షల క్వింటాళ్ళు వేరుశెనగ విత్తనాలు సేకరించారు. దీంతో విత్తనాల సమస్య రైతును భయపెడుతున్నది. **మహబూబ్‌నగర్ జిల్లాలో** ఖరీఫ్ సాగు 20 లక్షల హెక్టార్లు. ఇందుకు 85,952 క్వింటాళ్ళ వివిధ రకాల విత్తనాలు కావాలి. ప్రస్తుతం 20 క్వింటాళ్ళకు మించి విత్తనాలు అందుబాటులో లేవు. ఇప్పటికే కురుస్తున్న వర్షాల మూలంగా జొన్న, పెసర, కందులు నాటేందుకు రైతులు సిద్ధమౌతున్నారు. ఎస్.ఎ.వి.జొన్నరకం 1875 క్వింటాళ్ళ అవసరం కాగా 73-75 క్వింటాళ్ళు మాత్రమే అందుబాటులో ఉన్నాయి, మొక్కజొన్న 20,250 క్వింటాళ్ళ అవసరానికిగాను 16,913 క్వింటాళ్ళు, కందులు 15 వందల క్వింటాళ్ళకుగాను 507 క్వింటాళ్ళు, ఆముదాలు 8 వందల క్వింటాళ్ళకుగాను 323 క్వింటాళ్ళు, వేరుశెనగ 58,200 క్వింటాళ్ళకుగాను 1980 క్వింటాళ్ళు మాత్రమే జిల్లాకు పంపబడ్డాయి. రైతులు ఎక్కువగా సాగుచేసే ప్రొద్దుతిరుగుడు విత్తనాలు అధికారులు జిల్లాకి పంపలేదు. ఈ విత్తనాలు రైతుల అవసరాలను ఏ మాత్రం తీర్చవు. విత్తనాలకోసం రైతుల్లో తీవ్ర ఆందోళన అలజడి ప్రారంభమైయింది.

గుంటూరుజిల్లాలో 5.56 లక్షల క్వింటాళ్ళ విత్తనాలు అవసరంకాగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా 29,915, ప్రైవేటు ఏజెన్సీల ద్వారా 35,546 క్వింటాళ్ళ విత్తనాలు మాత్రమే విక్రయిస్తున్నారు. మిగతా విత్తనాలు రైతులే సమకూర్చుకోవాల్సి వుంది. ఇప్పటి వరకు 20 శాతం విత్తనాలు కూడా జిల్లాకి అందలేదు.

క్రిష్ణాజిల్లాలో రెండు లక్షల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. అందుకు కావాల్సిన విత్తనాల్లో 10 శాతం మాత్రమే ఆం ప్ర. విత్తనాభివృద్ధి సంస్థ అందచేస్తున్నది. ప్రస్తుత పంటల తరుణంలో రైతులు 1061 రకం వరి విత్తనాలు సాగువైపు మొగ్గు చూపుతున్నారు. అందుకు కారణం దోమపోటు, వర్షాలను తట్టుకొని 38 నుండి 45 బస్తాల దాకా దిగుబడులు వస్తాయని రైతులు నమ్మకంతో వున్నారు. ఈ రకం విత్తనాలు 19 వేల క్వింటాళ్ళు సరఫరా చేస్తామని చెప్పిన అధికారులు అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోకపోవటంతో విత్తనాలు అందవేమోనని రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నారు.

పశ్చిమగోదావరిజిల్లాలో 6.15 లక్షల హెక్టార్లు ఈ సంవత్సరం సాగు చేస్తున్నారు. అందుకు 1.4 లక్షల క్వింటాళ్ళ విత్తనాలు అవసరం. ఏ.పి. సీడ్స్ వద్ద 35 వేల క్వింటాళ్ళు మాత్రమే ఉన్నాయి. చాలినన్ని విత్తనాలు అందుబాటులో లేకపోవటం వలన రైతుల్లో ఆందోళన ఎక్కువ అయ్యింది. **విశాఖజిల్లాలో** 67,500 క్వింటాళ్ళ విత్తనాలు అవసరంకాగా ఏ.పి. సీడ్స్ వద్ద 10 వేలు, విత్తన వ్యాపారులు వద్ద 3 వేల క్వింటాళ్ళు విత్తనాలు మాత్రమే ఉన్నాయి. **విజయనగరంజిల్లాలోని** పార్వతీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో 1001 రకం వరి విత్తనాలను రైతులు సాగుకోసం ఎంచుకొన్నారు. ఈ విత్తనాలు అధికారులు అందుబాటులో ఉంచకపోవటం వలన రైతులు విత్తనాలకోసం తీవ్ర ఆందోళన పడుతున్నారు.

ఇదే విధంగా వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ మొదలైన జిల్లాల్లో విత్తనాలు అందుబాటులోలేక రైతుల్లో అలజడి, ఆగ్రహం ఎక్కువ అయ్యింది.

నకిలీ విత్తనాలు: పంటలకు కావాల్సిన విత్తనాలు దొరకక ఆందోళన పడుతుంటే, విత్తన కొరతను అదునుగా తీసుకొని, నకిలీ విత్తన వ్యాపారం రాష్ట్రమంతటా పెద్దఎత్తున సాగుతున్నది. దీన్ని అడ్డుకోవటానికి ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవటంతో, నకిలీ వ్యాపారులది ఇష్టారాజ్యంగా మారింది. కర్నూలు నుండి ఆదిలాబాద్‌కి బస్సులో తరలిస్తున్న 280 ప్యాకెట్ల బి.టి. నకిలీ విత్తనాలను ప్రకాశంజిల్లా గిద్దలూరులో, బి.టి. కాటన్ పేరుతో అమ్ముతున్న బి.టి. కాటన్ విత్తనాలు, ఎర్రగొండపాలెంలో రెండు లక్షల విలువైన నకిలీ విత్తనాలు, పొదిలిలో 200 ప్యాకెట్ల విత్తనాలు, కర్నూలుజిల్లా ఆధోనిలో 6,148 కిలోల నకిలీ విత్తనాలు, వరంగల్‌జిల్లా భూపాలపల్లిలో ట్రాన్స్‌పోర్టు వాహనంలో రవాణా చేస్తున్న ఆరు లక్షల రూపాయల విలువగల 333 ప్యాకెట్ల బెస్ట్ కంపెనీ విత్తనాలు ఇంకా ఇదే విధంగా రవాణా అవుతున్న నకిలీ విత్తనాలను అధికారులు పట్టుకొన్నారు. నకిలీ విత్తనాల రవాణాను పరిశీలిస్తే, వీటి రవాణాకోసం అన్ని రకాల మార్గాలను వీటి విక్రయదారులు ఎంచుకొంటున్నారని అర్ధమౌతున్నది.

ఎరువుల కొరత: రాష్ట్రంలో విత్తనాలతోపాటు ఎరువులకు తీవ్రకొరత ఏర్పడింది. రైతులకు ఎరువులు ఎంత అవసరం, అందుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి పాలకులకు ముందుచూపులేకపోవటమే ఇందుకు కారణం. రాష్ట్రంలో రైతుల సేద్యపు వినియోగానికి యూరియా 13.50 లక్షల టన్నులు, డి.ఎ.పి. 3.82, కాంప్లెక్‌సన ఎరువులు 9.50, పొటాష్ 2.50, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 1.60 ఇతరు ఎరువులు 1.15 లక్షల మొత్తం 32.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం విత్తనాలలాగానే ఎరువుల కోసం రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యూరియా, డి.ఏ.పి. ఎరువులు అవసరం మేర అందించేందుకు కేంద్రం అంగీకరించిందని, 30 శాతం ఎరువుల సరఫరాకోసం వివిధ సహకార సంఘాల నిధులతో వివిధ కంపెనీలకు మార్క్‌ఫెడ్ ముందుగానే డబ్బు చెల్లించిందని, ఇఫ్కోకు 110 కోట్లు, ఐ.పి.ఎల్.కు 50 కోట్లు ఇలా మొత్తం 300 కోట్లు చెల్లించింది. అయినా రాష్ట్రానికి ఎరువుల సరఫరా సక్రమంగా జరగటం లేదు. కేంద్రం 9.5 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులకుగాను 8.3 లక్షల టన్నులకు ఇప్పటి వరకు ఆమోదం తెలిపి ఏయే కంపెనీలు సరఫరా చేయనున్నదీ కూడా తెలిపింది. ఆ మేరకు కూడా ఈ ఎరువుల సరఫరా జరగటం లేదు.

రైతు అవసరాల మేరకు ఎరువులు సరఫరా కాకపోవటంతో, వాటి కొరత తీవ్రరూపం దాల్చింది. రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌లో కాంప్లెక్స్ ఎరువులు దొరకటంలేదు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో సరుకు లేదు. బోర్డులు పెడుతున్నారు. ఎరువుల షాపు యజమానులు కొందరు అధికారులతో కలసి వ్యూహం ప్రకారం ఎరువుల కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులు-విత్తనాలకోసం రైతుల ఆందోళన:

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటం, విత్తనాలు, ఎరువులు అందుబాటులోలేకపోవటంతో పేద, మధ్యతరగతి రైతులు వాటికోసం ఆందోళన ప్రారంభించారు

నిజామాబాద్‌జిల్లాలో సోయా బీన్ విత్తనాలకు తీవ్ర కొరత ఏర్పడింది వాటికోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. అధికారపార్టీ స్థానిక నాయకులు, అధికారులు దొంగ పర్మిట్ సర్టిఫికెట్లు సృష్టించి అక్రమ అమ్మకాలకు పాల్పడుతున్నారు. మండల కేంద్రం మద్నూరులో సోయాబీన్ సబ్సిడీ విత్తనాల పంపిణీకోసం పర్మిట్ల కౌంటర్లు ప్రారంభించారు. వ్యవసాయ అధికారులు వంద మంది రైతులకు మాత్రమే పర్మిట్లు జారీచేసి చల్లగా జారుకున్నారు. స్థానిక అధికార పార్టీ నాయకులు రంగప్రవేశం చేసి, వ్యాపారులతో కుమ్మక్కుఅయి ఐదు వందల దొంగ పర్మిట్లను జారీ చేశారు. రాష్ట్రంలో సోయాబీన్ విత్తనాలను సబ్సిడీపై 30 కిలోల బ్యాగ్‌ను 360 రూపాయలకు అమ్ముతున్నారు. దొంగ పర్మిట్ల ద్వారా ఈ విత్తనాలను మహారాష్ట్రకు తరలించి అక్కడ 1030 రూ. అమ్ముతున్నారు. దీన్ని పసిగట్టిన రైతులు ఆగ్రహం చెంది అధికారులకు వ్యతిరేకంగా మండల కేంద్రం మద్నూర్‌లో జాతీయ రహదారిపై రెండు వేల మంది రాస్తారోకో చేశారు. రైతులందరికీ పర్మిట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. తాహసిల్దార్, ఎస్.ఐ. రాస్తారోకో విరమించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవటంతో వ్యవసాయాధికారిని రాస్తారోకో దగ్గరకు రప్పించారు. దొంగపర్మిట్లు రద్దుచేసి రైతులదరికీ పర్మిట్లు ఇస్తానని హామీ యివ్వటంతో ఆందోళన విరమించారు. క్రిష్ణాజిల్లాలో 1061 విజయనగరంజిల్లాలో 1001 వరి విత్తనాలకోసం ఆందోళన చేపట్టారు. డిచ్‌పల్లి మండలంలో సోయాబీన్ విత్తనాల పంపిణీలో అధికారులు అవకతవకలకు పాల్పడటం, వారికి నచ్చిన రీతిలో పంపిణీ చేయటం రైతులకు సరిపడా విత్తనాలు ఇవ్వకపోవటంతో గన్నారం, ధర్మారం గ్రామాలకు చెందిన రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 10.6.08న ఉదయం 8.30 గంటలకే వ్యవసాయ కార్యాలయానికి తరలివచ్చి ఏం మజాక్ చేస్తున్నారా? మా బ్రతుకులతో చెలగాటమాడుతున్నారా? మేము కన్నెర్ర చేస్తే మీరెంత, మీ ప్రభుత్వం ఎంత అని అధికారులను కార్యాలయంలో నిర్బంధించి షట్టర్ మూసివేశారు. అనంతరం డిచ్‌పల్లిలో రాస్తారోకో నిర్వహించారు.

కడపజిల్లా: ఎరువులకోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, తొండూరు, వేముల, వేంపల్లె, మైదుకూరు, దువ్వూరు మండలాల్లో డి.ఎ.పి., పాస్ఫేట్‌కోసం రైతులు సేవా కేంద్రాల వద్ద బారులు తీరి నిలబడ్డారు. పర్మిట్లకు అనుగుణంగా డి.ఎ.పి.28-28-0, పాస్ఫేట్ ఇవ్వకుండా అవసరంలేని గుళికలు, క్లోరపైరిపాస్ ఇస్తామనటంతో రైతులు ఆగ్రహం చెంది ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యాన్ని నిరసిస్తూ రాస్తారోకో ప్రారంభించారు. ఇక నుండి సక్రమంగా ఎరువులు పంపిణీ చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

నల్గొండజిల్లా: మిర్యాలగూడలో ఎరువుల కొనుగోలుకు రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. 7.6.08 ఉదయం నుంచి దుకాణాల వద్ద పడిగాపులు పడ్డారు. ఎరువుల కోసం రైతులు గ్రోమోర్ కౌంటర్ వద్దకు దూసుకు వెళ్లడంతో దుకాణాన్ని మూసివేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఇందులో మహిళలు కూడా పెద్దఎత్తున పాల్గొన్నారు. దీంతో షాపును తెరిచి ఎరువులు ఇవ్వటంతో రైతులు శాంతించారు.

మెదక్‌జిల్లా: నారాయణఖేడ్ ప్రాధమిక సహకార సంఘం పరిధిలోని గ్రామాల రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయకపోవటంతో సంఘం సమీపంలోని ప్రధాన రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. సీజన్ ప్రారంభానికి ముందే సహకార సంఘం అధికారులు గ్రామాలకు వచ్చి అవసరమైన ఎరువులు, విత్తనాలు తామే సరఫరా చేస్తామని చెప్పారని, సీజన్ ప్రారంభమయ్యాక పనులు మానుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, రేపుమాపు అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప ఎరువులు సరఫరా చేయటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు ఇష్టం వచ్చిన ధరలతో దోచుకొంటున్నారని చెప్పారు ఎరువులు, విత్తనాలు ఇచ్చేదాకా ఆందోళన చేస్తామని ప్రకటించారు. **రంగారెడ్డిజిల్లాలో** రైతులు ఎరువులకోసం ఎరువుల షాపులు, విక్రయకేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు అవసరాలకు తగ్గట్టుగా ఎరువులు సరఫరా చెయకపోవటంతో 3.6.08 తేదీ నుండి రైతులు ఆందోళనలు చేయటంతో ఐ.పి ఎల్. తయారు చేసిన డి.ఎ.పి ని వికారాబాద్ వ్యవసాయ కార్యాలయానికి 10.6 08న పంపారు. ఈ కంపెనీ డి.ఎ.పి. వద్దని, గోదావరి డి.ఎ పి కావాలని అది వచ్చేదాకా కదిలేది లేదని వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్‌ను రైతులు నిర్బంధించారు. పోలీసుల విన్నపాలను తిరస్కరించారు. తాండూరు, పరిగి ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. వికారాబాద్‌లో ఎరువుల అమ్మకం నిలిపివేయటంపై ఆగ్రహం చెందిన రైతులు బ్యాంక్‌లు, సినిమా థియేటర్లపై రాళ్ళు రువ్వారు. సమీపంలోని పెట్రోల్ బంక్ ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. రైతులు ఆగ్రహం చూసి బెంబేలు పడ్డ వ్యాపారులు షాపులు మూసివేశారు. రైతులపై పోలీసులు రైతులను అరెస్టుచేసి, కేసులు బనాయించి రిమాండ్‌కి పంపారు. **చేవెళ్ళలో** రైతులు రోడ్డుపై బైఠాయించి, వ్యవసాయ డివిజన్ కార్యాలయానికి తాళం వేసి రాస్తారోకో చేశారు. **మెదక్‌జిల్లా** నారాయణఖేడ్‌లో ఎరువులు, విత్తనాల కోసం బంద్ చేశారు. స్వచ్ఛందంగా బంద్‌కి అందరూ సహకరించారు. **జహీరాబాద్‌లో** పెద్ద ఊరేగింపుతోపాటు రాస్తారోకో చేశారు. **నవాబ్‌పేటలో** ఎరువులు ఇవ్వలేదని సింగిల్‌విండో కార్యాలయాన్ని దిగ్బంధం చేశారు.

ఈ విధంగా రాష్ట్రవ్యాపితంగా పేద, మధ్యతరగతి రైతులు, విత్తనాలు, ఎరువులకోసం ధర్నాలు, రాస్తారోకోలు, దిగ్బంధనాలతో ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ అధికారులపై మండిపడుతున్నారు.

విత్తనాలు-ఎరువుల కొరతకు కారణాలు:

రాష్ట్రంలో విత్తనాలు, ఎరువుల కొరతకు పాలకుల విధానాలే కారణం. వీటి ఉత్పత్తి ఎడల పాలకులకు స్వావలంబన విధానం లేదు. గతంలో రైతు పండించే పంట నుండే విత్తనాలు సమకూర్చుకొనేవారు. దేశీయ విత్తనాలను అభివృద్ధికి కృషి చేయకుండా, సస్యవిప్లవం పేరుతో హైబ్రీడ్ విత్తనాలు, ఇప్పుడు బి.టి. విత్తనాలు ప్రవేశించటంతో, విత్తనరంగంలో స్వాలంబన మరుగున పడింది. ఫలితంగా బహుళజాతి సంస్థలపై ఆధార పడటంతో విత్తనకొరత ఏర్పడి నకిలీ విత్తనాలు కూడా రాజ్యం ఏలుతున్నాయి. మోన్‌శాంటో తరపున మహికో ప్రవేశపెట్టిన బి.టి. విత్తనాల రకాలు రైతాంగాన్ని నిలువునా ముంచాయి. అయినా క్షేత్రస్థాయి పరీక్షలు కూడా సాగించకుండా, కొత్త బి.టి. రకాలకు ప్రభుత్వం అనుమతినిస్తున్నది. పాత వాటికంటే ఇది మంచిదంటూ అమ్మకాలను సాగిస్తున్నారు. లాభాలు దండుకుంటున్నారు. కేజి వంద రూపాయలు చేసే బి.టి. విత్తనాన్ని వెయ్యి రూపాయలకు అమ్ముతుంటే, ప్రభుత్వం బేరమాడి 750 రూపాయల రేటుకు కంపెనీని ఒప్పించి, రైతాంగాన్ని ఉద్ధరించినట్లు పోజుపెడుతున్నదంటే రైతాంగాన్ని నిలువు దోపిడీ చేసుకునేందుకు ఎంతగా సహకరిస్తున్నదో అర్ధమౌతుంది.

ఎరువుల కొరతకు రెండు ప్రధానాంశాలున్నాయి. అధిక దిగుబడి వంగడాల పేరిట రసాయనిక ఎరువుల వాడకాన్ని తప్పనిసరి చేశారు. ఇది భూసారం క్షీణించి పోవటానికి దారితీసింది. 1960 దశకంలో ఒక కిలో

(తరువాయి 8వ పేజీలో)

రైతాంగాన్ని గెంటివేసే కోస్తా కారిడార్‌ను వెంటనే విరమించాలి!

పారిశ్రామిక అభివృద్ధి పేరుతో ప్రత్యేక ఆర్థిక మండళ్ళను మరియు ఇండస్ట్రియల్ పార్కులు. థీమ్ పార్కులు, మెగా కెమికల్ కాంప్లెక్స్‌లు. పెట్రోపార్కుల పేరుతో లక్షలాది ఎకరాల రైతుల సేద్యపు భూములను బలవంతంగా గుంజుకొని బడా పారిశ్రామిక వేత్తలకు, బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు పూనుకొన్న ప్రభుత్వం, ఇప్పుడు కోస్తా కారిడార్ ఏర్పాటు జి.ఓ.నెం. 34ను విడుదల చేయటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు

రెండేళ్ళ క్రితమే ప్రతిపాదించిన ఈ కోస్టల్ కారిడార్ ఎడల రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైయింది. అయినా దాన్ని లక్ష్యపెట్టకుండా శ్రీకాకుళంనుండి నెల్లూరు వరకుగల తొమ్మిది జిల్లాల్లో 1575 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కోస్తా కారిడార్‌ను దశల వారీగా ఏర్పాటు చేయటానికి లక్షలాది ఎకరాల భూసేకరణకు రంగం సిద్ధంచేసింది. రెండువేల కోట్ల రూపాయలతో ఈ కారిడార్ ఏర్పాటు చేసి పరిశ్రమాధిపతులకు అప్పగిస్తారు.

ఇందులో భాగంగా మొదటి ఫేజ్-1క్రింత, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లో 603 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ ప్రాంతాన్ని ఏర్పాటుచేసి అందులో పెట్రోలియం, కెమికల్, పెట్రోకెమికల్స్ విద్యుత్, రసాయన ఎరువులు, నేచురల్ గ్యాస్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం ఈ రెండు జిల్లాల్లో లక్షా యాభైవేల ఎకరాల రైతుల సేద్యపు భూములను స్వాధీనం చేసుకొనేందుకు ప్రభుత్వం సిద్ధమైంది ఇప్పటికే 51వేల 500 ఎకరాల భూములను సేకరించటం పూర్తయ్యింది. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో 70శాతం ప్రైవేటు పరిశ్రమదారులకు కేటాయిస్తారు ఇందులో బహుళజాతి సంస్థలకు కూడా అవకాశం కల్పించారు. అందువలన కోస్తా కారిడార్ వారి ఇష్టారాజ్యంగా మారుతుంది

ఇప్పటికే కాకినాడ, విశాఖపట్నంలో ఉన్న ఓడ రేవులతోపాటు నూతనంగా విశాఖ సమీపంలోని గంగవరం వద్ద మరో పోర్టు సిద్ధమౌతున్నది. ఇవి కాకుండా ఈ కారిడార్ క్రింద తూర్పుగోదావరిజిల్లా తొండంగి మండలంలో కాకినాడ సెజ్‌కోసం మరో ఓడరేవుని నిర్మిస్తారు. ఈ సెజ్ పదివేల ఎకరాల్లో నెల కొల్పేందుకు సిద్ధంచేస్తున్నారు ఇందులో పెట్రోకెమికల్ కాంప్లెక్సులు ఏర్పాటు కానున్నాయి. దీన్ని తూర్పు గోదావరి జిల్లాలో పెట్రో కారిడార్ పిలవనున్నారు. పిఠాపురం నుండి నాగులాపల్లి మీదుగా తీరప్రాంతాన్ని రైల్వేలైన్‌తో కలుపుతారు ఉప్పాడ దగ్గర ఎయిర్ పోర్టు, ఎయిర్ కార్గో టెర్మినల్‌ను నిర్మించేందుకు ప్లాన్ రూపొందిస్తారు. మొత్తం మూడుదశల్లో దీన్ని పూర్తి చేస్తారు. మొదటి దశలో కాకినాడ నుండి విశాఖ దగ్గర భీమిలి వరకు పరిశ్రమల కారిడార్ ఏర్పాటు అవుతుంది. ఇందులో రసాయనిక ఎరువుల, పెట్రో కెమికల్స్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తారు. రెండవ దశలో భీమిలి నుండి శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం వరకు తీరప్రాంత కారిడార్‌ను విస్తరింపచేస్తారు. మూడవ దశలో కాకినాడ- ఎస్. యానాం నుంచి కలింగపట్నం వరకు పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేస్తారు. ఇందులో ఇప్పటికే ఉన్న ఆయిల్ డ్రిల్లింగ్, గ్యాస్ ద్రవ్యకాల ప్లాంట్లు, ఇతర భారీ పరిశ్రమలను కూడా కలుపుతారు. కొత్త సెజ్‌ల ద్వారా పరిశ్రమలను విస్తరిస్తారు. థీమ్ పార్కులు, హబ్‌లు ఏర్పాటుచేస్తారు.

గుంటూరుజిల్లా నిజాంపట్నం, ప్రకాశంజిల్లా ఓడ రేవుల మధ్య మరో పారిశ్రామిక కారిడారును ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. దీనితోపాటు ఓడరేవు నిర్మాణం చేపట నున్నది. ఈ రెంటికి 13వేల ఎకరాల్లపైగా భూమి అవసరం. ఈ కారిడార్‌లో పరిశ్రమ ఏర్పాటుకి 16వేల కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు నిర్మించేందుకు అరబ్బు సంస్థ రస్ ఆల్‌ఖైదాతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. దీనివలన పోర్టుకి అనుబంధంగా భారీ పరిశ్రమలు వస్తాయని ప్రభుత్వం చెప్తున్నది. ఇందుకు భిన్నంగా రస్ అల్ ఖూదా పోర్టుని అడ్డం పెట్టుకొని పరిశ్రమలతోపాటు, కొత్తరలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రంగం సిద్ధం చేసుకొంటున్నది. ఇందుకు మ్యాట్రిక్స్ సంస్థ ద్వారా ఈ వ్యాపారం మొదలుపెట్టనుంది. ఇందుకోసం వెంటనే భూమిని సేకరించి యివ్వాలని ప్రభుత్వంపై వత్తిడి ప్రారంబించింది. అందుకు ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగుతున్నది.

ఈ కారిడార్ కోసం ఒక్క ప్రకాశంజిల్లాలోనే సుమారుగా 9వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోనుంది. ఇందులో రైతుల పట్టా భూములు 5.101 ఎకరాలు. పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూమి 1.534, ప్రభుత్వ భూమి 787, అటవీ భూములు 1280 ఉప్పు భూములు 1000 ఎకరాలు ఉన్నాయి. దీనివలన పేటపాలెం. దరాంజాకు తీర ప్రాంత గ్రామాల్లోని మోటు పల్లి కృష్ణాపురం, పట్టపుపాలెం, కారామట్టపురం, పెదమెల్ల పాలెం, కుంకుమచెల్లపాలెం, రామచంద్రపురం, చెక్కవు చెల్లపాలెం గ్రామాల్లో 1056 ఇల్లు ఖాళీ చేయాలి. ఈ భూమిలో కాకుండా నిజాంపట్నం ఏరియాలో 4వేలకు పైగా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోనున్నది దీనివలన వేలాదిమంది రైతులు భూములు కోల్పోయి వీధినపడతారు మత్స్యకారులు చేపలవేటకు దూర మౌతారు ఉప్పు సాగుదెబ్బ తింటుంది. ఫలితంగా వీరి జీవితాలు అల్లకల్లోలం అవుతాయి. ఇంతకల్లోలాన్ని రేపే ఈ కారిడార్ ఏర్పాటును అడ్డుకోవద్దని ఆర్థికమంత్రి రోశయ్య ప్రజలను హెచ్చరించటం చూస్తే రాష్ట్ర పాలకులు విదేశీ పెట్టుబడిదారులకు ఎంతగా దాసోహమంటున్నారొ తేటతెల్లమౌతున్నది.

ఈ కారిడార్‌లో పరిశ్రమలు నిర్మించే పరిశ్రమాధిపతులకు పెద్ద ఎత్తున రాయితీలు కల్పించారు. భూముల కొనుగోలుపై స్టాంపు డ్యూటీ రద్దు, నిర్మాణ సామాగ్రిపై పన్నుల రాయితీ, దిగుమతి సుంకాలరాయితీ, పదేళ్ళపాటు పన్ను మినహాయింపు, కంపెనీ-కార్మిక చట్టాల మిన హాయింపు, నిర్వహణా స్వేచ్ఛ యిస్తారు

కోస్తా కారిడార్ ఏర్పాటు వలన వేలాది మందికి ఉద్యోగ అవకాశాలతోపాటు, లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించుటయే ప్రధానమైనప్పుడు ఈ కారిడార్‌లో వచ్చే పరిశ్రమలను వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తే, ఇందుకు అవసరమైన భూమి సేద్యానికి నష్టం లేకుండా సేకరించవచ్చు. ఈ ప్రాంతాల్లో సేద్యేతర భూములు విస్తారంగా ఉన్న విషయం పాలకులకు తెలిసిందే. ఇందువలన వెనుకబడిన ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరకుతాయి. అందుకు పాలకులు సిద్ధంకాకపోవటానికి కారణం ఏమిటి? సస్యశ్యామలమైన పంట పొలాలకే ఎందుకు ఎసరు పెడుతున్నది.

పారిశ్రామికవేత్తలకు ప్రజల ప్రయోజనం, ఉపాధి అవకాశాలకన్నా పరిశ్రమలకు అవసరమయ్యే సహజ వనరులను ఉపయోగించుకొని పెద్దఎత్తున లాభాలు గడించటం వారి ధ్యేయం. వారికి అనుకూలంగా వ్యవహరించటమే పాలకుల విధానం. ఇక్కడ నీరు, గ్యాస్, రైలు మార్గాలు అందుబాటులో ఉంటాయి. వీటికోసం పరిశ్రమాధిపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోకుండా పాలకులే సప్లయ్ చేస్తారు ఇవికాక ఇక్కడ ఏర్పాటుచేసే రేవులు, ఎయిర్ కార్గోలు. విమానాశ్రయాలు. రైలు మార్గాలు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చేస్తున్నవి కావు. బడా పారిశ్రామికవేత్తలు. బహుళజాతి సంస్థలు ఉత్పత్తిచేసే సరుకుల రవాణాకోసం, విలాసాలకు ఏర్పాటు చేస్తున్నవే

కారిడార్ ఏర్పాటు వలన కోస్తా ప్రాంతంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. రాష్ట్ర వ్యాపితంగా కోటి, ఏడులక్షల ఎకరాల్లో పలురకాలైన పంటలు సాగవుతున్నాయి. ఇందులో ఆహార పంటల విస్తీర్ణం 78 లక్షల 83వేల ఎకరాలు. ఆహార పంటల ఉత్పత్తిలో మూడువంతులు కోస్తా జిల్లాల్లోనే ఉంది విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో 18.40 లక్షల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరుగుతున్నది కారిడార్‌వలన లక్షా యాభైవేల ఎకరాల్లో పంట నష్టమేకాకుండా లక్షలాదిమంది రైతుకూలీలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది

ఈ కారిడార్ ఏర్పాటు వలన నీటి సమస్యకూడా తీవ్రరూపం దాలుస్తుంది. పెట్రో, రసాయనిక పరిశ్రమలకు పెద్దఎత్తున నీటి అవసరం ఉంది. పోలవరం జలాశయం ఎడమ కాలువ ద్వారా రోజుకు 1848 మిలియన్ లీటర్లు, విశాఖ నగరవాసుల దాహార్తి తీరుస్తున్న ఏలేరు ఎడమ కాలువద్వారా 385 మిలియన్ లీటర్లు, ధవళేశ్వరం బ్యారేజినుండి సామర్లకోట కాలువ ద్వారా 220 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేయాలని కారిడార్ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం పొందుపర్చింది. దీనివలన విశాఖ ప్రజల మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చుతుంది. సామర్లకోట ప్రాంతంలో సాగునీటి సమస్య ఎదురౌతుంది. ప్రజలకు త్రాగునీరు. రైతులకు సాగు నీరును ఎండగట్టి పరిశ్రమాధిపతులకు నీరు అందించటమే పాలకుల ధ్యేయం. త్రాగునీరు, సాగు నీటితోపాటు కారిడార్ ఏర్పాటు వలన మత్స్య పరిశ్రమకు కూడా అపారనష్టం ఏర్పడుతుంది.

అసలు పరిశ్రమల ఏర్పాటులోనే పాలకులకు సరైన విధానం లేదు. దేశంలో, రాష్ట్రంలో ఎలాంటి పరిశ్రమలకు ప్రాధాన్యం యివ్వాలో, వారికి పట్టలేదు. మనది వ్యవసాయకదేశం. నూటికి 70మంది వ్యవసాయంపై

(తరువాయి11వ పేజీలో)

ఏక్సిల్ ...

(6వ పేజీ తరువాయి)

వర్గచైతన్యం, వర్గ రాజకీయాల ప్రాతిపదికపైకాక, కేవలం ఆర్థిక ప్రయోజనాలకోసం నిర్వహింపబడే ఆర్థికవాద కార్యక్రమాల ప్రాతిపదికపై నిర్వహింపబడే "ట్రేడ్ యూనియనిజం" కీలక సమయంలో కార్మిక విద్రోహానికే పాల్పడుతుంది. అంతకుమించింది ఏమీ చేయలేదు అన్న విషయం మరోసారి ఈ అమెరికన్ ఏక్సిల్ కార్మికుల అనుభవంలో రుజువయింది. ఇప్పటికే జనరల్ మోటార్స్‌లోని కార్మికుల సంఖ్య 7వ వంతుకు క్రుంగిపోయిన ప్రస్తుత తరుణంలో, యునైటెడ్ ఆటో వర్కర్సు నాయకత్వం ప్రస్తుతం అమెరికన్ ఆక్సిల్ యాజమాన్యంతో చేసుకొన్న ఒప్పందం ఏ రకంగానూ సమర్థనీయమైనది కాదు. అది పూర్తిగా కార్మిక విద్రోహ కరమైన ఒప్పందం అన్నది నిర్వివాదమైన విషయం.

ఏక్సిల్ కార్మికుల పోరాటం విజయవంతంగా సాగించి, యాజమాన్యాన్ని ఓడించాలంటే, యూనియన్ నాయకత్వం సమ్మెను పరిశ్రమ అంతటికీ విస్తరింప చేయాల్సి వుంది. జనరల్ మోటార్స్, ఫోర్డు, క్రిజ్లర్, డెల్ఫీ తదితర కంపెనీల్లో చేసుకొన్న వేతన ఒప్పందాలను రద్దు చేయాలనే డిమాండుతో ఈ పోరాటం కొనసాగించాల్సి వుంది. అదే రకంగా మెక్సికోలోని అమెరికన్ ఆక్సిల్ వర్కర్సును కూడా, ఈ సమ్మెకు సంఘీభావంగా సమ్మెను చేయించటానికి ప్రయత్నాలు సాగించాల్సి వుంది. ఆ రకంగా మొత్తం అమెరికా కార్ల ఉత్పత్తి పరిశ్రమలోని కార్మికులందర్నీ సమ్మె పోరాటంలోకి దించటం ద్వారా, ఆక్సిల్ కార్మికుల డిమాండ్లతోపాటు, మొత్తం పరిశ్రమలోని కార్మికులందరి డిమాండ్లను సాధించటం సాధ్యమయి వుండేది. ఆ రకంగా కార్ల ఉత్పత్తిదారీ పరిశ్రమ యాజమాన్యాలైన కార్పోరేట్ పెట్టుబడిదారుల దాడులను విజయవంతంగా ప్రతిఘటించడం సాధ్యమయి వుండేది.

అయితే తమ మవులిక కర్తవ్యమయిన "కార్మిక ప్రయోజనాల పరిరక్షణ" విస్మరించిన అనేక అమెరికన్ యూనియన్ నాయకత్వాలు అధ్యక్ష పదవికి పోటీచేసే అభ్యర్థులను బలపర్చటం, వారి ప్రచార కార్యక్రమంలో మునిగిపోవటం అన్నదానికే ప్రాధాన్యతనిస్తున్నాయి.

యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకత్వం కూడా, పెట్టుబడిదారీ కార్పోరేషన్లు బలపరిచే అభ్యర్థులను బలపరచటంలోనే మునిగిపోయింది. దీన్నిబట్టి చూస్తే యూనియన్ నాయకత్వానికి సభ్యులైన కార్మికుల ప్రయోజనాలకన్నా, కార్పోరేట్ యాజమాన్యాలు, వారు బలపరిచే దోపిడీ రాజకీయాల ప్రతినిధుల ప్రయోజనాలే ముఖ్యమయినవిగా వున్నాయని అర్థం అవుతోంది.

అందుకే కార్మికులకు- కార్మిక సంఘాలకూ కార్మిక వర్గ రాజకీయాలు ప్రాతిపదికగా వుండాలనీ, కార్మికవర్గ ప్రయోజనాలే ప్రాధాన్యత కలిగిన అంశాలుగా వుండాలనీ, వర్గ పోరాట ప్రాతిపదికగా కార్మికులు పోరాటబాటలో నడవాలనీ, వీటన్నిటినీ సక్రమంగా నడిపించి, నిర్వహించటానికి కార్మికవర్గానికి కార్మికవర్గ పార్టీ ఏర్పడాలనీ సోషలిస్టు సిద్ధాంతం విస్పష్టంగా బోధిస్తున్నది. కేవలం కార్మిక సంఘాల ద్వారా వాటి కార్యకలాపాల ద్వారా కార్మికవర్గ ప్రయోజనాలను కనీసంగా కూడా పరిరక్షించటం సాధ్యంకాదని ఈ అమెరికన్ ఏక్సిల్ కార్మికుల సమ్మె ఉదంతం మరోసారి తేటతెల్లం చేస్తోంది.

- పాణిగ్రాహి

ఎరువులు...

(7వ పేజీ తరువాయి)

ఎకరాకి 19 కిలో ఆహారధాన్యాలు పండగా నేడు 12 కిలోలే పండుతున్నాయి. దీనితో నానాటికీ ఎరువుల వాడకం పెరిగింది. ఫలితంగా సబ్సిడీ వున్న యూరియా వాడకాన్ని రైతులు పెంచవలసి వచ్చింది. దీని వినియోగం పెంచుకొంటూపోతే తప్ప దిగుబడులు తగ్గకుండా చేయలేని విషచక్రంలో రైతాంగం చిక్కుకుపోయారు. దీంతో నానాటికీ ఎరువుల వాడకం ఎక్కువ అయింది.

ప్రభుత్వరంగంలోని ఇఫ్కో, తన పూల్ పూర్ ప్లాంటులో నాప్తాను మానివేసి సహజవాయువు ద్వారా యూరియాను తయారు చేసింది. ఈ ముడిపదార్థం వాడకంలోనే ఆ ఫ్యాక్టరీకి ఒక ఏడాదికి వెయ్యి కోట్లు ఆదా అయ్యింది. ఒక్క బి.టి.యు.కి 1.4 డాలర్ల చొప్పున గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా సహజవాయువును ఈ ఫ్యాక్టరీకి సరఫరా చేసింది. హెచ్ బి.జి. పైప్‌లైన్‌తో దాదాపు 10 ఎరువుల ఫ్యాక్టరీలను 1980 దశకంలో ఏర్పాటు చేశారు. గెయిల్ వీటికి పూర్తిగా సహజవాయువు సరఫరా చేయకపోవటం వలన వీటి నుండి ఉత్పత్తి తగ్గుతున్నది. ఈ విధంగా కూడా ఏరువుల కొరత ఏర్పడుతున్నది.

గత పది సంవత్సరాల్లో ఒక్క కొత్త ఫ్యాక్టరీని కూడా పాలకులు ఏర్పాటు చెయ్యలేదు. ఈ కారణంగా కూడా ఉత్పతి పెరగటంలేదు. వీటన్నిటి ఫలితంగా ఎరువులకు కొరత ఏర్పడి ఎరువులను దిగుమతి చేసుకొంటున్నాము.

ఎరువులు కంపెనీలు పెట్టటానికి ఎవరూ ముందుకు రానందువలన వాటిని ప్రోత్సహించటానికి పెట్రోలియం కంపెనీలకు కాంప్లెక్స్‌లు నిర్మించినట్లుగానే ఎరువులు పార్కులు నిర్మించేందుకు పూనుకొంటున్నామని ప్రభుత్వం చెబుతున్న రిలయన్స్ కంపెనీ రెండు పెద్ద ఎరువుల కంపెనీలు పెట్టేందుకు పూనుకొందని, మిగిలిన కంపెనీలు కూడా ముందుకు రావాలంటున్నారు. ఇలా పెట్టిన కంపెనీల నుండి బహిరంగ టెండర్ల ద్వారా ఎరువులు కొని రైతాంగానికి సబ్సిడీ ధరకు అందచేస్తామని ప్రభుత్వం అంటున్నది.

దేశంలో ఇప్పటికి బయటపడ్డ సహజవాయువు నిక్షేపాలు రిలయన్స్ కంపెనీకే దక్కాయి. ఇప్పటి వరకు గెయిల్ 1.4 డాలర్లకు అమ్ముతున్నది. దిగుమతి చేసుకున్నా అన్ని ఖర్చులు కలుపుకొని మూడు డాలర్లకు దొరుకుతుంది రిలయన్స్‌ను మాత్రం 4.20 డాలర్లకు అమ్ముకోమని ప్రభుత్వం అనుమతించింది. గెయిల్ కూడా ఆ ధరకే ఇవ్వమని గెయిల్ కూడా ప్రభుత్వాన్ని కోరింది. దీంతో ఎరువుల తయారీ నాఫ్తా కన్నా చౌక కాబోదు. ఆచరణలో ఎరువుల ధరలు పెరుగుతాయి.

ప్రభుత్వం ఎరువులకి ఇస్తున్న సబ్సిడీ నేరుగా రైతులకు ఇవ్వకుండా ఎరువుల కంపెనీలకే ఇస్తున్నది. ఈ విషయం ఇప్పుడే తెలిసినట్లు, రైతులకు నేరుగా చేరే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం చర్చను ప్రారంభించింది. రైతులకు ప్రత్యక్షంగా ఇస్తానని ప్రభుత్వం అనగానే, ఎరువుల కంపెనీల ప్రతినిదులున్న ఫెర్టిలైజర్ అడ్వైజరీ ఫోరం పాత విధానాన్నే కొనసాగించాలంటూ, ఆర్థికమంత్రి ప్రతిపాదనను తిరస్కరించాయి. ఫ్యాక్టరీకి పెట్టిన పెట్టుబడి, ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ చూపి, ఎరువుల ధరలు ఎక్కువగా వున్నట్లు చూపుతున్నారు. ఎక్కువ చేసిన ధరకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు వున్న తేడాను ప్రభుత్వం ఎరువుల కంపెనీకి చెల్లిస్తుంది. దీనినే సబ్సిడీగా ప్రభుత్వం చెబుతున్నది. ఇది ఫ్యాక్టరీ యజమానులకు మంచి లాభంగా వుంది. ఈ పద్ధతిని మానాలన్న ఆలోచనను ఈ ఏడాది మళ్లీ ప్రభుత్వం వెల్లడించగానే ఎరువుల పరిశ్రమలు వ్యతిరేకించాయి. ధరలు పెరిగాయి కనుక సబ్సిడీ, వివిధ రాయితీలు పెంచమని కోరాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉత్పత్తిని తగ్గించటం లేదా స్టాకును నిల్వ వుంచటం ద్వారా కృత్రిమ కొరతను సృష్టించాయన్న వాదన కూడా విన్పిస్తున్నది. ఏమైనా, ప్రభుత్వం కొన్ని రాయితీలను ప్రకటించింది.

రైతులకు ప్రత్యక్ష సబ్సిడీ ఇవ్వటానికి ప్రభుత్వం ఈ క్రింది విధానాలను ప్రతిపాదిస్తున్నది. బహిరంగ మార్కెట్‌లో టెండర్ల ద్వారా ఎరువులు కొని రైతులకు తక్కువ ధరకు అమ్మటం, రైతులకు ఎరువుల కూపన్లు యివ్వటం దేశంలో చిన్న రైతులు ఎంత ఎరువు వాడుతున్నారన్న ప్రాతిపదికన ఎకరాకి ఎంత ఎరువు వెయ్యాలో నిర్ణయించి అంత ఎరువు మాత్రమే అందే విధంగా రైతులకు కూపన్లు ఇవ్వటం లేదా ప్రభుత్వ డిపోల నుండి పంపకమో చేస్తారట. అంటే ప్రభుత్వం సబ్సిడీని ఎంత తగ్గించదలచుకుంటే అంత ఎరువుల కోటాను తగ్గిస్తారు. ఎరువులు వాడితేనే తప్ప దిగుబడులు రాని స్థితిలో భూసారం బట్టికాక, కమతాన్ని బట్టి యిస్తానని చెప్పటమంటే, ప్రభుత్వం సబ్సిడీ క్రింద యిచ్చే ఎరువులు నాలుగోవంతుకి మించి ఉండదు. మిగతాది మార్కెట్‌రేటుకి కొనాల్సిందే. ఇది పేద, మధ్యతరగతి రైతాంగం నడ్డి విరుస్తుంది.

కొరత ఏర్పడుతుందని తెలిసినా ప్రభుత్వం పూరకుండటం ఇందుకే దిగుమతి కన్నా ఉత్పత్తి చేసుకొంటేనే చవకని తెలిసినా, ఉత్పత్తి పెంచుతానంటూనే ముడిసరుకుల, సహజవాయువుల ధరసు పెంచటం దీనికోసమే. తానే సంక్షోభాన్ని సృష్టించి, తానే పరిష్కరిస్తానంటూ రైతాంగం నడ్డివిరిచే విధానాన్ని అమలుచేసే నాటకానికి తెరతీశారు.

పాలకుల వంచనను గుర్తెరిగి రైతాంగం చాలినంత ఎరువులను, విత్తనాలను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి.

- జాలయ్య

సక్సెస్ పథకం పేరిట విద్యారంగ ప్రైవేటీకరణ

ఆంధ్రప్రదేశ్‌లో 6,500 ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుండి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం 76 ఉత్తర్వు జారీ చేసింది. రాష్ట్రంలో 95% ప్రైవేటు పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం మాత్రమే ఉన్నదనీ, ఇవీ పట్టణ ప్రాంతాలలోనే ఉన్నందున గ్రామీణ విద్యార్థులకు అందుబాటులో లేవనీ, వెనుకబడిన, పేద బడుగు వర్గాల వారికి ప్రభుత్వ పాఠశాలలలో తెలుగు మాధ్యమంలోనే బోధిస్తున్నందున అన్యాయం జరుగు తోందని, దీనిని సరిదిద్ది పేదలకు సమానావకాశాలు కల్పించడం కోసం 2008-09 విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెడుతున్నామని విద్యాశాఖ ఆ ఉత్తర్వులో తెలియచేసింది.

అంతేకాక ఆంగ్లంలో సంభాషించగలిగిన, ఆంగ్ల భాషలో ప్రావీణ్యం కలిగిన వారికే వర్తమాన ప్రపంచంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయనీ, అంతర్జాతీయ సంస్థలలోను, జాతీయ సంస్థలలోను ఉద్యోగాలు పొందాలంటే ఆంగ్లభాషలో ప్రవేశం తప్పనిసరి అనీ, నిరుపేద ఎస్.సి, ఎస్.టి. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఈ పథకం అని వివరణ ఇచ్చింది.

ఆరు వేల ఐదు వందల ఉన్నత పాఠశాలలకు 2 కి మీ. పరిధిలో ఉన్న 4120 ప్రాథమికోన్నత పాఠశాలలను (యు.పి.) ఆయా ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. ఆ గ్రామాలలో ఇక ప్రాథమిక పాఠశాలలు మాత్రమే ఉంటాయి. ఈ 6,500 పాఠశాలల్లో రాష్ట్ర సిలబస్‌కు బదులుగా సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) సిలబస్‌ను ప్రవేశ పెడుతున్నది. పేదలకు సక్సెస్ (Strengthening & Universalization of Quality and Access to Secondary Schools) పథకం క్రింద ఈ 6,500 పాఠశాలలకు ఒక్కొక్క పాఠశాలకు కోటి రూపాయల చొప్పున కేటాయించి మౌలిక వసతులు, ఉపకరణాలు, సైన్సు ప్రయోగశాలలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రకటించింది. ఈ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యా పథకాన్ని (CEP) ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ICT) ప్రాజెక్టు క్రింద ప్రవేశపెడుతున్నట్లు చెబుతున్నది

ఆంధ్రప్రదేశ్‌లో ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులలో దాదాపు 60 శాతం మాత్రమే పదవ తరగతి పూర్తి చేస్తున్నారు మిగిలిన 40 శాతం మధ్యలోనే పాఠశాల విడిచి వెళుతున్నారు. దీనికి ప్రజల ఆర్థికస్థితి గతులే కారణం రెక్కాడితేగాని డొక్కాడని కోట్లాది మంది ప్రజలు తమ బిడ్డలను పోషించలేక, వారిచేత కూడా పనిచేయిస్తేగాని పొట్టగడవని పరిస్థితి మన రాష్ట్రంలో నెలకొని ఉంది. వీరి జీవన పరిస్థితులను మెరుగు పరచుటకు భూసంస్కరణలను అమలు జరపక వాటిని అటకెక్కించారు. ఫలితంగా వారి కొనుగోలుశక్తి దిగజారు తున్నది. అధికార మార్పిడి జరిగి అరవై ఏళ్ళయినా లక్షరాస్యతా శాతం 67కు దాటకపోవడానికి మౌలిక సమస్యలను పరిగణించక అర్థరహితమైన పథకాలతో, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం ఉన్నత పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం, ఒకటవ తరగతి నుంచి ఆంగ్లాన్ని బోధించాలనడం మన రాష్ట్ర అవసరాలు, ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టడమే.

మాతృభాషలో విద్యాబోధన సాగించితేనే విద్యార్థులకు వివిధ సబ్జెక్టులకు సంబంధించి విషయా వగాహన అవుతుంది, స్వతంత్రంగా వ్యక్తీకరించే శక్తి, సృజనాత్మకత పెరుగుతుంది. భారతదేశంలో విద్యారంగ సంస్కరణల నిమిత్తం నియమించిన కొఠారీ కమీషన్ కూడా పాఠశాల స్థాయిలో మాతృభాషా మాధ్యమమే ఉండాలని చెప్పింది. మాతృభాషలోనే పాలనా వ్యవహారాలన్నీ జరగాలని రాష్ట్ర ప్రభుత్వం 1971లోనే చట్టం చేసింది. అందుకు అధికార భాషా సంఘాన్ని నియమించింది దీనిని ఆచరణలో నీరు గార్చింది. రష్యా, చైనా, జర్మనీ, జపాన్, ఫ్రాన్సు మొదలైన దేశాలన్నింటిలోను మాతృభాషలోనే విద్యాబోధన జరుగు తోంది. జర్మనీ, చైనా, రష్యా, ఫ్రాన్సు వంటి కొన్ని దేశాలలోనైతే విశ్వవిద్యాలయ స్థాయి వరకు వారి భాషలోనే బోధన జరుగుతున్నది. అవి శాస్త్ర సాంకేతిక, వాణిజ్య రంగాలలో అభివృద్ధిని సాధించు తున్నాయి. వీటన్నింటినీ గాలికివదిలి రాష్ట్ర విద్యాశాఖ హడావుడిగా ఈ నిర్ణయం ప్రకటించి అమలు చేస్తోంది కొఠారి కమీషన్ 'కామన్ స్కూల్ సిస్టం' ఉండాలని ప్రతిపాదిస్తే దానినీ పాలకులు అమలుపరచలేదు సరికదా ప్రైవేటు పాఠశాలలను -ఆంగ్లమాధ్యమంలో బోధించ టానికి అను మతించారు. కొన్ని పాఠశాలలు, కళాశాలల్లో అయితే తెలుగు ఒక భాషగా కూడా లేదు. బుద్ధిపూర్వకంగా ఆంగ్ల మాధ్యమాన్ని, ప్రైవేటు పాఠశాలలను ప్రోత్సహించిన పాలకులు ఇప్పుడు ఏమీ ఎరగనట్లుగా 'పేదలకు అవకాశాల' పేరుతో ఆంగ్లమాధ్యమానికి పూనుకొన్నారు. ఇన్నాళ్ళు ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేశారు. వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఏళ్ళతరబడి ఖాళీగా ఉండటం, ఉన్నత పాఠశాలలలో అవసరానికి సరిపడా సబ్జెక్టు టీచర్లు లేకపోవడం, విద్యా వాలంటీర్లతో కాలం వెళ్ళబుచ్చేయడం, చాలా పాఠశాలలలో భౌతిక వసతులు కల్పించకపోవడం వంటి లోపాలను సరిదిద్దేందుకు గట్టి చర్యలు చేపట్టాల్సిందిపోయి ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశ పెట్టడం ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరచడమే అవుతుంది. పర్యవసానంగా పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమే. ఆంగ్లమాధ్యమం పేరుతో 4 వేలకు పైగా ప్రాథమికోన్నత పాఠశాలలను మూసివేస్తున్నారు. సార్వజనీన ప్రాథమిక విద్య, అంటే 6-14 సంవత్సరాల వయస్సు గల వారికి నిర్బంధ ఉచిత విద్యను అందించ వలసిన బాధ్యత ప్రభుత్వానిది. 14 సంవత్సరాల వయస్సు వరకు అంటే 8వ తరగతి వరకు ప్రతి ఆవాస ప్రాంతంలోను చదువుకోవటానికి అవకాశం కల్పించాలి. దీనికి భిన్నంగా, 6, 7 తరగతులను కూడా మూసి వేయడం ప్రజావ్యతిరేక చర్య; ప్రభుత్వం ప్రకటించుకున్న లక్ష్యసాధనకు వ్యతిరేకమైన చర్య.

సక్సెస్ పథకాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రానున్న 5 సంవత్సరాల్లో 6,500 కోట్ల రూపాయలు మంజూరు చేస్తుందట. 6,500 పాఠశాలల్లో ప్రతి పాఠశాలకు ఒక కోటి రూపాయల చొప్పున కేటాయిస్తారట. పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి, ప్రయోగశాలలు, గ్రంధాలయాల ఏర్పాటుకు ఖర్చుపెడతారట. మిగిలిన 4 వేల ఉన్నత పాఠశాలలను మూసి వేయవచ్చును ఈ పథకం వలన 4 వేలు యుపి పాఠశాలలు మరో 4 వేలు ఉన్నత పాఠశాలలు మూసివేసే దశకు పెట్టడటం కొండ నాలుకకు మందు వేస్తే వున్ననాలుక వూడిన చందంగా వున్నది.

ఈ సక్సెస్ పథకం ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు, బహుళజాతి గుత్తసంస్థల ప్రయోజనాల కనుగుణంగా రూపొందింది. ప్రపంచ దేశాలలో విద్య ఏ విధంగా ఉండాలనే దానిపై ప్రపంచబ్యాంకు స్పష్టమైన అభిప్రాయాలను కలిగి ఉంది సామ్రాజ్యవాద, బహుళ జాతి గుత్త సంస్థల వ్యాపార ప్రయోజనాలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి లక్ష్యంగా వివిధ దేశాలలో విద్యా పథకాలను ప్రపంచబ్యాంకు రూపొందించింది. భారతదేశంలో **DPEP (District Primary Education Project)** కు 87 మిలియన్ డాలర్లను సమకూర్చింది. ఆ ప్రాజెక్టు ఇప్పుడు సర్వశిక్షా అభియాన్ పేరుతో, (నూతనంగా రాజీవ్ విద్యా మిషన్ (ఆర్.వి.ఎం)గా మార్చబడింది) మన దేశంలో అన్ని రాష్ట్రాలలోను అమలు జరుగుతోంది. పెరుగ్వేలో, హంగరీలో ఇంకా పలు దేశాలలో అమలు చేస్తున్నది. వీటికి ప్రపంచబ్యాంకు, జర్మనీ, ఇంగ్లండ్ మొదలైన కొన్ని సంపన్న దేశాలు నిధులను సమకూర్చుతున్నాయి

సెకండరీ విద్యలో ప్రపంచబ్యాంకు తన లక్ష్యాన్ని ఈ విధంగా ప్రకటించింది. ప్రపంచీకరణ యుగంలో, నూతన సాంకేతిక విజ్ఞాన ఆవిష్కరణల వెలుగులో, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలను తీర్చగల నైపుణ్యం గల యువత యొక్క అవసరం అధికంగా ఉంది. ఈ అవసరాన్ని తీర్చాలంటే అభివృద్ధి చెందుతున్న అన్ని దేశాలు సెకండరీ విద్యను అందుబాటులోకి (ఎక్సెస్) తీసుకురావాలి. ఈ విద్య ఆధునిక అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించగలదైయుండాలని, 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నది. దీనికోసం ప్రపంచబ్యాంకు **ICT (Information and Communication Technology)** పథకాన్ని రూపొందించింది దాని కింద, అభివృద్ధి చెందిన దేశాలలోని సెకండరీ పాఠశాలలన్నింటిలోను కంప్యూటర్ లేబొరేటరీని ఏర్పరుచుటకు తగు చర్యలు ఆయా ప్రభుత్వాలు తీసుకొనేట్లుగా నిధులు సమకూరుస్తారు. దీనికనుగుణంగానే మన రాష్ట్రంలో సక్సెస్ పాఠశాలలన్నింటిలో రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ లాబ్‌లు ఏర్పాటు చేయనున్నది.

విద్యారంగంలో ప్రభుత్వం తన ఖర్చులను తగ్గించుకోవాలని, ప్రపంచబ్యాంకు వెనుకబడిన దేశాలకు ఉద్బోధిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో విద్యనందించాలని పేర్కొంటూ అందుకు తగిన పథకాలను కూడా రూపొందించింది. కెన్యాలో కెన్యా స్కూల్ ఫైనాన్సింగ్ ఫెసిలిటీ పేరుతో ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఆ మేరకు ఆ పాఠశాలలు పేద విద్యార్థులను చేర్చుకోవాలి.

భారతదేశంలో కూడా వోచర్ విధానాన్ని కొన్ని రాష్ట్రాలలో ప్రవేశపెడుతున్నట్లుగా ప్రపంచబ్యాంకు పేర్కొంది. ప్రస్తుతం అవే అంశాలు విద్యాహక్కు బిల్లు-2005లో చోటు చేసుకోబోతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాల విద్యార్థులకు ఒక్కొక్కరికీ 7,500 రూపాయలకు ఓచర్ ఇస్తారు. ఈ ఓచర్‌ను తీసుకుని, వారికిష్టమైన పాఠశాలలో చేర్పించుకోవచ్చు. ఆ పాఠశాల యాజమాన్యం ఆ ఓచర్లను ప్రభుత్వానికి సమర్పించి డబ్బు తీసుకుంటుంది. ఈ విధానాన్ని భారత ప్రభుత్వానికి ప్రణాళికా సంఘం సిఫారసు చేసింది. 2008-09 సంవత్సరం నుంచే అమలు చేయాలని ప్రతిపాదించింది. ఇది ఇంకా ఆమోదింపబడలేదు. ది బలూచిస్తాన్ ఎడ్యుకేషన్ సపోర్టు ప్రాజెక్టు పేరిట పాకిస్తాన్‌లో బెలుచిస్తాన్ రాష్ట్రంలో కూడా ఇదే విధమైన ప్రాజెక్టును అమలుచేయనున్నట్లుగా ప్రపంచబ్యాంకు ప్రకటించింది. నాణ్యమైన విద్యను అందించాలంటే హైర్ అండ్ ఫైర్ విధానాన్ని అనుసరించాలని ప్రపంచబ్యాంకు పేర్కొంది.

ప్రపంచబ్యాంక్ కనుసన్నలలో మెలుగుతూ బహుళ జాతి సంస్థల వ్యాపార ప్రయోజనాలను నెరవేర్చటానికి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ పేరుతో అనేక రంగాలను ప్రైవేటీకరిస్తూ ఉన్న భారత పాలకులు, విద్యారంగాన్ని ప్రయోగశాలగా మారుస్తున్నారు.. ప్రపంచబ్యాంకు ప్రయోగాలకు భారత విద్యార్థులను గినీపిగ్‌లుగా బలి చేస్తున్నారు. ప్రపంచబ్యాంకు యొక్క పథకాలన్నింటి లక్ష్యమూ చౌకగా నైపుణ్యం కలిగిన శ్రామికులను తయారు చేయడమూ, విద్యను ప్రైవేటీ కరించి, విద్యా వాణిజ్యాన్ని విస్తృతం చేయడమూ ఇందులో భాగంగానే వేలాది పాఠశాలలను మూసి వేయటం లేదా నిర్వీర్యం చేయటం జరుగుతున్నది. నిర్వీర్యమైన పాఠశాలలు వాటంతటవే మూతపడి సహజ మరణానికి గురవుతాయి. సక్సెస్ పతకం అమలు వలన వేలాది పోస్టులు అదనపు పోస్టులుగా మారతాయి. వాటిని రద్దు చేస్తారు. ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతున్న పాలకులు నిజానికి ఉద్యోగాల నుండి తొలగించడమే జరుగుతుంది

రెండవ భాషగా ఇంగ్లీషును మూడవ తరగతి నుండి బోధిస్తున్నారు 10వ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులలో ఎక్కువ మంది ఇంగ్లీషులోనే తప్పుతున్నారు ఇప్పుడు ఇంగ్లీషు మాధ్యమంలో బోధించటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయకుండా, ప్రవేశపెట్టడమంటే, మధ్యలోనే చదువు మానేసేవారి సంఖ్య పెరగటంతోపాటు, విద్యార్థులు తప్పటం కూడా పెరుగుతుంది. 7వ తరగతిలో కూడా కామను పరీక్షలు ఎత్తివేసినందున, ఈ వడపోత కనిపించదు. పేద వర్గాల బిడ్డలను చదువుకు దూరం చేస్తారు.

పాలిటెక్నిక్, ఐటిఐలలో చదువుకున్న విద్యార్థులు నైపుణ్య కార్మికులుగా పరిశ్రమల్లో చేరుతున్నారు. పాఠశాల విద్య మాతృభాషలో సాగినందున వారికి ఉద్యోగావకాశాలు చేజారటం లేదు వారి నిరుద్యోగానికి కారణం తగినంత పారిశ్రామికాభివృద్ధి లేకపోవటమే తప్ప ఇంగ్లీషు మీడియం కారణం కాదు. ఉన్నత సాంకేతిక విద్య ఎలాగూ ఇంగ్లీషు మీడియంలోనే సాగుతున్నది. ఇక మిగిలింది సేవారంగానికి చెందిన ఉద్యోగాలే. నిలకడైన, వ్యవసాయక - పారిశ్రామిక ఉత్పాదక అభివృద్ధి లేనప్పుడు, సేవా రంగం కుంటుతూనే నడుస్తుంది. సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాల గురించి పొగడినంత కాలం పట్టకుండానే, అమెరికా ఆర్థికవ్యవస్థ, మాంద్యంలోపడగానే, ఇక్కడి ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నారు నిరుద్యోగిత- ఉద్యోగితలకు కారణం ఏ మాధ్యమంలో విద్యగరిపారన్నది కాదు. ఆయా వ్యవస్థలూ, సమాజాలూ స్వావలంబనా, స్వాతంత్రత గలిగిన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు అనుసరిస్తున్నా రన్నదే

ఇంగ్లీషు మాధ్యమంలో చదువు నేర్చకపోతే, ఉద్యోగావకాశాలుండవని ప్రభుత్వమే చెప్పటమంటే, తగిన ఏర్పాట్లు లేకుండా అమలు చేయటానికి పూనుకోవటమంటే, దొడ్డిదారిన ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులందరినీ మళ్లించటమే. అలా వెళ్లగల స్థోమత లేని వారు ప్రభుత్వ స్కూళ్లలో రెంటికీ చెడ్డ రేవడిలా నష్టపొమ్మని చెప్పటమే ప్రభుత్వ రెసిడెన్సీ జూనియర్ కళాశాలలు పదేళ్ల క్రితమే ఒక వెలుగు వెలిగాయి. ఈనాటికీ వాటి ఫలితాలు బాగానే వున్నాయి. అయినా ఇటీవల ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లలో చదివి 10వ తరగతిలో 500 పైగా మార్కులతో పాసైన వారిని నారాయణ, చైతన్యలలో చేర్చి తానే ఫీజులు కడతానని ప్రకటించింది. తన విధానాలతో తన సంస్థలను దిగజార్చి, ప్రైవేటు స్కూళ్లలో చేర్పిస్తానని ప్రకటించటమంటే ప్రైవేటీకరణే మంచిదన్న తప్పు భావనను వ్యాప్తిచేసి అర్హులందరికీ విద్య నేర్పాల్సిన తన బాధ్యత నుండి తప్పుకోనే కుట్ర

సక్సెస్ పాఠశాలల ఏర్పాటు వెనుక ఇంతటి కుట్ర దాగి వున్నది. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టన్న ఈ పథకాన్ని వ్యతిరేకించవలసిన అవసరం ఉన్నది. అందుకు ఉద్యమచైతన్యాన్ని ప్రజలకు, ఉపాధ్యాయులకు అందించ వలసిన కర్తవ్యం ఉపాధ్యాయ సంఘాలపైన ఉన్నది. కాని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు ఈ సమస్యను ప్రక్కదోవ పట్టిస్తున్నారు. ఆంగ్లమాధ్యమం అవసరమే నంటూ సిబిఎస్ఇ సిలబస్‌ను గాక రాష్ట్ర సిలబస్ కావాలంటూ అసలు సమస్యలను ప్రజల దృష్టికి తీసుకు వెళ్ళకుండా మళ్లిస్తున్నారు. ఉపాధ్యాయులకు సిబిఎస్ఇ సిలబస్ అయితే భారమవుతుందని, దీనిని వ్యతిరేకిస్తున్నామంటూ, ఈ పథకం యొక్క లోతుపాతు లను వెలుగులోకి రానీయకుండా ఉపాధ్యాయులను, ప్రజలను మభ్యపెడుతున్నారు. ఈ ధోరణి ఖండనీయం ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకించడమేగాక పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయ ఖాళీల భర్తీని, అవసరమైన పోస్టుల మంజూరును డిమాండ్‌చేస్తూ ఉద్యమించాలి. ఆ దిశగా ప్రజలను కదిలించవలసిన కర్తవ్యాన్ని మనందరి మీదా వుంది. ◈

తమిళనాడు:

ప్రజాస్వామ్య హక్కుల సదస్సుకు ఆటంకాలు

సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు శాఖ ప్రజాస్వామిక హక్కులపై సదస్సు నిర్వహించాలని సన్నాహాలు ప్రారంభించింది. ప్రజాస్వామిక హక్కులపై సాగుతున్న దాడినీ, ప్రత్యేకించి తమిళనాడులో బహిర్గంగసభలు, హాలులో సభలు, ఊరేగింపులను కూడా అనుమతించని స్థితిని ఖండించే లక్ష్యంతో సదస్సును నిర్వహించ పూనుకుంది. మార్చి నెలలో అనుమతినిచ్చిన పోలీసులు కారణం చెప్పకుండానే చివరిక్షణంలో రద్దుచేశారు. దీనిపై న్యాయ స్థానంలో కేసు వెయ్యగా, సదస్సు జరుపు కోనివ్వమని కోర్టు ఆదేశించింది. దీనితో మే 19న చెన్నైలో సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేసింది.

కోర్టుకు వెళ్లే అవకాశం లేకుండా మే 17 శనివారం మధ్యాహ్నం పోలీసులు సదస్సుకు అనుమతిని రద్దు చేశారు. దీనకి జైపూరులో జరిగిన బాంబుపేలుళ్లను కారణంగా చూపారు. ఈ నిరంకుశ చర్యను నిరసిస్తూ అన్ని జిల్లాల్లోనూ వాల్‌పోస్టర్లు వేశారు. డిఎంకె ప్రభుత్వం పనుపున పోలీసుల నిరంకుశ చర్యను తీవ్రంగా ఖండించిన సిపిఐ(ఎం-ఎల్) హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లి జూన్‌లో సదస్సు జరుపుతామని ప్రకటించింది. ◈

బ్రిటన్‌లో సూపర్ ధనికులు

పెట్టుబడిదారీ విధానం వర్గ వ్యత్యాసాలను నానాటికీ పెంచుకుంటూ పోతుంది. సమానత్వం, ప్రజాస్వామ్యాలను గురించి అదెన్ని మాటలు చెప్పి నప్పటికీ, ఆచరణలో ధనికులను మరింత ధనికులను చేస్తుందనటానికి బ్రిటన్‌లో ధనాఢ్యుల గురించి ఫార్చ్యూన్ వెలువరించిన అధ్యయనం తెలుపుతుంది.

ఆ నివేదిక ప్రకారం బ్రిటన్‌లో అత్యంత ధనికులైన వెయ్యి మంది ఆస్తులు 1997లో 9900 కోట్ల పౌండ్లు కాగా 2007 నాటికి 41,200 కోట్ల పౌండ్లకు పెరిగింది. అంటే పేదలకు అనుకూలమైనదానిగ్గా చెప్పుకునే లేబరు పార్టీ అధికారం చెలాయిస్తున్న పదేళ్ల కాలం నాలుగురెట్లు పెరిగాయి.

వీరిలో అత్యంత ధనికులైన 20 మందిలో 6 గురు ఇతర దేశాల నుండి వచ్చినవారు. బ్రిటన్‌లోకెల్లా అత్యంత ధనికుడు లక్ష్మిమిట్టల్ ఆస్థుల విలువ 2770 కోట్ల పౌండ్లు. రెండవ స్థానంలో వున్న రష్యా నుండి బ్రిటన్ చేరిన రోమన్ అబ్రమోవిచ్ ఆస్థుల విలువ 1170 కోట్ల పౌండ్లు. ఈ వివరాలు రూపొందించిన ఫిలిప్ బెరెస్ ఫోర్డ్ "ఈ సూపర్ ధనికులకు లేబరు పార్టీ ప్రభుత్వం అద్భుతమైన సేవ చేసింది" అన్నాడు

ఇదే లేబరు ప్రభుత్వం పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలన్న ఉపాధ్యాయుల, ప్రభుత్వ ఉద్యోగుల,పోస్టలు ఉద్యోగుల, ఆస్పత్రుల సిబ్బంది డిమాండును నిరాకరించింది. లేబరు పార్టీ ప్రధాని గోర్డాన్ బ్రౌన్‌ను ఆ పార్టీకి చెందిన ట్రేడు యూనియన్ల నాయకులే 1978-79నాటి శీతాకాల అసంతృప్తిని మించిన "వేసవి అసంతృప్తి" వచ్చి ప్రభుత్వం కూలి పోతుందని హెచ్చరించారు. ◈

జైపూర్ బాంబుపేలుళ్లను ఖండించండి!

రాజస్థాన్ ముఖ్యనగరం జైపూర్‌లో జరిగిన బాంబుపేలుళ్లు అమానుషమైనవి. [illegible] మృతి చెందిన, గాయపడిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నాము. [illegible] సందర్భంగా, బాధితులకు సహాయమందించటంలో నగర ప్రజలు చూపిన చొరవ సమాజంలోని మత సామరస్య జీవనాన్ని ఛిద్రం చేయాలని కోరుకుని ఇలాంటి చర్యలకు పాల్పడ్డారు. వారు విఫలమయ్యారని తెలిపింది.

రాజస్థాన్ ప్రజానీకం స్పందన ఆదర్శనీయంగా వుండగా, కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వమూ, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వమూ పరస్పర నిందారోపణలతో ప్రస్తుత పరిస్థితికి మూలమైన తమ తమ బాధ్యతను కప్పిపుచ్చుకోజూస్తున్నాయి. గత మంత్రా అలా వుంచినా గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెసు, బిజెపిలు అనుసరించిన విధానాలే ఈ టెర్రరిస్టు శక్తులను సృష్టించాయన్నది తిరుగులేని వాస్తవం. నూతన ఆర్థిక విధానాల పేరిట దేశ వనరులన్నింటినీ సామ్రాజ్యవాదులపరం చేయటం ప్రారంభించిన తర్వాత ప్రజలను చీల్చి వుంచి అసలు సమస్యల నుండి వారి దృష్టిని మళ్లించి, వారిని సంఘటిత పోరాటాలలోకి సమీకృతం కాకుండా చేసేందుకు మతోన్మాదాన్ని పాలకవర్గాలు రెచ్చగొడుతున్నాయి. నగ్నమైన హిందూ మతోన్మాదాన్ని బిజెపి చేపట్టగా, మతోన్మాదశక్తులను సంతృప్తిపరిచే విధానాన్ని కాంగ్రెసు అనుసరిస్తున్నాయి.

టెర్రరిజంపై పోరును అమెరికా సామ్రాజ్యవాదం ప్రకటించగానే ఈ రెండు పార్టీలు దానికి వంత పాడాయి. బిజెపి ఒకడుగు ముందుకు వేసి గుజరాత్‌లో ముస్లింలపై మారణకాండను సాగించింది. కర్ణాటకలో ఇటీవలి ఎన్నికల్లో కూడా హిందూ మతోన్మాద ప్రచారాన్నే బిజెపి సాగించింది. ఫలితంగా దేశ ప్రజాజీవనం మతోన్మాదంతో కలుషితం చేయబడుతోంది. పాలనా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం. చివరకు న్యాయవ్యవస్థ కూడా దీని ప్రభావానికి లోనవుతున్నాయి. ఫలితంగా బాంబుదాడులకు పాల్పడి అమాయక ప్రజల ప్రాణాలను బలిగొనే టెర్రరిస్టు శక్తులు తలయెత్తుతున్నాయి.

బాంబుప్రేలుళ్ల తర్వాత పరిస్థితి కూడా బిజెపి ప్రభుత్వం స్వార్ధ సంకుచిత ప్రయోజనాలకు వినియోగించుకోజూస్తున్నది.. బెంగాలీ మాట్లాడే ముస్లిములందరినీ బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వచ్చినవారిగా చిత్రిస్తూ, వారే బాంబుదాడులకు కారణమంటూ ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొడుతున్నది. బాంబుదాడులకు కారకులెవరన్న నిర్ధారణకు పోలీసులూ, గూఢచారి సంస్థలు పరిశీలన పూర్తి చేయకుండానే ప్రభుత్వంలో వున్న బిజెపి ఈ నిరాధార ప్రచారానికి పూనుకున్నది. ఇవి గోధ్రా ఘటన ప్రచారాన్ని తలపింప చేస్తున్నది.

నేరస్తులను కనుగొనటం పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేలాలు జల్లి దయ్యాలను లేపుతుండగా, భద్రతా చర్యల పేరిట పోలీసులు ప్రజలపై తీవ్ర దురంతాలకు పాల్పడుతున్నారు. ఎవరినైనా టెర్రరిస్టులుగా ముద్రవేయగల అధికారాలున్న ఈ నిర్బంధ యంత్రాంగం సాగిస్తున్న దుర్మార్గాలు పెచ్చుమీరుతున్నాయి. అయితే ఒక భయానక వాతావరణాన్ని సృష్టించి ప్రజలను అణచివేయాలన్న దోపిడీ పాలకవర్గాల దుష్ట పథకంలో భాగంగానే ఈ దుర్మార్గాలు జరుగుతున్నాయి.

బిజెపి, కాంగ్రెసు పాలకులనుసరిస్తున్న మతోన్మాదాన్ని పెంచే విధానాలను ప్రజాతంత్రశక్తులు ఎలుగెత్తి ఎండగట్టాలి' మతోన్మాదం ఎప్పుడైనా బ్రద్దలయ్యే పరిస్థితిని సృష్టించిన బిజెపి, కాంగ్రెసు పార్టీలనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజల ముందు బహిర్గతం చేయాలి! తరతరాలుగా భారత శ్రమజీవులు నిర్మించుకున్న మతసామరస్య, పరమత సహన జీవన సాంప్రదాయాన్ని చిదిమివేయజూస్తున్న ఈ దోపిడీ వర్గాల రాజకీయ ప్రతినిధులపై తీవ్ర పోరాటం సాగించాలి! ◈

కర్ణాటక:

ప్రజాగ్రహాన్ని సొమ్ము చేసుకున్న బిజెపి

కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు ముగిసాయి. బిజెపి మెజారిటీ సాధించి, యండూరప్ప సారధ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. ఈ విజయాన్ని బిజెపి విధానాలకు ప్రజామోదంగానూ, రాబోయే ఎన్నికల్లో బిజెపి కేంద్రంలో అధికారానికి వచ్చే సూచనగానూ ప్రచారం చేసుకుంటున్నది.కానీ కాంగ్రెసు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలూ, తర్వాత జనతాదళ్(ఎస్) ప్రభుత్వ అవకాశవాద విధానాలూవట్ల ప్రజలలో పెల్లుబికిన అసంతృప్తి, ఆగ్రహాలతో బిజెపికి ఓటు వేశారు. కాంగ్రెసు పార్టీ అనుసరించిన పెద్దన్నయ్య పెత్తనంతో కాంగ్రెసు-జనతాదళ్ సంకీర్ణ ప్రభుత్వం 2005లో కూలిపోయింది. కుమారస్వామిని ముఖ్యమంత్రి చెయ్యటం తప్ప జెడి(ఎస్)కు మరో లక్ష్యం లేదని వెనువెంటనే ఆ పార్టీ బిజెపితో చేతులు కలిపి అధికారంలోకి రావటంతో తేటతెల్లమైంది. ఈ మిశ్రమ ప్రభుత్వం కూడా కూలిపోయి రాష్ట్రపతిపాలన సాగింది. దీనితో ఈ పార్టీ అవకాశవాద వైఖరులు నగ్నంగా బయటపడ్డాయి.

సిపియం 10 సీట్లలోనూ, సిపిఐ 6 సీట్లలోనూ పోటీచేశాయి. కాగా ఇవి బిజెపినీ ఓడించగల కాంగ్రెసు పార్టీకి ఓటు చెయ్యమని ప్రచారంచేశాయి. బిజెపి అధికారంలోకి రాకుండా చూసేందుకే యుపిఏ ప్రభుత్వానికి మద్దతునిస్తున్నామని చెప్పుకుంటున్న యీ "వామ"పక్షపార్టీలు వాస్తవాలను చూడలేని గుడ్డితనంతో బాధింపబడుతున్నాయి. గత రెండేళ్ళలో 11 అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. ఒక్కదానిలోనూ కాంగ్రెసు గెలవలేకపోయింది. గుజరాత్, కర్ణాటకల్లో బిజెపి గెలిచింది. తమ మద్దతుతో యుపిఏకు అధికారంలో వుంచుకున్న వామపక్షాలు యుపిఏ ప్రజావ్యతిరేక విధానాల్ని అమలు చెయటానికి తోడ్పడిన వారయ్యారు. దీనిని కప్పిపుచ్చి, బిజెపి బూచిని చూపటం వారి రాజకీయ దివాళాను తెలుపుతుంది.

కర్ణాటక ఎన్నికల్లో డబ్బు సంచుల వర్గాలన్నీ (నయా బూర్జువాలు, సారావ్యాపారులు, భూకబ్జాదారులు, గనుల మాఫియా) ముందుకొచ్చాయి. కాంగ్రెసు, బిజెపిలు రెండూ వీరికి టిక్కెట్లిచ్చాయి. గెలిచారు కూడా; ఈ పార్టీలలో టిక్కెట్లు రాని వారు బిఎస్‌పి, ఎస్‌పి అభ్యర్థులుగా పోటీచేశారు. ఈసారి ఎన్నికల రంగాన్నంతా వీరే ఆక్రమించారు. ఇంతేకాక అనేకమంది అభ్యర్థుల తరపున వీరే డబ్బు ఖర్చుచేశారు. ఎన్నికల సమయంలో పట్టుబడ్డ డబ్బు గతంలో ఏనాడూ లేనంత స్థాయిలో వుందని ఎన్నికల కమీషన్ అంగీకరించింది.

డబ్బు, సారా, టివిలు పంపకంచేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటానని ఎన్నికల కమీషన్ హెచ్చరించిందిగానీ దీనికి భయపడే వారెవరూ లేరు. అలా పట్టుబడిన వారిని తానేమీ చెయ్యలేననీ, అన్ని సాక్ష్యాధారాలతో నిరూపించ గలిగితే, మహా అయితే రాబోయే ఎన్నికల్లో వారిని పాల్గొనకుండా మాత్రమే చేయవచ్చునీ ఎన్నికల కమీషనుకూ తెలుసు అభ్యర్థులకూ తెలుసు కనుకనే డబ్బు సారా మంచినీళ్లలా ప్రవహించాయి

కాగా ఎన్నికల కమీషన్ వీరందర్నీ వదిలి చిన్నపార్టీలకూ, స్వతంత్ర అభ్యర్థులకు అననుకూలంగా అమలయ్యాయి వాలుపోస్టర్లు, వేయకూడదు: గోడలమీద వ్రాయకూడదు; మైకులు వాడాలంటేనూ, మీటింగు పెట్టుకోవాలన్నా నిబంధనలు కఠినం చేశారు. అనుమతికోసం అధికారుల చుట్టూ తిరగడానికే సమయం సరిపోతుంది. టీవీలలో యాడ్‌లు వీరికందుబాటులో వుండవు. ఆఖరికి వీధి మీటింగులు, గేటు మీటింగులూ కూడా జరుపుకోలేని పరిస్థితి ఏర్పడింది

ఈ విధంగా ముఖ్య పార్టీలను నియంత్రించలేని ఎన్నికల కమీషను చిన్నపార్టీలకు స్వతంత్ర అభ్యర్థులకూ ప్రచారం చేసుకొనే అవకాశాలను కుదించివేసింది. మీరిక్కడ పోటీ చెయ్యటం లేదు గనుక ప్రచారం చెయ్యరాదంటూ ఆటంకాలు కల్పించారు. దీనినంతా పరిశీలిస్తే, రెండు, మూడు పాలకవర్గ పార్టీలే ఎన్నికల్లో పాల్గొనేటట్లు చేసి, మిగిలిన వారిని కనిపించకుండా చేయాలన్న పాలకుల పథకంలో భాగంగానే ఎన్నికల కమీషన్ ఎక్కడలేని చురుకుదనాన్ని చూపించి ప్రజాస్వామిక ప్రక్రియ రక్షకుడిగా పోజుపెడుతూ ఆ ప్రక్రియకే తూట్లు పొడుస్తున్నది.

ఇక ప్రచార మాధ్యమాలన్నీ పాలక పార్టీలతో కలిసి ఎన్నికల ప్రచారపు ఎజెండాను నిర్ణయించాయి అధిక ధరలు. నిరుద్యోగం, సెజ్‌ల పేరిట భూముల కబ్జా, అవినీతి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, దాని దుష్పరిణామాలు-ఇవేవీ చర్చలోకి రాకుండా చూసాయి పోటీలో వున్న పాలకపార్టీలు కూడా ఇదే కోరుకున్నాయి దుమ్మెత్తిపోసుకోవటం, నిందారోపణలు, సవాళ్లు విసురుకోవటాలు, కులమత సెంటిమెంట్లు రెచ్చగొట్టడం ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశాలయ్యాయి దీనిలో మీడియా కూడా కుల, మత జనాభా లెక్కలు నిష్పత్తిలోనే పార్టీలు అభ్యర్థుల ఎంపిక, నియోజకవర్గాల వారిగా కులాల-మతాల ఓట్లు, ప్రాతిపదికపై ఎవరికి గెలిచే అవకాశాలున్నాయి అంటూ తమ శక్తిమేరకు ప్రజా సమస్యలు ముందుకు రాకుండా చేశాయి.

సిపిఐ(ఎం-ఎల్) 14 స్థానాల్లో పోటీ చేసింది నాలుగుచోట్ల స్వతంత్ర అభ్యర్థులను బలపరిచింది. రాష్ట్రకమిటీ తన వనరులన్నింటినీ వినియోగించి ప్రచారాన్ని సాగించింది. కనీస ఖర్చుతో వీధి మీటింగులు, సాంస్కృతిక ప్రదర్శనలు, కరపత్రాలతో విస్తృతంగా ప్రచారం చేసింది. వందలాది మంది ప్రజలు వీటికి హాజరయ్యారు. ధన, వస్తు రూపంలో చందా యిచ్చారు. ప్రజా సమస్యలనూ పాలకుల దోపిడీ, అణచివేత విధానాలను ముందుకు తెచ్చిన ప్రచారాన్ని ప్రజలు స్వీకరించారు. మన ప్రచార తీరును అభినందించారు. ప్రస్తుత దోపిడీ వర్గ పాలన స్థానంలో ప్రజాప్రభుత్వమే ప్రత్యామ్నాయమన్న దానిని అంగీకరించారు. ◈

వైద్య ఖర్చులు భరించలేక ప్రతి ఏటా మరణిస్తున్న వేలమంది అమెరికన్లు

'భూలోక స్వర్గం'గా భావించబడుతున్న అమెరికా దేశంలో సాధారణ ప్రజలకు వైద్య సౌకర్యాలు 'అందని ద్రాక్ష పళ్ళు'గా వున్నాయన్న విషయాన్ని తెలుసుకొంటే, ఆ సంపన్న దేశం గురించి చెప్పే 'మహత్తర'మైన విషయాలన్నీ బూటకమే అని భావించక తప్పదు. ఒక మహాసంపన్న దేశంలోని పౌరులు వైద్య సంరక్షణకు ఖర్చుపెట్టలేక మరణాన్నే ఎంచుకొంటున్నారన్న వైనం, అక్కడి సంపదను అనుభవించేది ఆ దేశంలోని సామాన్య పౌరులు ఎంత మాత్రంకాదనీ, కొద్దిమందిగా వున్న సంపన్నవర్గం వారేనని అర్థం అవుతుంది.

అమెరికాలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు వైద్య సదుపాయాలకు ప్రభుత్వం చేసిన-చేస్తున్న ఏర్పాట్లు శూన్యం. అక్కడ వైద్య రంగం అంతా ప్రైవేటు రంగంగానే నిర్వహింపబడుతోంది. ఈ ప్రైవేటు వైద్య ఆస్పత్రిరంగం, చికిత్స చేసినందుకు భారీ ఎత్తు మొత్తాలను వసూలు చేస్తుంది.

అందువలన అక్కడి పౌరులు విధిగా ఆరోగ్య బీమాకు సభ్యులుగా వుంటూ, ఇన్సూరెన్సు కంపెనీలు (అన్నీ ప్రైవేటువే) నిర్ణయించిన ప్రీమియంను చెల్లిస్తూ, వారు చేసే మాయోపాయాల పాలుపడుతూ, తమ ఆరోగ్య సంరక్షణకు, అనారోగ్యకాలంలో వైద్య చికిత్సకూ ఏర్పాట్లు చేసుకోవాల్సి వుంది.

ఇటీవలి కాలంలో ఓహియా రాష్ట్రానికి చెందిన, ట్రినా బేచ్‌టల్ అనే ఒక యువతి గర్భవతిగా వుండి వైద్య సలహాలను పర్యవేక్షణను పొందాల్సివచ్చింది. అందుకు ఆమె స్థానికంగా వున్న ఒక ఆస్పత్రికి వెళ్ళి డాక్టరు సలహాలను తీసుకోవాల్సి వుంది. ఒక్కసారి డాక్టరును సంప్రదించి, ఆయన సలహాలు తీసుకోవాలంటే ఆమె 100 డాలర్లు ఫీజు చెల్లించాల్సి వుంటుంది. అంతటి భారీ ఎత్తు ఫీజు చెల్లించలేక ఆమె 30 మైళ్ళదూరంలో వున్న మరో ఆస్పత్రికి వెళ్ళామనుకొంది. కానీ ఈలోపునే ఆమె, ఆమెకు పుట్టబోయే బిడ్డా కూడా వైద్య సదుపాయం అందక మరణించారు.

2006వ సంవత్సరంలో "వాల్ స్ట్రీట్ జర్నల్" పత్రిక యిటువంటిదే మరో ఉదంతాన్ని ప్రచురించింది. మోనికావైట్ అనే ఒక యువతి 'ల్యూపస్' అనబడే చర్మంపై పుళ్ళు వ్యాపించే వ్యాధితో బాధపడుతోంది. ఈ వ్యాధికి నిర్ణీత పద్ధతిలో, క్రమ పద్ధతిలో చికిత్స చేయించుకోవాలి. కానీ ఆమెకు ఆరోగ్య యిన్సూరెన్సు లేకపోవటంతో నియమ ప్రకారం క్రమబద్ధంగా చికిత్సను చేయించుకోకుండా గడిపింది. కానీ హఠాత్తుగా, ఆమె రోగం ముదిరి పోవటంతో, సమీపంలోని ఒక ఆస్పత్రికి ఆమెను ఆమె తల్లి తీసుకెళ్ళి చేర్చింది. ఆ ఆస్పత్రి ఆమెకు భారీ ఎత్తు బిల్లువేసింది. అయినా ఫలితం దక్కలేదు. ఆమె ఆ రోగంతో చనిపోయింది.

ఇటువంటి ఉదంతాలను అమెరికాలో కోకొల్లలుగా వింటూంటాం. అక్కడి సామాన్య ప్రజల్లో 40శాతం మందికి ఆరోగ్య సంరక్షణ ఇన్సూరెన్సు లేదు. ఫలితంగా వారు ఆరోగ్య సంరక్షణను పొందలేకపోతున్నారు.

ఇటీవల అమెరికాలోని "అర్బన్ ఇన్‌స్టిట్యూట్" అన్న దాని అంచనా ప్రకారం అమెరికాలో ఏటా 27,000 మంది, హెల్త్ యిన్సూరెన్సు లేకపోవటం వలన చనిపోతున్నారు. ఈ మరణాలన్నీ నివారించబడగల్గినవే-అంటే సక్రమ వైద్య, ఆరోగ్య సంరక్షణ సదుపాయం వుంటే, రోగాలు ముదిరి వీరు చనిపోవాల్సిన అవసరం వుండదు. ఎమర్జెన్సీ కేసుల్లో సహితం, భారీ వైద్య ఖర్చులు భరించలేక ప్రజలు మరణానికే సంసిద్ధపడుతున్న దుస్థితి అమెరికాలో వుంది.

ఇతర అభివృద్ధిచెందిన, సంపన్న దేశాల్లో "సార్వత్రిక ఆరోగ్య బీమా" పథకాలుంటే, అమెరికాలో అటువంటి పథకం లేదు. ఈ విషయంపై బడా పెట్టుబడిదారుల నియంతృత్వంలో వున్న మీడియా పట్టించుకోకపోగా వాస్తవాలను కాకమ్మకథలుగా కొట్టిపారేసి దోపిడీ వ్యవస్థను సమర్థించే పాత్రనే నిర్వహిస్తున్నాయి.

ఈ రోజున అమెరికా దేశంలో "సార్వత్రిక ఆరోగ్య బీమా" యొక్క అవసరం ఎంతైనా వుంది.

అధ్యక్ష ఎన్నికల్లో విజయంకోసం తలమునకలవుతున్న డెమక్రటిక్, రిపబ్లికన్ పార్టీలకు సామాన్య ప్రజలకవసరమయిన, ప్రాణరక్షణకు సాధనంగావున్న ఈ "సార్వత్రిక ఆరోగ్య బీమా" గురించి పట్టుతుందని భావించలేము. దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థకు తన లాభాలే తప్ప, సామాన్య ప్రజల ప్రయోజనాలు పట్టవన్నది రహస్యమైన విషయం ఏమీ కాదు.

(పాల్‌కర్‌గమన్ వ్యాఖ్యల ఆధారంగా)

జనసాహితి ప్రచురణ
గాంధీవాద శవపరీక్ష
వెల: 25.00
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

ఒరిస్సా:

కొనసాగుతున్న కళింగనగర్ పోరాటం

28 నెలల తర్వాత టాటాస్టీలు కంపెనీ తరపున మరొకసారి ప్రజలపై తుపాకీ కాల్పులు జరిగాయి. 2006 జనవరి 2న స్టీలు మిల్లు నిర్మాణంవల్ల నిర్వాసితులవుతున్న ప్రజలు ఆందోళనపై పోలీసులు కాల్పులు జరపగా, 2008 మే 1న జార్ఖండ్ నుండి తెప్పించిన కంట్రాక్టరుకు చెందిన సెక్యూరిటీగార్డు కాల్పులు జరిపాడు. దీనిలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ఈ కాల్పుల వార్త కార్చిచ్చులా వ్యాపించి ప్రజలలో ఆగ్రహాన్ని కలిగించింది. వందలాది మంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గత కాల్పుల్లో అమరులైన 14 మంది ఆదివాసులకు అంత్యక్రియలు జరిపిన వీరభూమికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. బాలిగొధా గ్రామానికి చెందిన 52ఏళ్ల మృతుడు అమీన్ బినారాకు పుష్పాంజలి ఘటించారు. బిస్తాపన్ బిరోధిజన్‌మంచ్ నాయకులూ, ప్రజలు తమ కార్యకర్తకు శ్రద్ధాంజలి తెలిపారు. ఈ పాశవిక దాడిని ఖండించి, పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రతిన బూనారు. సామ్రాజ్యవాద, భారత బడా కంపెనీలు ప్రజల జీవన హక్కుమీద సాగిస్తున్న దాడినెదుర్కొంటామన్నారు. ఈ హత్యకు నిరసనగా పారదీప్ రేవును జాతీయ రహదారి 5తో కలిసే జాతీయ రహదారి 200పై 8 చోట్ల రాస్తారోకోను ప్రజలు నిర్వహించారు.

ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ "శాంతియుత పారిశ్రామికీకరణ" గురించి మాట్లాడుతూనే, ప్రైవేటు కిరాయి గూండాలను వినియోగిస్తున్నారనీ, జాజ్‌పూర్, జగత్‌సింగ్‌పూర్, పారాదీప్ ఎక్కడికెళ్లినా వీరే ఎదురౌతున్నారనీ, ప్రతిఘటిస్తున్న ఆదివాసీలను నిర్మూలించేందుకు జార్ఖండ్‌నుండి అరవిందసింగ్ అనే కాంట్రాక్టరును దీనికోసమే తీసుకువచ్చారనీ బిస్తాపన్ బికోధి జనమంచ్ ప్రధానకార్యదర్శి రబీంద్రజరీకా అన్నారు.

బహుళజాతి కంపెనీలు, స్థానిక పోలీసులూ, పరిపాలనాధికారులూ కిరాయి గూండాలను తెచ్చి, ఒక ప్రాంతంలో భద్రతలేని వాతావరణాన్ని ఏర్పరచి, ఆయుధాలతో ప్రతిఘటించమని ఆదివాసులను రెచ్చగొడుతున్నారని కాల్పుల తర్వాత కళింగనగర్‌ను సందర్శించిన వాస్తవ సేకరణ కమిటీ తెలిపింది ఒక ఏడాదినుండీ అరవిందసింగ్ ఇక్కడ తిరుగుతూ, ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆందోళన ఆపివేయమని ఆదివాసీలను బెదిరిస్తున్నాడనీ తెలిపింది. ఇదంతా రెవిన్యూ అధికారుల, పోలీసుల కనుసన్నల్లోనే జరుగుతున్నదని కూడా తెలిపింది.

ఆదివాసీలకు సంఘీభావంగా కొందరు వ్యాపారులు కూడా రాస్తారోకోలూ చేసారు. ప్రజల ఆగ్రహాన్ని చూసిన అధికారులు అరవిందసింగ్‌ను అరెస్టుచేసి అమీన్‌బనారు హత్యచేసిన కేసును అతనిపై పెడతామని హామి యిచ్చారు. దీనితో రాస్తారోకోను ఆపి, బహుళజాతి కంపెనీలపై పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.

జీవ ఇంధనాల సాగు
సామ్రాజ్యవాదుల అవసరాలకు దేశ వనరుల వినియోగం

జీవ ఇంధనాల వాడకాన్ని పెంచే లక్ష్యంతో పంటలను జీవ ఇంధన తయారీకి వాడటాన్నీ, జీవ ఇంధనాన్ని ఇచ్చే పంటల సాగునూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక విధాలుగా ప్రోత్సహిస్తున్నాయి. పెట్రోలు, డీజిలుపై ఆధారపడటమూ, ఇంధన రీత్యా దేశం స్వావలంబన పొందటమూ లక్ష్యంగా వీటిని ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకున్నది. గతంలో "జనశక్తి"లో ఈ విధానం వల్ల మొక్కజొన్న, సోయా, చెరకువంటి ఆహారపంటలను ఇందన తయారీకి వినియోగించటంవల్లనూ, ఆహారపంటల భూమిని జీవఇంధన పంటలకు మరల్చటంవల్లనూ ప్రజలకు ఆహార లభ్యత తగ్గిపోతుందని, [illegible]వంటి దేశాలల్లో ఆహారపంటలు తగ్గిపోయి, సామ్రాజ్యవాదులపై పరాధీనత పెరుగుతుందనీ వివరించాము ఇప్పుడు జీవ ఇంధన పంటలు కూడా సామ్రాజ్యవాద దేశాలకోసమే పేద దేశాల వనరులనెలా వినియోగించుకుంటున్నారో చూద్దాం.

ఉష్ణమండల శీతోష్ణప్రాంతంలో పెరిగే చెట్టు జట్రోఫా(గానుగలో ఒక రకం). పశ్చిమ ఒరిస్సా జిల్లాలోని ఆదివాసులు గానుగ గింజలనుండి పిండితీసిన నూనెతో దివిటీలు వెలిగించుకునేవారు. ఇది గమనించి దీనినుండి బయోడీజిలును తయారుచేయటం ప్రారంభించారు. వీటిని ప్రోత్సహిస్తున్నారు. భారతదేశంలో ఈనాటికీ 86శాతం గ్రామీణ కుటుంబాలు తమ ఇంధన అవసరాలను వంటచెరకు, చొప్ప, గడ్డి, పిడకలు వంటి జీవసంబంధ పదార్థాలనుండే తీర్చుకుంటున్నారు. జీవ ఇంధన తయారీ వల్ల వీరెవరికీ ఉపయోగం లేదు. అది 10శాతంగా వున్న కార్లు వాడుతున్నవారికే. అయితే ఇంధన పంటలకోసం గ్రామ సమిష్టి భూములను, పశువుల మేత భూములనూ, అటవీ భూములనూ, బంజర్లనూ, పోడు భూములనూ ప్రభుత్వం కంపెనీల కివ్వటంతో, గ్రామీణ కుటుంబాలకు లభ్యమౌతూవస్తున్న వంటచెరకు, గడ్డి, చొప్ప, పశుపోషణ తగ్గినందున పేడ పిడకలు తగ్గిపోతాయి. వారి జీవితాలను మరింత కష్టాలమయం చేస్తాయి. మరోవైపున ఇలా తయారయ్యే ఇంధనమంతా ఇతర దేశాలకు తరలిపోతుంది. ఆవిధంగా దేశ సహజవనరులను దేశప్రజల అవసరాల కొరకుకాక, విదేశాల అవసరాలకొరకు వినియోగించబడతాయి.

ప్రజ్ అన్న భారత కంపెనీ జట్రోఫానుండి బయోడీజిలు తయారుచేసే యంత్రాలను తయారు చేస్తున్నది. కాండ్లా రేవులోని సెజ్‌లో దీని ఫ్యాక్టరీ వుంది. దీని యజమాని సిఐఐ ఏర్పాటు చేసిన జీవ ఇంధనాలపై జాతీయ కమిటీ అధ్యక్షుడు, 40 దేశాలకు ఇది యంత్రాలను ఎగుమతి చేస్తున్నది. బయోఎనర్జీ యూరో పాబివి అన్న యూరోపు కంపెనీలో దీనికి 60శాతం వాటా వుంది. జరగువా ఎక్విప్‌మెంట్స్ ఇండస్ట్రీస్ అన్న బ్రెజిల్ కంపెనీలో 54శాతం వాటాలున్నాయి. అమెరికాలో ఒక బ్రాంచిని పెట్టింది. భారత బహుళజాతి కంపెనీ మరొకటి ఆవిర్భవించిందంటూ ప్రచారం చేస్తున్నారు. కాగా ప్రజ్ కంపెనీలో 10శాతం వాటాను భారత సంతతికి చెందిన అమెరికా పౌరుడు వినోద్ ఖోస్లా కొన్నాడు. రిలయన్సు కంపెనీకి పెట్రో తవ్వకాలకు పెట్టుబడులూ సాంకేతిక పరిజ్ఞానమిచ్చిన జపాను బహుళజాతి కంపెనీ మరుబెని దీనిలో 20శాతం వాటాలు పొందింది. ప్రజ్‌కు వాటాలున్న యూరపు, బ్రెజిల్ కంపెనీల్లో కూడా వీరికి వాటాలున్నాయి. పెట్రోలులో ఇథనాల్ కలపటంకోసం ఇథనాల్ తయారీ అమెరికా, యూరప్‌లలో పెరుగుతుండటంతో, ఆ యంత్రాలను అమ్ముతున్నది. చిన్న వాటాలతో మొదలై మొత్తం కంపెనీని స్వాధీనం చేసుకునే జపాను పెట్టుబడుల వ్యూహమన్నది తెలిసిన వారికి (మారుతీని సుజుకి స్వాధీనం చేసుకున్న తీరు) ప్రజ్‌కూడా మరుబెనీ ఆధీనంలోకి వెళుతుందని అర్ధమౌతుంది. అలా వెళ్లినా, వెళ్లకపోయినా, ప్రెజ్ కార్యకలాపాలను తమ కనువుగా మలుచుకుంటుంది.

గోద్రేజ్‌ల కుటుంబానికి చెందిన ఆదిబయోటెక్‌లో అమెరికాకు చెందిన సింజెంటా ఇండియాకు వాటా లున్నాయి. ఆదిబయోటెక్ పేరుతో సింజెంటా [illegible] ఇవి జట్రోఫా గింజలను అమెరికా, యూరప్‌లకు ఎగుమతి చేస్తున్నది. మైసూరులోని లాబ్‌లాండ్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ తయారుచేసిన జట్రోఫా మొక్కలకు డి1 ఆయిల్సు అన్న కంపెనీలో ఒప్పందం చేసుకుని, దీనిద్వారా ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో అమ్ముతున్నది. డి1 ఆయిల్సు కంపెనీ బయోడీజిలు కంపెనీల్లో అతిపెద్దదీ. బ్రిటీషు పెట్రోలియం అనుబంధ కంపెనీ, విచిత్రమేమంటే భారత్‌లో లాండ్‌లాబ్ కంపెనీ తయారీ జట్రోఫా మొక్కలను భారత్‌లో కూడా డి1 ఆయిల్సు అమ్ముతుంది. వీటి సరఫరాకు మణిపూర్ రాష్ట్రప్రభుత్వం దీనితో ఒప్పందం చేసుకుంది. ఈశాన్య రాష్ట్రాల్లో అతిపెద్ద తేయాకు ఉత్పత్తి కంపెనీ విలియంసన్ మేజర్‌తో తేయాకు తోటల స్థానం జట్రోఫా మొక్కలను పెంచే ఒప్పందాన్ని డి1 ఆయిల్సు చేసుకుంది. ఉత్తరాఖండ్‌లోని బయోఫ్యూయల్ బోర్డు జట్రోఫాలోని అన్ని రకాలకూ చెందిన జన్యు సంపదతో జన్యుబ్యాంకును ఏర్పరచింది. దీని నుండి జన్యువులను దొంగలించిందన్న ఆరోపణ డి1 ఆయిల్సుపై ప్రచారంలో వుంది. (ది హిందూ-బిజినెస్ లైన్, 10-10-2007). కాకినాడలో పెడుతున్న బయోడీజిలు తయారీ కర్మాగారం యజమాని సదరన్ ఆన్‌లైన్ బయో టెక్నాలజీస్ వెనుక జర్మనీ ప్రభుత్వానికి చెందిన జిటిజెడ్ కంపెనీ, ప్రపంచబ్యాంకు నిధులు, అమెరికాకుచెందిన రోబో బ్యాంకు రుణాలు వుండగా, ఇక్రిసాట్ సాంకేతిక పరిజ్ఞానముంది. మొత్తం జీవ ఇంధనాల రంగాన్ని సామ్రాజ్యవాద కంపెనీల దోపిడీ అవసరాల కనుగుణంగా రూపొందిస్తున్నారని ఈ వివరాలు తెలుపుతున్నాయి.

ఏ ఉత్పత్తి జరగని భూమి- వేస్ట్‌లాండ్స్-ని జట్రోఫా పెంపకానికి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉపగ్రహ ఛాయాచిత్రాలతో ఈ భూముల అట్లాసును తయారుచేసింది. "6 కోట్ల 30 లక్షల హెక్టార్ల బంజరు భూమి వుంది. దీనిలో సగం జట్రోఫా పెంపకానికి కేటాయించాము" అని ఇండియన్ సైన్స్ కాంగ్రెసులో కేంద్రమంత్రి) ప్రకటించారు. దీనిలో 30శాతం పెద్ద కంపెనీలకు, 70శాతం రైతుల సంఘాలకు కేటాయిస్తామన్నారు. కానీ ఆచరణలో పెద్ద కంపెనీలే వేలాది ఎకరాలు పొందుతున్నాయి. మణిపూర్‌లో గోద్రేజ్ కంపెనీకి 20వేల హెక్టార్లు ఇచ్చారు. రాజస్థాన్‌లో ఎక్కువ భూములు వీరికే కేటాయిస్తున్నారు ప్రజ్‌కు కచ్‌లో 1100 హెక్టార్లు ఇచ్చారు ఒరిస్సాలో జట్రోఫా పెంపకానికి వేలాది ఆదివాసీ భూములను కంపెనీలు కబళిస్తున్నాయి. ప్రభుత్వం జట్రోఫా పెంపకాన్ని దారిద్ర్య నిర్మూలనా పథకంగా గుర్తించి కొరాపుట్, కలహండి, బోలంగీర్ జిల్లాలో చెట్లు నాటడాన్ని సాగిస్తున్నది ఇవి పెరిగిన తర్వాత కంపెనీలకు 20 ఏళ్ల లీజుకిచ్చే ప్రణాళికలు రూపొందిస్తున్నది.

ఇవి బంజరు భూములుగా కన్పించినా, వీటిపై గ్రామీణ జనాభా ఆధారపడుతున్నారు. జట్రోఫా పెంపకాన్ని పెద్దస్థాయిలో ప్రోత్సహిస్తున్న రాజస్థాన్‌లో 75 లక్షల పశుపాలన వృత్తిలో జీవించేవారికి, పశుగ్రాసం లభించే భూములు లేకుండా పోతాయి. ఈ రాష్ట్రంలో బంజర్లుగా గుర్తించిన భూమిలో దాదాపు గడ్డిభూములన్నీ (ఒరాన్స్ అంటారు) చేరి వున్నాయి. ఇవి గ్రామీణ జనాభాను మరింత దారిద్ర్యంలోకి నెడుతుంది.

ఇంతేకాక నీటికి కూడా కటకట వస్తుంది. ఈ భూములలో ఇంతవరకూ వాననీరు తప్ప మరో నీటి వాడకంలేదు. ఇప్పుడు జట్రోఫా పెంపకానికీ నీరు కావాలి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబు, రాజస్తాను ప్రభుత్వాలు బిందుసేద్యం పరికరాలకు సబ్సిడీలనివ్వటమే కాక, విద్యుత్తుకు కూడా సబ్సిడీ యిస్తున్నాయి. ఇవి భూగర్భ జలాలనూ, లేదా అందుబాటులో వున్న జలవనరులనూ వినియోగించు కుంటాయి. ప్రపంచబ్యాంకు వత్తిడితో సాగునీటిని ప్రైవేటీకరిస్తుండటంతో, పేద రైతాంగానికి నీటికరువు ఏర్పడుతుంది. కాగా నీటి వనరులు జట్రోఫాకు తరలుతాయి.

ఈ విధంగా దేశీయ సహజవనరులతో, జీవ ఇంధనాలు పండించి, సామ్రాజ్యవాద దోపిడీకి వనరుగా చేస్తున్నారు. ఫలితంగా రైతాంగానికి భూమి, నీరు అందుబాటులో లేకుండా పోతాయి. వారు మరింత దారిద్ర్యంలో కూరుకుపోతారు. ◈

(8వ పేజీ తరువాయి) రైతులను సేద్యానికి.......

ఆధారపడి జీవిస్తున్నారు. అందువలన గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద పరిశ్రమలు వ్యవసాయ అధారిత పరిశ్రమలుగా ఉండాలి. అప్పుడే రైతు ప్రయోజనాలతోపాటు, దానిపై ఆధారపడే వారికి కూడా ఉపాధి కల్పించబడుతుంది కోస్తా ప్రాంతంలో వరి, చెరకు, అరటి, కొబ్బరి, పత్తి, మిర్చి, పొగాకు, సుబాబుల్, గోగుపంటలు పండిస్తున్నారు. ఈ పంటలకు అనుగుణమైన జూట్, నూలు, పేపరు, ఆయిల్, కారం మొదలైన పరిశ్రమలు, మిల్లులు ఏర్పాటు చేయవలసివుంది. అందువలన పంటల అమ్మకంతో పాటు, ప్రజలకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. కాని పాలకులు ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావటంలేదు. ఇందుకు కారణం, పాలకులు బడా పరిశ్రమాధిపతుల ప్రయోజనం కాపాడే వారు కావటమే.

కోస్తా కారిడార్ వంటి పథకాలను వ్యతిరేకించటమంటే పారిశ్రామికీకరణనూ, అభివృద్ధినీ వ్యతిరేకించటమేనంటూ పాలకులు నిందా ప్రచారం చేస్తున్నారు. వ్యవసాయరీత్యా ముందున్న ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలను చిన్నస్థాయిలో ఏర్పాటు చేసినప్పుడు ప్రత్యామ్నాయ ఉపాధి పెరుగుతుంది. ఈ పరిశ్రమలకు అవసరమైన యంత్ర తయారీ పరిశ్రమనూ, ఇతర భారీ పరిశ్రమలనూ తీరానికి లోతట్టు ప్రాంతాలలో (ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి తెలంగాణా, రాయల సీమలలో) నెలకొల్పాలి. దీనివల్ల సారవంతమైన వ్యవసాయ భూములు తరిగిపోకుండానే పరిశ్రమలు పెరిగి, ఉపాధి పెరుగుతుంది.

పరిశ్రమల వికేంద్రీకరణ కూడా చాలా కీలకాంశం. వెనుకబడిన జిల్లాలంటూ అనేక రాయితీలను పొంది తెలంగాణాలో పెట్టిన పరిశ్రమలన్నీ హైద్రాబాదు నగరం చుట్టూ 30 కి.మీ. పరిధిలో పెట్టినవే. దీనికి బదులుగా వీటిని జిల్లాల్లో దూరంగా స్థాపించినట్లయితే అక్కడ వారికి ఉపాధి లభ్యమవటంతోపాటు హైద్రాబాదునగరం నేడెదుర్కొంటున్న అధిక జనసాంద్రత సమస్యలు ఏర్పడి వుండేవి కాదు. దీని కనువుగా తెలంగాణా, రాయల సీమల్లో కొత్త రైల్వే మార్గాలను ఏర్పాటుచేసి వుంటే పరిశ్రమలు విస్తరించి వుండేవి. అలాగే కాకినాడలో గోదావరి, నాగార్జునా ఎరువుల కంపెనీలున్నాయి. ఇవి కృష్ణా, గోదావరి డెల్టాల యూరియా అవసరాలను తీరుస్తున్నాయి. ఇప్పుడు ఇక్కడే మరికొన్ని ఎరువుల పరిశ్రమలు పెట్టనవసరంలేదు. నిజామాబాదు దగ్గర, కర్నూలు దగ్గర ఏర్పాటుచేస్తే, రేవులనుండి ఫాస్ఫోరిక్ ఆసిడ్ రవాణా, ఎరువులు రవాణాకంటే చౌక అవుతుంది. అలాగే బందరు రేవు ప్రాజెక్టు నివేదికలో రేవు ఆదాయంలో 90శాతం విటిపిఎస్‌కు బొగ్గు దిగుమతి ద్వారా లభిస్తుందని చెప్పారు. సింగరేణి నుండి బొగ్గు సరఫరా చేసుకోగలిగినా, అధిక ధరపెట్టి విదేశాలనుండి దిగుమతి చేసుకోవటమేమిటి? అంటే బలవంతంగా విటిపిఎస్‌తో బొగ్గు దిగుమతి చేయిస్తారు. ఆ భారం కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై మోపుతారు. పోర్టు కట్టిన ప్రైవేటు కంపెనీకి లాభాలు గ్యారంటీ చేస్తారు. ఇలాంటి విధానపర నిర్ణయాలతో రాష్ట్ర వ్యాపితంగా వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధిలలో సమతుల్యతనూ, ఆ విధంగా ఉపాధి కల్పనలో సమతుల్యతను సాధించవలసివుండగా, దీనికి పూర్తిగా వ్యతిరేకమైన విధానాలనే పాలకులు అనుసరిస్తూ వచ్చారు. మొత్తం రాష్ట్రం దేశం ప్రజల ప్రయోజనాలను ఈడేర్చే అభివృద్ధి బదులుగా, పెట్టుబడిదారులు, విదేశీ పెట్టుబడిదారులు లాభాలను పిండుకొనే విధంగా ఎంచుకొన్న ప్రాంతాల లోనే పరిశ్రమలను అనుమతించి, వారికి అన్ని విధాలా సేవ చేస్తున్నారు. కనుక వీరు అభివృద్ధి అంటున్నది. ప్రజల అభివృద్ధి కాదు. రాష్ట్ర అభివృద్ధి కాదు.

కోస్తా ప్రాంతంలో వ్యవసాయం ద్వారా లక్షలాది మందికి ఉపాధి పొందుతున్నారు. రాష్ట్ర, దేశ ప్రజల ఆకలిని తీర్చే ఆహారపంటల ఉత్పత్తి అధికంగా జరుగుతున్నది. ఇలాంటి ప్రాంతంలో కారిడార్‌కోసం లక్షా యాభై వేల ఎకరాలను రైతులనుండి బలవంతంగా లాక్కోవటం వలన ప్రజల ఉపాధితోపాటు, ఆహారపంటల ఉత్పత్తిపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. కారిడార్ ఏర్పాటు వలన వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పేపాలకులు, దానివలన లక్షలాదిమంది ఉపాధిని కోల్పోతారనే వాస్తవాన్ని మరుగుపరుస్తున్నది. అంతే కాకుండా రైతుల జీవితాలు అస్తవ్యస్థమౌతాయి.

ఉద్యోగ - ఉపాధి అవకాశాలు కల్పించాలనే చిత్తశుద్ధి రాష్ట్ర పాలకులకు ఉంటే కోస్తా కారిడార్ నిర్మాణ ఏర్పాటును విరమించుకొని, వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటు విధానాలు చేపట్టాలి. ఇందుకై కోస్తా ప్రాంతంలోని రైతాంగంతోపాటు యావన్మంది ప్రజలు ఉద్యమించాలి. ◈

కామ్రేడ్ గుర్రం కోటయ్య వర్ధంతి సభ

పొన్నెకల్లు, 7.6.08:

కామ్రేడ్ గుర్రం కోటయ్య 22వ వర్ధంతి సభ కామ్రేడ్ కోటయ్యగారి విగ్రహం సెంటర్‌లో జరిగింది. సభకు ముందు సిపిఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు పార్టీ జెండా ఆవిష్కరించారు అనంతరం కామ్రేడ్ గుర్రం కోటయ్య గారి విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి, రైతుకూలీ సంఘం (ఆం ప్ర) జిల్లా సహాయ కార్యదర్శి మరియు కామ్రేడ్ కోటయ్యగారి కుటుంబసభ్యులు, గ్రామపెద్దలు, పార్టీ సానుభూతిపరులు కోటయ్యగారి విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సభకు స్థానికులు, కామ్రేడ్ జమ్ముల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడుతూ తొలితరం కమ్యూనిస్టుల్లో ఒకరైన కా॥ గుర్రం కోటయ్య హేతుబద్ద ఆలోచనలు మొగ్గతొడిగి కమ్యూనిస్టు ఉద్యమానికి పునాదివేసి పీడిత, తాడిత ప్రజలకోసం అలుపెరుగక అహర్నిశలు కృషి చేశారు. కా॥ కోటయ్య ఏ ఆశయం, లక్ష్యం కోసం పనిచేశారో వాటిని పరిపూర్తి చేయవలసిన బాధ్యత మన అందరిమీద ఉంది ఈ రోజు భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ పీడనలు భారతదేశంలో రోజురోజుకు తీవ్రమౌతున్నాయి. భారత దళారీ పాలకులు ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్) పేరుతో విదేశీ, బహుళజాతి సంస్థలకు రైతులవద్ద నుండి వేలాది ఎకరాల భూములను గుంజుకుని సామ్రాజ్యవాదుల యొక్క విలాసాలకు కట్టబెడుతున్నారు. ఈ దళారీ పాలకవర్గం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు సంఘటితంగా పోరాడి అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకుపోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కా॥ కోటయ్యతోపాటు దాసరి గోపాలం, బిక్కి రాములు, ఏసుపాదం ఇంకా ఎంతో మంది, రైతుకూలీల రేట్లు పెంపుదలకు అదే విధంగా గ్రామపెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా, కుల, మత విబేధాలకు అతీతంగా పోరాడారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అట్ల రాములు, షేక్ బుడే, ముప్పాళ్ళ సూరయ్య, బిక్కు శంకర్, అన్నపురెడ్డి అనిపిరెడ్డి, చీకటి ప్రభుదాసు, గుర్రం ఆదియ్య పాల్గొని మాట్లాడారు. ◈

ద్వంద్వ విలువలు

ప్రజలకు స్వయం నిర్ణయాధికార హక్కు వుందని అందరూ అంగీకరిస్తున్నారు. అయితే ఇటీవలి వార్తలను చూస్తే ఆసియాలో టిబెటన్లకు ఈ హక్కు వుంది; ఇరాకీలకూ ఆఫ్ఘనిస్తాన్ ప్రజలకూ లేదు;

మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిలుకు ఈ హక్కు వుంది. కాగా పాలస్తీనీయులకూ, కుర్దులకూ లేదు.

ఆఫ్రికాలో తూర్పు కాంగోలో సైనిక నియంతలకుందిగానీ పశ్చిమ సహారా ప్రజలకు లేదు.

లాటిన్ అమెరికాలో బొలీవియాలో వనరులున్న రాష్ట్రాలకుందిగానీ మెక్సికో, చిలీలలో ఆదివాసీలకు లేదు.

యూరపులో ఫిన్‌లాండ్‌కుందిగానీ ఐర్లాండ్ ప్రజలకూ, స్పెయిన్‌లో బాస్క్యూలకు లేదు.

బాల్కన్ దేశాలలో కోసావోలోని అల్బేనియన్లకుంది తప్ప బోస్నియా, కోసావోల్లోని సెర్బులకు లేదు.

ఎందుకనో అర్థం కావాలంటే అమెరికా పత్రికల్లో వీరి గురించి వచ్చే వార్తలలో "ప్రజాస్వామ్యం" అన్న పదాన్ని "మనతో వున్నారు" పదంతోనూ, "టెర్రరిస్టు" అన్న పదాన్ని "మనకు వ్యతిరేకులు" పదాన్ని వ్రాసుకుని చదవండి. అమెరికా సామ్రాజ్యవాదానికి అనుకూలమా కాదా అన్న దాన్నిబట్టి వారికి స్వయంనిర్ణయాధికార ముంటుంది. అదీ వారి రాజకీయం.

వెలువడింది!
ఎన్.వై.ఎస్, పి.డి.ఎస్.ఓ ప్రచురణ
కుల నిర్మూలన
విద్యార్థి, యువజనులు
వెల: 2.00
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్,
విజయవాడ-2.

చదవండి! చదివించండి!!
జనశక్తి ప్రచురణ
ముష్టిమెతుకుల జాతీయ
గ్రామీణ ఉపాధి హామీ పథకం
వెల: 5.00
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్,
జలీల్ వీధి, విజయవాడ-2.

దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై నెల్లూరులో బహిరంగసభ

ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిణామాల్ని విశ్లేషించేటందుకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 23-5-08న నెల్లూరు నర్తకి థియేటర్ సెంటర్‌లో సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభ జరిగింది. సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జి.సునీత ఈ బహిరంగ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ 'ఎన్నికల సమయంలో పాలకులు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. అధికారమే పరమావధిగా పొత్తులు పెట్టుకుంటున్నారు. సామ్రాజ్యవాదానికి దేశసంపదను దోచిపెడ్తున్నారు. ధరలు విపరీతంగా పెంచేశారు. సహజ సంపదలన్ని విదేశాలకు తరలిపోతున్న ప్రస్తుత పరిస్థితిలో కారణాల్ని విశ్లేషించుకునేందుకు ఈ సభ ఏర్పాటు చేశామ'ని చెప్పారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ 'కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు నెల్లూరు జిల్లాలో పుట్టారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. అలగానిపాడులో మొదటగా వ్యవసాయ కార్మికసంఘం పెట్టారు. పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి వైద్యాన్ని ప్రజలకు అందించేందుకు ప్రజావైద్యశాల పెట్టారు. అమరులు ఎన్.వి.కృష్ణయ్యగారు భూస్వామ్య కుటుంబంలోపుట్టి దానికి వ్యతిరేకంగా పోరాడి-పీడిత ప్రజా ఉద్యమాలలో చివరివరకు కొనసాగారు.

ఈ వారసత్వంతో సామాజిక పురోగమనంలో పీడిత ప్రజల్ని సంఘటితపరిచే క్రమంలో ఉన్నామ'ని కామ్రేడ్ విజయకుమార్ తన ఉపన్యాసం ప్రారంభించారు. 'యుపిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలైంది. బడ్జెట్ సెషన్ నాటికి ధరలు విపరీతంగా పెరిగాయి. పెట్రోల్ ధరలు మరలా పెంచబోతున్నారు. భారత దేశంలో ఆయిల్ వనరులకు కొరతలేదు. ఓఎన్‌జిసి ఆయిల్ వనరులను కనుగొన్నది-ఆ తర్వాత రిలయన్స్ వంటి బడాపెట్టుబడిదారీ సంస్థలకు, బహుళజాతి కంపెనీలకు కట్టబెడ్తున్నది. రష్యా, వెనిజులాలో ఉన్నన్ని ఆయిల్ నిక్షేపాలు భారతదేశంలో ఉన్నాయి. ఒక్కరూపాయి కూడా ధర పెంచకుండా భారత ప్రజలకు పెట్రోల్ అందించ వచ్చు. 60 సం॥ భారత 'స్వతంత్రం' తర్వాత కూడా-దేశీయ అవసరాల్లో 77శాతం దిగుమతి చేసుకుంటున్నాం-విదేశీ రుణాలు పెరిగిపోతున్నాయి. బహుళజాతి పరిశ్రమల అవసరాలకోసం రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వేలు, ఓడరేవులను ఆధునీకరిస్తూ, పెద్దఎత్తున ప్రజాధనాన్ని వినియోగిస్తున్నారు- సామ్రాజ్య వాదులకు లాభాలు -దేశప్రజలకు రోగాలు, ఆహార ధాన్యాల కొరత అకస్మాత్తుగా పెరిగిపోయింది. సామ్రాజ్యవాదం వ్యవసాయ రంగంలో సాగించిన దోపిడీ ఫలితమే ఈ పరిస్థితి. 80కోట్ల ప్రజానీకం రోజుకు 20 రూ॥కూడా ఖర్చుపెట్టగల స్థితిలో లేరు. సామ్రాజ్యవాద పెత్తనాన్ని ఆమోదిద్దామా? దేశస్వాతంత్రంకోసం ప్రజాఉద్యమాలతో ముందుకు వెళ్దామా?' అని ప్రశ్నించారు.

నేపాల్ పరిణామాల్ని విశ్లేషిస్తూ, 'నేపాల్ పరిపాలకులు అమెరికా ఆదేశాలు అమలు జరిపినవారే. సామ్రాజ్యవాద లొంగుబాటుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వాన తీవ్ర పోరాటాలు జరిగాయి. భారత విస్తరణవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడారు. అక్కడ 1940ల చివర్లో కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమైంది. నేపాల్‌లో కమ్యూనిస్టులు కొందరు-ప్రజాస్వామ్యరిపబ్లిక్ కావాలి. ఉపాధి కావాలి-పంటలకు ధరలు, శ్రమ ఫలితాలు కావాలి అని పోరాటం చేశారు. సాయుధ పోరాటాన్ని ఆపుతాం-ఎన్నికల్లో పాల్గొని ప్రజలతీర్పు ప్రకారం పరిపాలన సాగిద్దాం అన్నారు-రాజుతలను కాదు-రాజ్యాధికారాన్ని తొలగించాలన్నారు-ఉద్యమ ఫలితంగా తాత్కాలిక అసెంబ్లీ ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మావోయిస్టులు అధిక స్థానాలు సాధించారు. 1969లో టిఎన్ బడ్జెట్ సమావేశంలో ఆఖరి ఉపన్యాసం చేసి రాజీనామా చేసిన అనంతరం స్వీడన్ విలేఖరులతో మాట్లాడుతూ 'భారత దేశంలో అన్నిచోట్ల చైతన్యం ఒకే తీరుగా లేదు- సాయుధ పోరాటం సాగిస్తాం-పాలకులను డిమాండ్‌చేస్తూ సాయుధేతర పోరాట మార్గాలనూ అనుసరిస్తామని చెప్పారు-దళారీపాలకులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక వ్యవస్థకోసం పోరాటమే ప్రత్యామ్నాయం-నేపాల్, వెనిజులా పరిణామాలు ఇదే రుజువుచేస్తున్నాయి -కమ్యూనిస్టులు అన్ని పోరాట రూపాలను సమ్మిళితం చేయాలి' అని పిలునిస్తూ కామ్రేడ్ విజయకుమార్ తన ఉపన్యాసం ముగించారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సి.పెద్దన్న మాట్లాడుతూ '1886లో- చికాగోలో 8గంటల పనిదినంకోసం పోరాడి ప్రాణాలర్పిస్తే ఈనాడు మన దేశంలో 12 గంటల పనిదినాన్ని చట్టంచేయబోతున్న పరిస్థితుల్లో ఉన్నామ'ని గుర్తుచేశారు. 'బ్రిటీష్ సామ్రాజ్యవాదం వ్యాపారంపేరుతో ఈదేశం వచ్చి ఈదేశాన్ని ఆక్రమించింది- దానికి నిరసనగా పెద్దఎత్తున ప్రజానీకం, కార్మికవర్గం తిరగబడింది-మరో స్వాతంత్ర పోరాటం చేయాల్సిన అవసరం నేడు వుంది-కరువు పీడిత అనంతపురం, రాయలసీమ జిల్లాల్లో 65వేల ఎకరాల భూముల్ని వైఎస్ రాజశేఖరరెడ్డి సెజ్‌లకు ధారాదత్తం చేస్తున్నాడు. ప్రత్యేక ఆర్థికమండళ్ళంటే ప్రత్యేక రాజ్యాలే. కార్మికవర్గం సెజ్‌లకు వ్యతిరేకంగా, సామ్రాజ్య వాద భూస్వామ్య దళారీ పాలకులకు వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామిక విప్లవంకోసం- రైతాంగం, ఇతర వర్గాల ప్రజానీకాన్ని కలుపుకొని పోరాడాల'ని కామ్రేడ్ పెద్దన్న పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ ఝాన్సి మాట్లాడుతూ 'రైతుల ఆత్మహత్యలను నివారిస్తానని, భూమి పంపిణీచేస్తానని వాగ్దానాలుచేసి అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి-అధికారంలోకి వచ్చాక నియమించిన జయతీఘోష్ కమీషన్ నివేదికను అమలుజరపకుండా పక్కన పెట్టాడు. జయతీఘోష్ ఆంధ్రదేశంలో మిగులుభూములు, బంజరుభూములు ఎసైన్డ్ భూములు, పేదలకు పంపిణీచేయాలని-కమీషన్ పేర్కొంది. గ్రామీణ ప్రాంతంలో భూమి సమస్య పరిష్కరించాలని చెప్పిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టకుండా బుట్టదాఖలు చేశారు. చంద్రబాబు తను అధికారంలో ఉండగా అనుసరించిన బాటనే వైఎస్‌ఆర్ అనుసరిస్తున్నాడు. అభివృద్ధి చాలా పెద్దఎత్తున జరుగుతున్నది కనుక, కొంతకాలం ప్రజలందరూ కష్టాల్ని భరించాలంటున్నారు. ధరలు పెరుగుతున్నాయి. దీన్ని భరించాలంటున్నారు-ధరల పెరుగుదల వలన పేదలు కనీస అవసరాలు తీర్చుకోలేరు-6000 కోట్ల రూపాయల ఖర్చుతో పోలవరం ప్రాజెక్టు సాగు,తాగునీటి అవసరాల కోసమని చెప్తున్నారు-లక్షల ఎకరాల సేద్యం జరుగు తుందని చెప్తున్నారు- ఇంజనీరింగ్ మేధావులు పరిశీలించి బహుళజాతి, బడాకంపెనీల నీటిరవాణా సౌకర్యాల కల్పనకోసం, కోస్తా కారిడార్ పేరిట బహుళజాతి పరిశ్రమలకు నీటి అవసరాలకోసం తప్ప వేరు కాదని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణమంతా అమెరికన్ సామ్రాజ్యవాదుల కనుసన్నలలో జరుగు తున్నది. వేలకోట్ల రూపాయలతో కృష్ణపట్నంనుండి గంగవరం వరకు 5 పోర్టులు కట్టి సామ్రాజ్యవాద బహుళజాతి పరిశ్రమలకు అప్పజెప్తున్నారు-ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు నెల్లూరు కేంద్రంగా ఉంది-ఆయా సంస్థల్లో అప్పుడే కార్మికుల నిరసన, ఆందోళనలు ప్రారంభ మయ్యాయి-76 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యంచేసి-ఆహార ధాన్యాలను పాలకులు దిగుమతి చేసుకుంటున్నారు- కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో వివిధ సంస్థానాల్లో మందసా, చల్లపల్లి, వెంకటగిరి సంస్థానాల్లో ఆనాడు సాగించిన పోరాటాలు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాలు మాత్రమే జమిందారీ వ్యవస్థను రద్దుచేశాయి-కమ్యూనిస్టుపార్టీ ఎన్నో త్యాగాలు చేసింది-రైతు,కూలీ, కార్మిక రాజ్యాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు సాగాల'ని కా॥ఝాన్సీ పిలుపునిచ్చారు.

స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర నాయకులు కామ్రేడ్ లక్ష్మి మాట్లాడుతూ'హైదరాబాద్ ప్రాంతంలో-12,13 గంటలు పనిచేస్తే కూలీ 40రూ॥ ఇస్తున్న స్థితివుంది-మహిళా కార్మికులు చాలా దుస్థితిని ఎదుర్కొంటున్నారు-వ్యవసాయ సంక్షోభం స్త్రీల జీవితాలను మరింత దుర్భరం చేసింది-శ్రమదోపిడీ గురించి ఆలోచింపనీయకుండా కుసంస్కృతిని వ్యాప్తిచేస్తున్నారు-ప్రేమ పేరుతో అనేక మందిపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. నిరంతర అభద్రత మధ్య జీవిస్తున్నాం. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దోపిడీని ప్రశ్నించాలంటే కలిసి కట్టుగా పోరాడాల'ని లక్ష్మి విజ్ఞప్తి చేశారు.

ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బాషా మాట్లాడుతూ -'నిరుద్యోగులైన కోట్లాది మంది యువతీ యువకులు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. పోలీసుల పోస్టులుతప్ప ఏ పోస్టులూ భర్తీచేయటంలేదు. యూనివర్శిటీలను విదేశాలకు అమ్మేస్తున్నారు. -అందరికీ విద్యా, ఉపాధి కావాలంటే పోరాట మార్గమొక్కటే మనముందున్నద'ని చెప్తూ కామ్రేడ్ బాషా ముగించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయకార్యదర్శి జె.కిషోర్‌బాబు మాట్లాడుతూ 'నెల్లూరు జిల్లాలో-మర్రిపాడు మత్తుకూరు దాకా ఐరన్ ఓర్ నరమేధం పెద్దఎత్తున సాగుతున్నది. దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజానీకం కదలి ముందుకురావాలి- ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల్ని విశ్లేషిస్తూ-రాబోయే ప్రమాదాన్ని ముందుగా హెచ్చరిస్తున్న వాళ్ళుగా వున్నాం-రాష్ట్ర వ్యాపితంగా సారాపోరాటం రగలటానికి వెనుక రైతుకూలీసంఘం కృషి ఎంతో ఉంద'ని తెలియజెప్తూ కామ్రేడ్ కిషోర్ ముగించారు.

సభకు ముందుగా బాలసంఘం కళాకారుల డప్పులనృత్యం, కోలాట ప్రదర్శన; ఎర్రజెండా విశిష్టతను, చరిత్రను చాటిచెప్పే ప్రజా కళాకారుల 'ఎర్రజెండాలు' కళారూపకం; సభానంతరం గిరిజన మహిళల దళం ప్రదర్శించిన 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథ-ప్రజాకళాకారుల పాటలు-సభకు హాజరైన ప్రజానీకాన్ని ఉత్తేజితుల్ని చేశాయి-సభకు ముందుగా గాంధీ బొమ్మనుండి- సందేమార్కెట్‌లోగుండా-నర్తకి సెంటర్ వరకు ప్రదర్శన జరిగింది. ◈

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట పంథాలో విప్లవ రైతాంగ ఉద్యమాలను నిర్మించాలి

చంద్ర శివయ్య సంస్మరణ సభలో కామ్రేడ్ కోటయ్య పిలుపు

కృష్ణాజిల్లా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా సహాయ కార్యదర్శి, పార్టీ సభ్యులు, కామ్రేడ్ చంద్రశ్రీమన్నారాయణ (62 సం॥) 12.5.08 రాత్రి తన స్వగ్రామమైన కమ్మవారిపాలెంలో-క్యాన్సర్ వ్యాధితో మృతి చెందారు. కామ్రేడ్ శివయ్యకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

13.5.08 -కామ్రేడ్ శివయ్య భౌతికకాయానికి-రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ భార్గవశ్రీ, రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ మందాజార్జి, వామపక్షపార్టీల, పలు ప్రజాసంఘాల నాయకులు, సన్నిహితులు, బంధువులు, కుటుంబసభ్యులు హాజరై శ్రద్ధాంజలి ఘటించారు. కామ్రేడ్ శివయ్యతో తమకుగల వ్యక్తిగత, ఉద్యమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సంతాప సభ జరిగింది. అనంతరం వందలాదిమంది జోహార్లు చెపుతూ కామ్రేడ్ శివయ్య అంతిమయాత్రలో, పాల్గొన్నారు.

26.5.08న కమ్మవారిపాలెంలో కామ్రేడ్ చంద్రశివయ్య స్థూపావిష్కరణ, సంస్మరణ సభ జరిగాయి. ముందుగా కామ్రేడ్ శివయ్య స్థూపాన్ని సి.పి.ఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ళ భార్గవశ్రీ ఆవిష్కరించారు. స్థూపం వద్ద ఎర్రజెండాను కామ్రేడ్ కోటయ్య ఎగురవేశారు. వివిధ సంఘాల, పార్టీల నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు పూలమాలలు వేసి జోహార్లు చెప్పారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో-కమ్మవారిపాలెంలో గ్రామం నుండి పాల్గొని అమరులైన కామ్రేడ్ కిలారు వెంకయ్య, కామ్రేడ్ గంగవరపు శ్రీనివాసరావు; తదితర అమరవీరులను స్మరించుకుంటూ ఒక ఫలకాన్ని స్థూపంపై వుంచారు.

అనంతరం రైకూసం(ఆం.ప్ర) జిల్లా అధ్యక్షులు కా॥ మందా జార్జి అధ్యక్షతన జరిగిన సంస్మరణసభలో కా॥ కోటయ్య మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటానికి కావాల్సిన రాజకీయం, మిలటరీ నాయకత్వాన్ని, క్యాడర్‌ను తయారుచేయడానికి కమ్మవారిపాలెం గ్రామం ఒక కేంద్రంగా ఉండేదని అన్నారు. ఈ గ్రామానికి చెందిన 6గురు కామ్రేడ్స్‌ను కడలూరు జైలులో దాదాపు 2 సంవత్సరాలు డిటెన్యూ చేయబడ్డారని, మరొక 14మంది పైన బూటకపు బాంబు కేసు పెట్టారని, ప్రభుత్వాన్ని కూల్చివేయటానికి కుట్ర చేసారని దొంగ కేసులు బనాయించి 2 నెలలపాటు చిత్రహింసలకు గురిచేసారని తెలుపుతూ-వీరందరి త్యాగాలకు ప్రతీక కా॥చంద్ర శివయ్య అమరస్థూపం అని వివరించారు. తొలితరం కమ్యూనిస్టుల త్యాగాల స్ఫూర్తితో సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక విప్లవోద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు.

సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ-కా॥శివయ్య కమ్యూనిస్టు, రాజకీయ అంకితభావం కల కామ్రేడ్ అని అన్నారు. కరువు పీడిత ప్రాంతాలలో రైతాంగాన్ని, పీడిత ప్రజానీకాన్ని సంఘటితపరచి నడిపించే కృషిలో ముఖ్యమైన పాత్ర పోషించాడని అన్నారు.

నందిగామ మార్కెట్ యార్డు ఛైర్మన్ వాసిరెడ్డి సాంబశివరావు మాట్లాడుతూ-కా॥శివయ్యగారితో కలిసి అనేక ఆందోళనలలో పాల్గొన్నాని వాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కమ్మవారిపాలెం గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని బలమైన రైతు ఉద్యమాలను నిర్మించాలని కోరుతూ ముగించారు. సిపిఐ నాయకులు సూర్యదేవర నాగేశ్వరరావు, మన్నెం నారాయణరావు, కా॥ శివయ్యగారితో విద్యుత్ ఉద్యమం కాలం నుంచి నేటివరకు కలిసి నిర్వహించిన ఆందోళనల అనుభవాలను వివరించారు. వి.జి.ప్రసన్న, తన్నీ వెంకటేశ్వర్లు (న్యాయ వాదులు) మాట్లాడుతూ-కా॥శివయ్య ఉన్నత స్థాయి ఆలోచన కల్గిన వాడని చెప్పారు.

సిపిఎం నాయకులు చనుమోలు సైదులు మాట్లాడుతూ-కా॥శివయ్యగారితో తనకుగల పరిచయాలను అనుభవాలను గుర్తు చేసుకున్నారు. నందిగామ మాజీ ఎంపిపి పరిమి యాకోబ్ మాట్లాడుతూ- సుగాలీ (ఎస్‌టి) ఇండ్లను ఆనాడు పెత్తందార్లు కూల్చివేస్తుంటే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన చంద్ర శివయ్య కుటుంబం ఎస్‌టిల తరఫున నిలబడింది, అలాగే గ్రామంలోని కమ్యూనిస్టు పార్టీ మొత్తం పేదలకు, దళితులకు అండగా నిలబడి అనేక త్యాగాలు చేసిందని గుర్తు చేసారు.

ఓపిడిఆర్ జిల్లా సెక్రటరీ కా॥ కె.ఏసు మాట్లాడుతూ-కా॥ శివయ్య నిరాడంబరంగా జీవించే వాడని, పేదలపట్ల, దళితుల సమస్యలపట్ల బాగా స్పందించేవాడని, వివరించారు. నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షులు ముచ్చు సుధాకర్ మాట్లాడుతూ కూలీల సమస్యలపట్ల, మహిళలపై జరిగే దాడులపట్ల కా॥శివయ్య ఎంతో తీవ్రంగా స్పందించేవారని చెప్పారు. రై.కూ.సం జిల్లా నాయకులు కా॥ జగన్ మాట్లాడుతూ-ఆయన పొలంలో వేసిన విత్తనాలం మేము అన్నారు. రై కూ.సం జిల్లా కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని అనారోగ్యంతో ఈ కార్యక్రమానికి హాజరు కాలేక శివయ్యకు సోహార్లు చెపుతూ కవిత వ్రాసి పంపారు. దాన్ని చదివి వినిపించారు. ఈ సభకు ముందు బాలసంఘం కళాకారులు, ప్రజాకళాకారులు అమరుల గురించి, ఎర్రజెండా గురించి రైతాంగ సమస్యల మీదపాటలు పాడారు. ◈

అధిక ధరలకు నిరసన కార్యక్రమం

పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ 18.04.08న సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో వేటపాలెం గడియార స్థంభం సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ముందుగా రావూరిపేట నుండి ప్రదర్శన జరిగింది. అనంతరం సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ పింజల సుబ్బారావు మాట్లాడుతూ రైతుల ఉత్పత్తులపై మార్కెట్ దళారుల ఆధిపత్యాన్ని నియంత్రించకుండా, నిత్యావసర వస్తువులను దళారులు నిల్వ చేసుకొని ఎక్కువ లాభాలకు అమ్ముకోవటానికి ప్రైవేటు వ్యాపారులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఫలితంగానే ధరలు మండిపోతున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి ఎఫ్‌సిఐ ద్వారా ఆహారధాన్యాల సేకరణను ప్రభుత్వం ముమ్మరం చేయాలన్నారు. అక్రమ నిల్వలను బయటకు తీసి ప్రజల ప్రయోజనాల కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ కనస్త్రారి కుటుంబరావు మాట్లాడుతూ కష్టపడి పండించిన రైతుకు గిట్టుబాటు ధరలు లేక మరోవైపున నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం ఆకాశాన్నంటడం ప్రభుత్వ దళారీతనాన్ని తెలుపుతుందన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా సహాయకార్యదర్శి కా॥ రవి, నవయువసమాఖ్య(ఎన్‌వైఎస్) జిల్లా అధ్యక్షుడు కా॥ బి.సుబ్బారావులు మాట్లాడారు. ◈

వెలువడింది!
జనసాహితి ప్రచురణ
జీవశాస్త్ర విజ్ఞానం సమాజం
కొడవటిగంటి రోహిణి ప్రసాద్
వెల: 50.00
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్
విజయవాడ-2

రాచరికానికి, ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా నేపాల్ ప్రజల పోరాటం

ఎన్‌వైఎస్, పిడిఎస్‌ఓల సభల్లో ఎన్నికల పరిశీలకుల అభిప్రాయాలు

నేపాల్‌లో రాచరికానికి, ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు సాగించిన, సాగిస్తున్న పోరాటం ఒక మలుపులో వున్న దశలో నేపాల్‌లో రాజ్యాంగ పరిషత్తు ఎన్నికలు జరిగాయి. నేపాల్ రాజకీయ పరిణామాల్ని అర్థం చేసుకొనేందుకు, ఎన్నికల్ని పరిశీలించడానికి అంతర్జాతీయ పరిశీలకులుగా మన రాష్ట్రం నుంచి ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.భాస్కరరావు, ఏపిసిఎల్‌సి రాష్ట్ర నాయకులు డి.సురేష్‌కుమార్, శ్రీనివాసులు వెళ్ళారు.

నేపాల్ వెళ్ళి వచ్చిన పరిశీలకుల అభిప్రాయాల్ని తెలుసుకోవడానికి, వారి ద్వారా నేపాల్ పోరాట దశ దిశల్ని అర్థం చేసుకోవడానికి రాజకీయ అవగాహనను పొంద డానికి వివిధ ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమాభి మానులు, రాజకీయపక్షాలను ఆహ్వానించి నవయువ సమాఖ్య, పిడిఎస్ఓ 26.4.08న హైదరాబాదులో సభను నిర్వహించాయి.

ఈ సభకు అధ్యక్షత వహించిన నవయువ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎం.లక్ష్మి మాట్లాడుతూ దోపిడీ పీడనల నుండి ప్రజలు విముక్తి కావాలని కాంక్షించే ఉద్యమాభిమానులు, మేధావులు ప్రజా ఉద్యమ కార్యకర్తలు ప్రపంచంలో వివిధ దేశాలలో సాగుతున్న రాజకీయ పరిణామాల్ని అధ్యయనం చెయ్యాల్సిన, అవగాహన చేసు కోవాల్సిన అవసరం వుందన్నారు. రాచరికానికి ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న నేపాల్ ప్రజలకు సంఘీభావాన్ని తెలియజెయ్యాలన్నారు.

గత 2, 3 సంవత్సరాలుగా నేపాల్ పరిణామాల్ని అధ్యయనం చేస్తూ, నేపాల్‌కి అంతర్జాతీయ పరిశీలకుడిగా వెళ్ళిన ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.భాస్కరరావు గారు మాట్లాడుతూ నేపాల్ ఎన్నికల పరిశీలనలో తమ అనుభవాల్ని వివరిస్తూ ఎన్నికల్లో ప్రజలు పాటించిన క్రమశిక్షణ, యువత క్రియాశీలంగా వ్యవహరించిన తీరును వివరించారు. అధికారంలోకి రావటం ఎన్నికల ద్వారానే తప్ప సాయుధ పోరాట రూపంలో సాధ్యంకాదు అన్న వాదన వుంది. మరోవైపు ఎన్నికల్లో పాల్గొని మావోయిస్టు పార్టీ దిగజారిందని అంటున్నారు అని నేపాల్ పరిణామాలపై వస్తున్న వ్యాఖ్యల్నీ వివరించారు. ప్రజల్లో పనిచేస్తున్న మావోయిస్టు పార్టీ 10 సంవత్సరాల్లో 75 జిల్లాలకు విస్తరించి 35 వేల మంది ప్రజావిముక్తి సైన్యాన్ని నిర్మించుకుందని పార్టీ నాయకులు వివరించారని చెప్పారు. నేపాల్‌లో వున్న పరిస్థితిని మావోయిస్టులు వివరిస్తూ "ప్రభుత్వం మావోయిస్టుల శక్తులు రెండూ సమతులన స్థితిలో వున్నాయి. ఇలా సంఘర్షిస్తూ వుంటే నేపాల్ ధ్వంసమవు తుందన్నారు. నేపాల్ సమాజాన్ని బాగుచేయటం కోసం సాయుధ పోరాటం చేస్తున్నాం కానీ నాశనం చేయటానికి కాద"ని వాళ్ళు చెప్పారన్నారు.

భాస్కరరావుగారు తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ "రాజు జ్ఞానేంద్ర 2005లో పార్లమెంటు ద్వారా రాజ్యాధికారం సాగించాడు. దేశంలో ఎమర్జన్సీ విధించాడు. ప్రజలపైన అణచివేతను సాగించాడు. దానిని మావోయిస్టు పార్టీ అద్భుతంగా వాడుకొన్నది. అక్కడ మీడియా అంతా నేపాల్ కాంగ్రెసుకు ప్రచారాన్ని యిచ్చాయి. అక్కడి ప్రజలు రాజ్యాంగ నిర్ణయక సభకు ఎన్నికలు జరగాలని కోరుకున్నారు మావోయిస్టులు. డిమాండ్ చేశారు. నేపాల్‌లో వైవిధ్యం వుంది. అక్కడ జాతులు, భాషలు, కులాలు, మతాలు ఉన్నాయి. సంఘర్షణలు వున్నాయి. ఇవి ఎన్నికలలో ప్రతిబింబించాలనే లోతైన తాత్త్విక చింతనలోంచే దామాషా పద్ధతి ఎన్నికలు జరగాలన్నారు. నేపాల్ సమాజం అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజం. హిందూ రాజ్యం, రాజ్యం వుంది. రాజ్యాన్ని సపోర్ట్ చేసే రాజ్యాంగ యంత్రం వుంది. ఘర్షణ 1950 నుండి వుంది. 1950లో భారత్‌కి, నేపాల్‌కి అసమాన ఒప్పందం జరిగింది'' అని వివరించారు.

మావోయిస్టు పార్టీ ఎన్నికల్ని ఎత్తుగడగా చేసిందా? అన్న ప్రశ్నకు నేపాల్‌కు ప్రజాతంత్రయుతమైన నమూనాలు రష్యా, చైనాలు అని వివరించారు. అంతర్జాతీయ పరిశీలకులుండడం వల్ల ఎన్నికలు శాంతి యుతంగా జరిగాయని అంతర్జాతీయ పరిశీలకులతో ఏర్పాటు చేసిన సభకు వచ్చిన ప్రచండ, భట్టారాయ్‌లు అన్నారని భాస్కరరావుగారు వివరించారు. 1990లో నేపాల్ దేశం ఫెడరల్ రిపబ్లిక్‌గా వుండాలని 40 డిమాండ్లతో కూడిన మెమోరాండంను రాజుకి ఇచ్చారు. ప్రదర్శన కారులపై కాల్పులు జరిపి 40 మందిని బలి గొన్నారు. అప్పటి నుండి సాయుధ పోరాటం ప్రారంభమైంది. అక్కడి ప్రభుత్వం కొన్ని పార్టీలను ఎన్నికలలో పాల్గొనకుండా చేసాయి. దీంతో అంతర్జాతీయ వ్యతిరేకత వచ్చింది" అన్నారు.

ఎన్నికైన మావోయిస్టు పార్టీ రాచరికాన్ని, ఫ్యూడలిజాన్ని రద్దు చెయ్యడం లక్ష్యంగా ప్రకటించింది. విషయాలపట్ల స్పృహలో వున్నామని చెప్పింది. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌ను వ్యతిరేకిస్తున్నామన్నారు. విదేశీ పెట్టుబడిని, దేశీయ పెట్టుబడిని రద్దు చెయ్యబోమని ప్రకటించారు. ఈ విషయాన్ని ఎలాంటి దాపరికం లేకుండా ప్రజల ముందు పరిచయం చేసారని సిబిఆర్ చెప్పారు.

అంతర్జాతీయ పరిశీలకులుగా వెళ్ళిన ఏపిసిఎల్‌సి రాష్ట్ర నాయకులు డి.సురేషకుమార్ మాట్లాడుతూ "నేపాల్‌లో మావోయిస్టు పార్టీ వివిధ ప్రజా సంఘాలుగా సంఘటితపరిచింది. సాయుధ పోరాటం సాగించింది. రాజ్యాంగ పరిషత్తు ఎన్నికల కోసం మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఎన్నికల్లో మెజారిటీ సాధించింది. నేపాల్‌లో ఏర్పడబోయే ప్రభుత్వం వెంటనే దానిపై అనేక వాదనలు వస్తున్నాయి. నేపాల్‌లో జరుగు తున్నది ఒక ప్రయోగం. నేపాల్ పరిణామాలపై మావో యిస్టులు ఎన్నికల్లో పాల్గొనడం వల్ల లొంగి పొయ్యారనో, మరేదో వ్యాఖ్యలు చెయ్యడం సరైంది కాదు. నేపాల్‌లో జరుగుతున్న పరిణామాలపై ఇంకా పరిశీలించాలి. వేచి చూడాల్సిందే. నిర్ణయాలు చెయ్యడం సరైంది కాదు" అన్నారు.

కొందరు ప్రొఫెసర్లు, రాజకీయ పక్షాల నాయకులు అడిగిన ప్రశ్నలకు భాస్కరరావుగారు, సురేష్‌గారు సమాధానాలిచ్చారు. భారత్, నేపాల్ సంఘీభావ కమిటీ సభ్యులు సిద్ధార్థగారు కూడా మాట్లాడారు.

సభకు ముందు కరపత్రాల ద్వారా హైద్రాబాద్‌లోని వివిధ సెక్షన్ల మధ్య విస్తృతంగా ప్రచారం జరిగింది.

కావలి, 27.4.'08:

27.4.2008 ఆదివారం ఉదయం 9 గంటలకు కావలిలో స్థానిక మల్లారెడ్డి భవన్ (మున్సిపల్ ఆఫీసు ఎదురుగా) "నేపాల్‌లో ఏం జరిగింది? ఏం జరగబోతుంది? తెలుసుకునే ప్రయత్నం చేద్దాం రండి!" అనే పిలుపుతో హాల్ మీటింగ్ జరిగింది.

నవయువ సమాఖ్య (ఎన్.వై.ఎస్), ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ హాల్ మీటింగ్‌కు ఓపిడిఆర్ జిల్లా నాయకులు బి.మాల్యాద్రి అధ్యక్షత వహించగా నేపాల్ రాజ్యాంగ పరిషత్ ఎన్నికలకు అంతర్జాతీయ పరిశీల కుడిగా వెళ్లిన, ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.భాస్కర రావు ప్రధానవక్తగా నేపాల్ పరిణామాలను వివ రించారు.

రాచరిక పాలనతో, సామ్రాజ్యవాదుల దోపిడీతో నలిగిపోయిన నేపాల్ ప్రజలు- ప్రజా ఉద్యమాల ద్వారా, సంఘటిత పోరాటాల ద్వారా, రాచరిక పాలనను కూలద్రోశారనీ అత్యంత ప్రజాస్వామికంగా రాజ్యాంగ పరిషత్ ఎన్నికలు జరిపించారనీ బలమైన ప్రజా పునాది ద్వారానే ఇది సాధ్యమైనదనీ నేపాల్‌లో జరిగిన పరిణామాలను సుదీర్ఘంగా వివరించారు.

నెల్లూరు, 27.4.'08:

నేపాల్ పరిణామాలపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్ఓ), నవయువ సమాఖ్య (ఎన్.వై.ఎస్)లు సంయుక్తంగా ఆదివారం సాయంత్రం సభ నిర్వహించాయి. సభలో ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నేపాల్ ఎన్నికలకు పరిశీలకుడిగా వెళ్ళి వచ్చిన సి.భాస్కరరావు మాట్లాడుతూ నేపాల్ మావోయిస్టు పార్టీ అత్యంత ప్రజా పునాదితో ముందుకు సాగుతోంది. అమెరికన్ సామ్రాజ్యవాదులు, భారత బడా పెట్టుబడిదారీ వర్గం కలగలసి నేపాల్ సహజవనరుల్ని లూటీ చేశాయి. నేపాల్‌లో విశాలమైన కొండ ప్రాంతం, నీటి వనరులు సమృద్ధిగా వున్నా అక్కడి రాచరిక వ్యవస్థ ప్రజలను దారిద్ర్యంలో వుంచింది. నేపాలీలు ఎంతో మంది భారత్ వంటి దేశాలకు వలస వచ్చి గూర్ఖాలుగా జీవనం సాగించాల్సి వచ్చింది. నేపాల్ రాచరిక పాలనలో తమ జీవితాలు రోజురోజుకీ దిగజారిపోవడాన్ని భరించలేని నేపాలీలు మావోయిస్టు పార్టీ ప్రచండ నాయకత్వంలో సాగుతున్న దీర్ఘకాలిక సాయుధ పోరాట మార్గంలో నడిచారు. ఇది మొన్న జరిగిన ఎన్నికలలో ప్రచండ నాయకత్వంలోని మావోయిస్టు పార్టీకి ప్రజలు పట్టం కట్టిన తీరుని చూస్తే అర్థమవుతుంది.

1996లో వివిధ విప్లవ కమ్యూనిస్టు శక్తుల మధ్య చర్చలు జరిగిన ఫలితంగా నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడి దీర్ఘకాలిక సాయుధ పోరాట పంధాలో నేపాల్‌లోని విశాల ప్రాంతంలో ప్రజా పునాదిని సాధించింది. పదేళ్ళలో దేశం మొత్తం మీద పట్టు సాధించి ఖాట్మండు నగరంలోకి ప్రవేశించగలిగారు. నేపాల్‌లోని 54 పాలకపార్టీలను, కమ్యూనిస్టు పార్టీలను కలపి ఐక్యసంఘటనగా ఏర్పడి నేపాల్ రాజు గద్దె దిగాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు జరపాలని డిమాండ్ చేసి ఎన్నికలు జరిపించి విజయం సాధించింది. ఎన్నికల్లో హింసకు పాల్పడతారని అక్కడి దోపిడీ శక్తులు మావోయిస్టు పార్టీపై ఎన్నికల ముందు దుష్ప్రచారం సాగించారు. నేపాల్ ఎన్నికలను పరిశీలించినప్పుడు ఎక్కడా హింసకు తావులేదని, ఎన్నికల్లో దుబారా ఖర్చులేదని అర్థమైంది. తాజాగా ప్రచండ భవిష్యత్ ప్రణాళికను పత్రికలకు తెలియజేస్తూ రాచరిక వ్యవస్థను అంతమొందిస్తామని, పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని తెలియ పరచడం చూస్తే ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా నేపాల్ మావోయిస్టులు ప్రజల పక్షాన నిలబడి వున్నార'ని పేర్కొన్నారు నేపాల్ పరిణామాలను పరిశీలించి భారత కమ్యూనిస్టు శక్తులు. విప్లవకారులు కార్యాచరణలో సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సభకు నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షులు కె.జీవరత్నం అధ్యక్షత వహించగా పిడిఎస్ఓ పట్టణ నాయకులు కృష్ణ మాట్లాడారు.

మంగళగిరి, 7.5.'08:

'నేపాల్‌లో ఏం జరుగుతుంది? పీడిత ప్రజలు ఏమి కోరుకుంటున్నారు? నేపాల్ ఎన్నికల పరిశీలనా బృందంలో సభ్యుల అనుభవాలు, స్పందనలు పంచుకుందాం' అంటూ స్థానిక సి.కె. జూనియర్ కళాశాల ఆవరణలో సభ జరిగింది. సభకు పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.అజిత అధ్యక్షత వహించారు. రాచరికానికి, ఫ్యూడలిజానికి వ్యతి రేకంగా దీర్ఘకాలంగా నేపాల్ ప్రజలు పోరాడుతున్న నేపథ్యంలో అక్కడ జరిగిన రాజ్యాంగపరిషత్ ఎన్నికలు, అందులో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) మెజారిటీ సంపాదించటం అనేక ప్రాముఖ్యతను సంతరించు కున్నాయి, చర్చనీయాంశాలుగా ఉన్నాయి అన్నారు. నేపాల్ ప్రజల ఆకాంక్షలను, వారి పోరాట లక్ష్యాలను, మొత్తం రాజకీయ పరిణామాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది అన్నారు.

ప్రధాన వక్త అయిన ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.భాస్కరరావు నేపాల్ పర్యటనలో తన అనుభవాలను, పరిశీలనలను వివరించారు. 'దీర్ఘ కాలంగా నేపాల్‌లో రాచరికానికి, రాజు యొక్క దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు-వివిధ పక్షాలు, కమ్యూనిస్టు పార్టీలు ఆందోళన సాగిస్తున్నారు. ఈ పోరాటంలో 20 వేల మందికిపైగా మరణించినప్పటికీ వెనుదీయక ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాంక్షిస్తున్నారు, భూస్వామ్య దోపిడీ విధానం దేశంలో పోవాలని కోరుతున్నారు. నేపాల్ మావోయిస్టు పార్టీ ప్రజల్ని ఐక్యంచేస్తూ ప్రజాసంఘాల నిర్మాణం సాగిస్తూ 10 సంవత్సరాలపాటు అవిశ్రాంతంగా సాగించిన సాయుధ పోరాట ఫలితమే ఏప్రిల్ 10, 2008 ఎన్నికలు, రాచరికం రద్దు అని అన్నారు. ఈ రోజు నేపాల్‌లో ఏర్పడినది "పరివర్తనా దశ నూతన ప్రజాస్వామ్యం" అని నేపాల్ మావోయిస్టు పార్టీ ప్రకటిస్తున్నది. ఈ పరివర్తన అభివృద్ధి దిశగా సాగి నేపాల్ ప్రజానీకం కోరుకుంటున్న వ్యవస్థ రావాలని ఆశిద్దాం. నేపాల్ ప్రజల పోరాటానికి సంఘీభావాన్ని ప్రకటిద్దాం' అంటూ ముగించారు.

ఎన్.వై.ఎస్-పిడిఎస్ఓ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సభకు మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 20 గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. అనేకమంది పెద్దలు, కమ్యూనిస్టు ఉద్యమ అభిమానులు, ప్రజాతంత్రవాదులు సభలో పాల్గొని, తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు, చర్చలో పాల్గొన్నారు.

సభలో ఎన్.వై.ఎస్. జిల్లా కార్యదర్శి ప్రసాద్, దుర్గాప్రసాద్, పిడిఎస్ఓ జిల్లా నాయకులు దేవా, సతీష్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు. ◈

కా॥ మండ్ల సుబ్బారెడ్డి 7వ వర్ధంతి సభ-ప్రదర్శన

కణేకల్లు, 24.4.'08:

అనంతపురంజిల్లా కణేకల్లు మండలం కె.కొత్త పల్లిలో రైతాంగ విప్లవయోధుడు, అమరుడు కా॥ మండ్ల సుబ్బారెడ్డి వర్ధంతి సభ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో జరిగింది. కా॥ మల్లయ్య సభకు ఆహ్వానం పలుకగా కా॥ గుత్తన్న అధ్యక్షత వహించిన సభలో ఓపిడిఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ బి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ కా॥ మండ్ల సుబ్బారెడ్డి రాయదుర్గం, కణేకల్లు మండలాలలో జరిగిన రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించారని, విప్లవ క్రమశిక్షణతో జీవితాంతం పోరాటాలకు నాయకత్వం వహించారని, రాష్ట్రంలో జరిగిన అనేక రైతాంగ పోరాటాలలో విరామ మెరుగక కృషి సాగించారని కా॥ మండ్ల సుబ్బారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకొని పోవడానికి ఈ ప్రాంతంలో రైతుకూలీ ఉద్యమాన్ని నిర్మాణయుతంగా సాగించాలని అన్నారు. నవయువ సమాఖ్య నాయకులు కా॥ ఎల్.లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న ప్రపంచీకరణ పరిస్థితులలో అన్ని సెక్షన్ల ప్రజలు సామ్రాజ్యవాద, భూస్వామ్య, బడా బూర్జువా వ్యతిరేక పోరాటాలను సాగించి విముక్తి మార్గంలో నడవాలని కా॥ ఎమ్మెస్ ఆశయ సాధనకు యువకులు కృషి సాగించాలని కోరారు.

వలసపాలెం, 24.4.08:

రైతాంగ, పీడిత ప్రజల ముద్దుబిడ్డ, పోరాటయోధుడు, అమరుడు కా॥ మండ్ల సుబ్బారెడ్డిగారి 7వ వర్ధంతి సభ 24.4.'08న కొత్తపట్నం మండలం వలసపాలెంలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ వి.శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఏపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కా॥ ఎం.ఎస్.శాయి మాట్లాడుతూ కా॥ మండ్ల సుబ్బారెడ్డి చిన్నవయస్సులోనే దేశవిముక్తికోసం జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారని, పరాయి పీడనకు వ్యతిరేకంగా పోరాడారని, ఆయన తన 60 సంవత్సరాల రాజకీయ జీవితంలో కమ్యూనిస్టు విలువలతో ఆదర్శంగా జీవించారని, తనపై 1970లో బనాయించిన కుట్రకేసు సందర్భంగా ఆయన, కోర్టులో పాలకుల ప్రజావ్యతిరేక, దోపిడీ విధానాలను ఎండగట్టి పాలకులే దోషులని వాదించారని, బలమైన పీడిత ప్రజా ఉద్యమాలు నిర్మించడమే ఆయనకు మనమందించే నివాళి అన్నారు. రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ ఎస్.లలిత కుమారి మాట్లాడుతూ ప్రకాశంజిల్లాతో కా॥ మండ్ల సుబ్బారెడ్డికి గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, దళారుల సేవలో వారికి దేశ వనరులను, సంపదలను ధారాదత్తం చేస్తున్నారని, సెజ్‌ల పేరుతో పేద మధ్యతరగతి రైతాంగాన్ని బలవంతంగా భూముల నుండి గెంటి వేస్తున్నారని, ఆరు గాలం అధిక పెట్టుబడులతో పండించిన పంటలకు గిట్టుబాటులేక రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటు న్నారని, ఈ సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాల నిర్మాణ ఆవశ్యకతను కామ్రేడ్ లలిత నొక్కిచెప్పారు. అనంతరం వలసపాలెం నుండి ముస్లింపాలెం, గొల్లపాలెం, పల్లెపాలెం రోడ్ మీదుగా కొత్తపట్నం బస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. ◈

జనశక్తి నిధిని సేకరించండి !
చందాల సంఖ్యను పెంచండి !!

జనశక్తి పక్ష పత్రికగా రెగ్యులర్‌గా వెలువడు తూన్న విషయం పాఠకులకు తెలుసు. నిర్వహణలో ఆర్థిక భారం పెరుగుతూ వుంది. గత దశాబ్ద కాలంగా దీని కోసం అప్పులుచేసి నిర్వహించు కొంటూవస్తున్నాం. దీని దృష్ట్యా పత్రిక ఆర్థిక దుస్థితి నుండి బయటపడాలంటే పాఠకుల, రాజకీయ కార్యకర్తల, ప్రజల సహకారం తప్పనిసరి.

రాజకీయ కార్యకర్తలు ప్రజలనుండి, పాఠకులనుండి, అభ్యుదయ, ప్రజాస్వామ్య దేశభక్తియుత శక్తులను విరాళాలు అభ్యర్థించి సేకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఇదే సమయంలో పత్రిక చందాలను విరివిగా చేర్పించవలసిందిగా కోరుతున్నాం.

అభివందనములతో

జనశక్తి నిర్వాహకులు

ఉత్తేజకరంగా సాగిన మేడే

ఒంగోలు:

అంతర్జాతీయ కార్మిక దీక్షాదినం "మేడే" సందర్భంగా సిపిఐ (ఎం ఎల్) ప్రకాశంజిల్లాశాఖ ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణం కుమ్మరిపాలెం పార్టీ కార్యాలయం వద్ద సిపిఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥ ఎస్.లలితకుమారి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ 122 సంవత్సరాల క్రితం చికాగోలో కార్మికులు 8 గంటల పనిదినం కోసం ప్రాణాలర్పించి ఎర్రజెండాను సృష్టించిన రోజని, కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను ఈ రోజు సామ్రాజ్య వాదంతో మిలాఖత్ అయిన పాలకవర్గాలు హరించి వేస్తున్నాయని అన్నారు. ప్రయివేటీకరణ, ప్రపంచీ కరణ, సరళీకరణ విధానాలతో ప్రజల జీవితాలు అల్ల కల్లోలం అవుతున్నాయని, పాలకులు అనుసరిస్తున్న ఈ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఈ మేడే సందర్భంగా దీక్ష పూనాలని పిలుపునిచ్చారు.

టుబాకో మురా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, అడ్వొకేట్ కా॥ పి.గోవిందరావు మాట్లాడుతూ కార్మికులు 8 గంటల పనిదినం కోసం పోరాట బావుటాను ఎగురవేసిన రోజు మేడే అని, ప్రభుత్వాలు, పాలకవర్గాలు కార్మిక హక్కులను దొడ్డిదారిన లాగి వేసుకుంటున్నారని, ఐక్యంగా తమ హక్కులకోసం నిలబడి పోరాడాలన్నారు.

తరువాత పార్టీ కార్యాలయం నుండి చర్చి సెంటరు, మిరియాలపాలెం, మస్తాన్ దర్గా, మార్కెట్ సెంటర్, అద్దంకి బస్టాండ్ మీదుగా ఆర్.టి.సి. డిపో వరకు ఆంధ్ర ప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య (ఏపిఎఫ్టియు), టుబాకో మురా వర్కర్స్ యూనియన్, రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన సాగింది. ప్రదర్శన అనంతరం ఆర్ టి.సి. డిపో వద్ద ఏపిఎఫ్టియు జిల్లా నాయకులు కా॥ కొండలరావు ఎర్రజెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా జరిగిన సభకు ఏపిఎఫ్టియు జిల్లా కార్యదర్శి కా॥ ఎం.ఎస్.శాయి అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో మేడే ప్రాధాన్యతను వివరించారు. సిపిఐ (ఎం ఎల్) జిల్లా నాయకులు కా॥ ఎస్.లలితకుమారి మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, బడా బూర్జువా దళారీ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికవర్గం ముందుండి జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని విజయవంతం చేయటం ద్వారానే ఈ సమస్యలకు పరిష్కారమన్నారు. యింకా ఈ సభలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు కా॥ చావలి సుధాకరరావు, ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.వి.క్రిష్ణయ్య, ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.విజయసారధి మాట్లాడారు.

మేడే కార్యక్రమం ప్రదర్శనలో రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కోదూరి కోటేశ్వరరావు, ఎన్వైఎస్ జిల్లా కార్యదర్శి జి.వెంకటరావు, ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి డి.నాగేశ్వరరావు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి.శాంతకుమారి, సుజాత, పిడిఎస్ఓ నాయకులు డి.శ్రీరామమూర్తి, ఏపిఎఫ్టియు నాయకులు ఐ.ఉమా మహేశ్వరరావు, టుబాకో బోర్డు మురా వర్కర్స్ నాయకులు రమణయ్య, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు వి.శ్రీరాములు, పరిటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపట్నం:

అంతర్జాతీయ కార్మికదీక్షాదినం మేడే సందర్భంగా కొత్తపట్నం మండలం వలసపాలెంలో రైతుకూలీ సంఘం కార్యాలయం వద్ద రైతుకూలీ సంఘం స్థానిక నాయకులు కా॥ దోనె వెంకటేశ్వర్లు సుత్తీకొడవలి జెండాను ఆవిష్కరించారు. అనంతరం రైతుకూలీ సంఘం, ఏపిఎఫ్టియుల ఆధ్వర్యంలో వలసపాలెం నుండి ముస్లింపాలెం, గొల్లపాలెం, పల్లెపాలెం రోడ్ మీదుగా కొత్తపట్నం బస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. బస్టాండ్ సెంటరులో సుత్తీకొడవలి జెండాను రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ వాటంబేటి శ్రీరాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏపిఎఫ్టియు జిల్లా కార్యదర్శి కా॥ ఎం.ఎస్.శాయి మాట్లాడుతూ 1886 చికాగోలో కార్మికులు 8 గంటల పనిదినం కోసం తమ రక్తాన్ని చిందించారని, ఆ రక్తంలో నుండి పుట్టినదే ఎర్రజెండా అని, శ్రమదోపిడీ నుండి కార్మికవర్గం, అశేష పీడిత ప్రజలు విముక్తి జరిగినపుడే ప్రజలకు నిజమైన స్వేచ్ఛ, స్వతంత్రం లభించినట్లని, ఈ రోజు అన్ని రంగాలు సామ్రాజ్యవాదుల, దళారీ బూర్జువావర్గం చేతుల్లో నలిగిపోతున్నాయని పాలకులు అనుసరించు తున్న ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఐక్య పోరాటాలు నిర్మించాలన్నారు. యింకా ఈ సభలో రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ ఎస్.లలిత కుమారి, ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి డి.నాగేశ్వరరావు రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ కోదూరి కోటేశ్వరరావులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్వైఎస్ జిల్లా కార్యదర్శి కా॥ వెంకటరావు, రాఘవరెడ్డి, రైతుకూలీ సంఘం నాయకులు గంపాల వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈతముక్కల:

ఈతముక్కలలో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఎర్రజెండాను జిల్లా నాయకులు కా॥ పిల్లి నాగయ్య గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ కోదూరి కోటేశ్వరరావు, జయ బాబులు మాట్లాడారు.

విజయనగరంజిల్లా: వి.టి.అగ్రహారం:

ఏపిఎఫ్టియు ఆధ్వర్యంలో నారాయణి స్టీల్సు పారిశ్రామికవాడ గుండా అరుణా జూట్ మిల్లు మీదుగా కోర్టు వరకు మేడే ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మహిళా కార్మికులతోపాటు నారాయణి స్టీల్స్, ఆరిన్ ఎక్స్‌పోర్టర్స్, ఆంజనేయ ఫ్లోర్ మిల్లు, ఆటో, జూట్ రంగాల కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మేడే వర్ధిల్లాలి! ప్రపంచ కార్మికులారా ఏకం కండి! అధిక ధరలను తగ్గించాలి! సెజ్-2005 చట్టాన్ని రద్దు చెయ్యాలంటూ దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో ప్రదర్శన ఉద్వేగంతో సాగింది.

అనంతరం నారాయణ స్టీల్స్ వద్ద ఉదయం 10 గంటలకు ఏపిఎఫ్టియు జిల్లా నాయకులు కా॥ జి.శ్రీనివాసరావు మేడే జెండాను ఎగురవేసారు. కార్మికులనుద్దేశించి ఏపిఎఫ్టియు జిల్లా కన్వీనర్ కా॥ రెడ్డినారాయణరావు మాట్లాడుతూ సంఘటితరంగ కార్మికులకు కూడా 10 గంటల పనిదినాన్ని అమలు చేయడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారని. సెజ్‌ల పేరిట భూములను, గనులను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. నారాయణ స్టీల్స్ కార్మికనాయకులు పి.అప్పలస్వామి, డి.కె.లాడు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఏపిఎఫ్టియు ఆఫీసు (కుమ్మరుల వీధి) వద్ద కా॥ బి.పాండురంగారావు జెండా ఆవిష్కరించగా కా॥రెడ్డి నారాయణరావు మేడే ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.వై.ఎస్. జిల్లా అధ్యక్షులు కా॥ జి.శంకర్‌రావు, ఆటో యూనియన్ నాయకులు పి క్రిష్ణారావు, ఎన్.అప్పలరాజురెడ్డి, రజక సంఘం నాయకులు ఆర్.గోవిందు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీ విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎనిమిది ఆటో స్టాండుల్లో జెండా ఆవిష్కరణలు జరిగాయి. అరుణా జూట్‌మిల్లు ఎదురుగా ఉన్న స్టాండులో యూనియన్ నాయకులు జమాక అప్పారావు ఆవిష్కరించగా గౌరవ అధ్యక్షులు కె.పైడి రాజు, ఎన్.వై.ఎస్. జిల్లా ఉపాధ్యక్షులు సి.హెచ్.నాగరాజు తదితరులు మాట్లాడారు.

కోర్టు ఆటో స్టాండు వద్ద యూనియన్ అధ్యక్షులు పొట్నూరి క్రిష్ణారావు మేడే జెండాని ఎగురవేసారు. ఎన్.అప్పలరాజురెడ్డి, బి.పాపారావు తదితరులు పాల్గొన్నారు. మెసానిక్ టెంపుల్ స్టాండు వద్ద కా॥ కోరాడ పైడిరాజు, ఉస్మానియా టవర్స్ ఆటోస్టాండు వద్ద సంఘ కోశాధికారి బొమ్మడ పాపారావు, గంటస్థంభం ఆటోస్టాండు వద్ద యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కా॥ నీలాపు అప్పలరాజురెడ్డి, ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ఆటోస్టాండు వద్ద యూనియన్ సహాయ కార్యదర్శి మొయిద సన్యాసిరావు, ఎస్.బి.ఐ. సెంటర్ స్టాండు వద్ద ఎన్.వై.ఎస్.జిల్లా అధ్యక్షులు జి.శంకరరావు, నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామంలో మాజీ ఎం.పి.పి. పతివాడ అక్కునాయుడు అరుణ పతాకాలను ఎగురవేసి, దోపిడీ, పీడనలులేని సమసమాజ స్థాపనకు అంకితమవుతామని దీక్ష వహించారు.

మేట్రిక్స్ వద్ద పతాకావిష్కరణ: పూసపాటి రేగలోని మేట్రిక్స్ కంపెనీ గేటు ముందు ఎర్రజెండా ఆవిష్కరణను అడ్డుకోవడానికి యాజమాన్యం చేసిన ప్రయత్నాన్ని త్రిప్పికొట్టి కార్మికుల పోరాట చిహ్నమైన సుత్తి, కొడవలి అరుణ పతాకాన్ని ఏపిఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ గణేష్‌పండా ఆవిష్కరించారు. మేడే ప్రాధాన్యతను వివరించి, 4వ తేదీన సిహెచ్.అగ్రహారంలో జరిగే "మేడే" బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు జి.వి.రమణ, ప్రధాన కార్యదర్శి వై.అచ్యుతరావు, కోశాధికారి జి.అసిరినాయుడు, లక్ష్మణరావు, సత్యనారాయణ, రామచంద్రరావు, 200 మందికిపైగా కార్మికులు పాల్గొన్నారు. నూతనంగా జెండా దిమ్మె నిర్మించి, ఎర్ర తోరణాలతో కంపెనీ గేటు నుండి హైవే వరకు అలంకరించారు. కార్మికులు ఐక్యతతో, పట్టుదలతో నిర్వహించిన మేడే పతాకా విష్కరణను చూసిన యాజమాన్యం వెనక్కి తగ్గింది. ఆవిష్కరణ జయప్రదంగా జరిగింది.

పార్వతీపురం: స్థానిక వరకోల గెడ్డ వద్ద అభ్యుదయ వరహాలరెడ్డి బడ్డీ వ్యాపారుల సంఘం, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. బైపాస్ కాలనీలోని రైతుకూలీ సంఘం కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి కా॥ డి వర్మ జెండాను ఎగురవేశారు.

కొమరాడ: విక్రమపురంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో, కోటిపాంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యాన పతాకావిష్కరణలు జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు కా॥ బి.నరసింగ రావు, కా॥ ఎం.భాస్కరరావు, కా॥ శ్రీనునాయుడు, కా॥ జి.కృష్ణమూర్తి, కా॥ ఎ.గుంపుస్వామి, కా॥ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: అనకాపల్లి మండలంలోని గుంకల లోవ, డ్రిల్లర్స్ కాలనీ, బవులవాడ, పాలెం ప్రాంతాలలో క్వారీ, క్రషర్స్, డ్రిల్లర్స్ నివసించే కాలనీలలో మేడే పతాకాలను ఏపిఎఫ్టియు రాష్ట్ర కోశాధికారి కా॥ ఆడారి అప్పారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ జి.నాగభూషణం ఎగురవేసి అమరవీరులకు జోహార్లు అర్పించారు. అనంతరం అనకాపల్లిలో (ఏపిటిఎఫ్ ఆఫీసులో) ఏర్పాటు చేసిన సభకు క్వారీ కార్మిక సంఘ గౌరవ అధ్యక్షులు కా॥ ఆడారి అప్పారావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ గణేష్‌పండా, రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ జి.నాగభూషణం, మేడే ప్రాముఖ్యతని, నేటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను తెలియజేసి తమ వేతనాలు, జీవన పరిస్థితుల మెరుగుదలకోసం పోరాడుతూనే, ఈ దోపిడీ వ్యవస్థని కూలద్రోసి, సమ సమాజాన్ని సాధించుకోడానికి కృషి చేస్తామని ఈ మేడే రోజున ప్రతినబూనాలని ఉద్బోధించారు ఇంకా ఈ సభలో డ్రిల్లర్స్ సంఘం నుండి గొల్లపల్లి రామచంద్ర రావు, వాసు, క్వారీ, క్రషర్స్ కార్మిక సంఘ కార్యదర్శి బి.పైడిరాజు, క్వారీ కార్మికులు పాల్గొన్నారు.

విశాఖ డాక్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపిఎఫ్టియు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ గణేష్‌పండా జెండా ఆవిష్కరణ చేశారు. కామ్రేడ్స్ ఆడారి అప్పారావు, నాగభూషణం ఈ సందర్భంగా కార్మికుల నుద్దేశించి మాట్లాడారు.

నిజామాబాద్: నిజామాబాద్ -మాధవనగర్ కెనాల్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన జెండాదిమ్మె వద్ద రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గంగుల నర్సయ్య ఎర్రజెండా ఆవిష్కరించి ప్రపంచవ్యాపిత పీడిత ప్రజానీక పోరాట దీక్షాదినం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యఅతిధిగా పాల్గొన్న రైతుకూలీ సంఘం (ఆం ప్ర) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె.కోటయ్య మాట్లాడుతూ అమెరికన్ అగ్రరాజ్య సామ్రాజ్యవాద దుష్టవిధానాలకు వ్యతిరేకంగా, కేంద్ర, రాష్ట్ర దళారీ పాలకులకు వ్యతిరేకంగా కష్టజీవులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేశ్‌పూర్‌లో మేడే రోజు సాయంత్రం కేశపూర్‌లో ఎర్రజెండాను రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) నిజామాబాద్‌జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గంగుల నర్సయ్య ఎగురవేశారు. ◊

గుంటూరులో ఏపిఎఫ్టియు ధర్నా

గుంటూరు, 29.05.08:

మిర్చియార్డు అగ్నిప్రమాదం కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని. మిర్చియార్డులో ప్రతికార్మికునికి లైసెన్స్ మరియు గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య (ఏపిఎఫ్టియు) ఆధ్వర్యంలో చెక్‌పోస్టు సెంటర్ నుండి, రింగ్‌రోడ్ మీదుగా కార్మికుల ప్రదర్శన-అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఈ ధర్నాకు ఏపిఎఫ్టియు నగర కార్యదర్శి యు.క్రిష్ణ అధ్యక్షత వహిస్తూ నిన్నటిదాకా పనిపాటలతో కళకళలాడిన మిర్చియార్డు నేడు వల్లకాడుగా మారిందనీ, యార్డులో జరిగిన అగ్నిప్రమాదం కార్మికుల భవిష్యత్తుకు పెనుసవాలుగా మిగిలిందనీ, రైతాంగం చెమటోడ్చి పంట పండించి మిర్చియార్డుకు సరుకు తీసుకురావడం ఒక ఎత్తు అయితే, మండుటెండల్లో రేగే కోరుతో రేయింబవళ్ళు విరామమెరుగక శ్రమించే శ్రామికుల శ్రమ మరో ముఖ్యమైన భాగంగా వుందన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మికులందరూ సమస్యల పరిష్కారం కోసం సంఘటిత శక్తిగా నిలబడాలని కోరారు. సిపిఐ (ఎం.ఎల్) నగర కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆసియా ఖండంలో ప్రసిద్ధిగాంచిన గుంటూరు మార్కెట్ యార్డులో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులకు ఏ విధమైన గుర్తింపుకార్డులుగానీ, లైసెన్సులుగాని లేవంటే ప్రభుత్వం, యార్డు యాజమాన్యాలు కార్మికులపట్ల ఎంతటి నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా ఉంటున్నాయో అర్ధ మౌతుందని, సంవత్సరంలో 4, 5 నెలలు మాత్రమే సీజనల్ పనిగా ఉంటూ మిగతా అన్‌సీజన్‌లో నిరుద్యోగులుగా మారిపోయే విచిత్ర పరిస్థితి యార్డులో నెలకొని వుందని, యార్డులో పనిచేసే కార్మికులకు ఎలాంటి వసతి సౌకర్యాలు, ఎలాంటి రక్షణ చర్యలు లేవనీ, వెంటనే ఈ సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజువారీగా పని చేసుకొని బ్రతికే కార్మికులకు ఉపాధికరువై దిక్కుతోచని స్థితిలో వున్నారని, యార్డులో కార్మికులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని, కార్మికులుగా గుర్తించి, కనీసపాటి బాధ్యత ప్రభుత్వం మీద ఉందని రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డు దిగుమతి మురా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బత్తులకొండలు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఎగుమతి మరియు రాశి మురా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మోహనరావు, పోరుమళ్ళ చెన్నయ్య; గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డు బండ్ల రిక్షా, తోలకం మురా వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి, ఉపాధ్యక్షులు, బలరామిరెడ్డి, శివయ్య, వ్యవసాయ మార్కెట్ యార్డు గేటు తోలకం మురా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సుబ్బయ్య, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మురా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కాపలా కూలీల సంఘం నాయకులు మిరియాల సాంబయ్య, రూప్లా, నాయక్ తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం పై డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేసి చర్చించారు. దీర్ఘకాలం అపరిష్కృతంగా వున్న సమస్యల పరిష్కారానికి మరింత ఆందోళనకు సిద్ధం కావలసిందిగా ఏపిఎఫ్టియు కార్మికులకు పిలుపునిచ్చింది. ◊

(15వ పేజీ తరువాయి)

సి.పి.ఐ. (ఎం.ఎల్) పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపిఎఫ్టియు నగర కార్యదర్శి ఉప్పుదల క్రిష్ణ మాట్లా డుతూ పిజి, డిగ్రీ చదువుకున్న యువకులు ఉపాధి అవకాశాలు లేక లక్షల సంఖ్యలో నిరుద్యోగ సమస్యతో బాధపడుతూ ఏదో ఒక విధంగా వాళ్ళ యొక్క బ్రతుకుదెరువుకోసం ఉన్న కొద్దిపాటి ఆస్తిపాస్తులు బ్యాంకుల్లో తాకట్టుపెట్టి లోన్‌లో ఆటో కొని దాని ద్వారా వారి యొక్క జీవనాన్ని గడుపుతుంటే ఈ అవకాశం కూడా లేకుండా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌కి 5 రూపాయలు, డీజిల్‌కి 3 రూపాయలు, గ్యాస్‌కి 50 రూపాయలు చొప్పున పెంచి వారి యొక్క బ్రతుకులను చిన్నాభిన్నం చేశారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు ప్రజలందరూ సంఘటితంగా ఐక్య పోరాటాలు చెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్) నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సింహాద్రి లక్ష్మారెడ్డి, కాట్రగడ్డ హనుమంతరావు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) నాయకులు దూపాటి శ్రీను, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ బి.మల్లేశ్వరి పాల్గొని నాయకత్వం వహించారు.

నిజామాబాద్, 5.6.08:

పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, పన్నుల పేరుతో ప్రభుత్వం, పెట్రోలియం కంపెనీలు ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్న తీరును ఖండిస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) నిజామాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో 5.6.'08న నిజామాబాద్-హైదరాబాద్ రహదారిపై మాధవనగర్ వద్ద రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి రైతుకూలీ సంఘం, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కా॥ గంగుల నర్సయ్య మాట్లాడుతూ గతంలో బిజెపి ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెసు యుపిఏ ప్రభుత్వం రెండూ పెట్రోలు, గ్యాస్, డీజిల్ ధరలను పెంచి సామాన్యుల నడ్డివిరచడంలో పోటీ పడుతున్నాయని, బహుళజాతి కంపెనీలు, పెట్రోలియం కంపెనీల లాభాలకోసం ప్రభుత్వం విచ్చల విడిగా పన్నుల వసూలు చేయడంకోసం ఇపుడు ఈ రేటు పెంపుదల జరిగిందని దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా కలసి పోరాడాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఎఫ్టియు నాయకులు యస్. నర్సయ్య, రైతుకూలీ సంఘం నాయకులు బి.రజియా, మల్లేష్, నర్సాగౌడ్ తదితరులు ఈ రాస్తారోకోలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాస్తారోకోకి సహకరించిన ప్రజలకి ధన్యవాదాలు తెలుపుతూ పెంచిన ధరలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని పిలుపు ఇచ్చారు. ◊

పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి - సిపిఐ (ఎం.ఎల్)

(సి.పి.ఐ. (ఎం.ఎల్) కేంద్ర కమిటీ పిలుపు మేరకు -పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జూన్ 5 తేదీన, ప్రతిపక్షాల బంద్‌తో సమన్వయిస్తూ జూన్ 6వ తేదీన వివిధ ప్రాంతాల్లో విస్తృత నిరసన, ఆందోళనా కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యంలోనూ, ఇతర సంఘాలతో కలసీ నిర్వహించారు. అందిన రిపోర్టు వరకు ప్రచురిస్తున్నాం.

- సంపాదకుడు)

విజయనగరం, 5.6.08:

కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను నిరసిస్తూ విజయనగరంలో రాస్తారోకో, ప్రదర్శనలు నిర్వహించారు. 5.6.2008 ఉదయం 11 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ నాలుగు రోడ్ల కూడలి వద్ద సి.పి.ఐ. (ఎం.ఎల్), ఏపిఎఫ్‌టియు విజయ దుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. పూర్తిగా ఈ ప్రాంతాన్ని దిగ్బంధం చేసారు. ఆర్టీసీ బస్‌లు రాకపోకలతోపాటు మొత్తం వాహనాలన్నీ ఎక్కడవి అక్కడే ఆగిపోయాయి. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామని, ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించాలని, పెంచిన పెట్రో ధరలు తగ్గేంత వరకు పోరాడుదామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

తొలుత, ఉదయం 10 గంటలకు తుపాకుల వీధి ఆఫీస్ నుంచి, సిపిఐ (ఎం.ఎల్) ఆధ్వర్యంలో పెట్రో ధరల పెంపును నిరసిస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ప్రదర్శన జరిపారు. తర్వాత రాస్తారోకో అనంతరం సిపిఐ (ఎం.ఎల్), ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకత్వంలో మయూరి జంక్షన్ వరకు ప్రదర్శన జరిగింది.

ఈ సందర్భంగా నాయకులు బి.శంకరరావు, ఆర్.నారాయణరావు మాట్లాడుతూ కస్టమ్స్, ఎక్సైజు సుంకాలు పన్నులు 75 శాతం తగ్గించడం ద్వారా ఈ భారం సాధారణ ప్రజలపై పడకుండా చూడాలని ప్రజారవాణా వ్యవస్థపై ఆధారపడాలని ప్రజావ్యతిరేక కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు.

ఇంకా ఈ కార్యక్రమానికి శ్రీ విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ (ఏపిఎఫ్‌టియు అనుబంధం) పట్టణ అధ్యక్షులు పోట్నూరు క్రిష్ణారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.అప్పలరాజురెడ్డి, సహాయ కార్యదర్శి ఎం.సన్యాసిరావు, ఎన్.వై.ఎస్. అధ్యక్ష, ఉపాధ్యక్షులు జి.శంకరరావు, సిహెచ్.నాగరాజు, రజక నాయకులు ఆర్.గోవిందు, ఆర్.అశ్వరావు నాయకత్వం వహించారు.

పార్వతీపురం 5.6.08:

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరను ఉపసంహరించాలంటూ డిమాండ్ చేస్తూ పార్వతీపురంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో 5.6.2008 ఉదయం 10 గంటలకు రైతుకూలీ సంఘం ఆఫీస్ నుండి నిరసన ప్రదర్శన చేశారు. పార్వతీపురం మెయిన్ రోడ్‌గుండా ఆర్డీవో ఆఫీస్ వరకు జరిగిన ప్రదర్శనలో పెట్రో ధరల పెంపుదలను నిరసిస్తూ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్‌తో ఆర్.డి ఓ.కు ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు.

అనంతరం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ డి.వర్మ మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా పెట్రో ధరలు వున్నాయని, దేశంలో ప్రజలు చెల్లించే ధరల్లో సగానికి పైగా పన్ను చెల్లిస్తున్నారని, ఒక రూపాయి పెట్రోలు అమ్మకంపై 55 పైసలు, ఒక రూపాయి డీజిల్‌పై 34 పైసలు పన్నుల రూపంలో ఖజానాకు చేరుతుందని వీటిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసనాయుడు, వి.నర్సింగరావు, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

ఒంగోలు, 5.6.'08:

కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపుదలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 6.6.2008 శుక్రవారం జరుగనున్న "బంద్"ను జయప్రదం చేయాలని కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో సిపిఐ (ఎం.ఎల్) ఆధ్వర్యంలో ప్రదర్శన, దిష్టిబొమ్మ దగ్ధం చేయటం జరిగింది. ప్రదర్శన ఈమనిపాలెం పార్టీ కార్యాలయం నుండి ప్రకాశంభవన్, నెల్లూరు బస్టాండ్, చర్చి సెంటరు వరకు సాగింది.

కేంద్రంలో యుపిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 4 సంవత్సరాలలో 8సార్లు పెట్రో, డీజిల్ ధరలు పెంచింది. అంతర్జాతీయంగా పెట్రో ధరలు పెరగటంతో ఈ పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచవలసివస్తుందని పాలకులు అంటున్నారు. మనం 70 శాతంపైగా పెట్రోలు, డీజిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. మన దేశంలో గోదావరి బేసిన్‌లో, గంగాతీరం, రవ్వలాంటి అనేక ఆయిల్ గ్యాసు నిక్షేపాలను బహుళజాతి సంస్థలకు, సామ్రాజ్యవాదులకు కారుచౌకగా కట్టబెడుతున్నారు. జాతీయంగా ఆ ఆయిల్ నిక్షేపాలు మనం వినియోగించుకుంటే ప్రజలకు చౌకగా పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్‌లు సరఫరా చేయవచ్చు. కానీ పాలకులు వారి కమీషన్ల కోసం దేశంలోని సహజ వనరులను ధారాదత్తం చేస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగటంతో పేద, మధ్యతరగతి ప్రజలు విలవిలలాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వంట గ్యాస్, డీజిల్ ధరలు పెరగటంతో మరలా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. పాలకులు సామ్రాజ్యవాదుల సేవలో అనుసరిస్తున్న ఈ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళనను ఉధృతం చేయాలని, దానిలో భాగంగా బంద్‌ను జయప్రదం చేయాలని కామ్రేడ్ లలిత పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు ఎస్ లలితకుమారి, ఏపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కా॥ ఎం.ఎస్.సాయి, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా అధ్యక్షులు టి.రేణుక, ఎన్‌వైఎస్ జిల్లా కార్యదర్శి జి.వెంకటరావు, పిడిఎస్‌ఓ జిల్లా నాయకులు పి.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు

విజయవాడ, 9.6.'08:

కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వం పెంచని విధంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లను దారుణంగా పెంచిందని, ఆయిల్, గ్యాస్ రంగంలో ప్రైవేటీకరణ ఉచ్చు నుంచి భారత ప్రభుత్వం బయట పడితేనే ఆయిల్, గ్యాస్ ఛార్జీలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని సిపిఐ (ఎం.ఎల్) కృష్ణాజిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ, పార్టీ విజయవాడ నగర కమిటీ నాయకత్వాన పెంచిన పెట్రోల్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్‌చేస్తూ విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాను ప్రారంభిస్తూ మాట్లాడారు. ఆయన తన ప్రసంగాన్ని కొన సాగిస్తూ- పి.వి.నరసింహారావు కాలంలో ప్రారంభమైన ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాల ఫలితంగా ఇతర రంగాలతోపాటు మనకు అపారంగా ఉన్న సహజవనరులైన ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు రిలయన్స్ లాంటి బడా గుత్తబడిదారుల చేతుల్లోకి పోయిందనీ, ప్రభుత్వ సంస్థ అయిన ఓఎన్‌జీసీని దివాళా తీయించారనీ, చమురు ధరలను నిర్ణయించే అధికారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లో లేదనీ, ఇటీవల సిమెంటు, ఇనుము ధరలను బడా గుత్త సంస్థలు నిర్ణయించినట్లుగా ప్రపంచంలో ఆయిల్ వనరులపై ఆధిపత్యం కల్గిన అమెరికన్ సామ్రాజ్యవాదులు మరింతగా వనరులపై ఆధిపత్యం పొందటానికి ఆయిల్ వనరులు కల్గిన ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై దురాక్రమణ యుద్ధాలు సాగించి, ఆ యుద్ధాల ఖర్చు భారాన్ని ప్రపంచ ప్రజలపై నిరంకుశంగా రుద్దేవిధానంలో భాగమే పెట్రోల్ ఛార్జీల దారుణ పెంపుదల అనీ, కావున పాలకుల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాలు సాగించాలని' పిలుపిచ్చారు. ధర్నాలో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్నాకు ముగింపుగా, పెంచిన ఛార్జీలు తగ్గించాలనీ, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలని, నిత్యజీవితావసర వస్తువుల ధరలను తగ్గించాలి మొదలగు డిమాండ్లతో సబ్‌కలెక్టర్ ఆఫీస్ ఇన్‌ఛార్జికి మెమోరాండం సమర్పించారు. ధర్నాలో విజయవాడ నగర పార్టీ కార్యదర్శి టి.పూర్ణచంద్రరావు, పార్టీ సీనియర్ నాయకులు షేక్ మదార్, జి.ధర్మారావు, కె.ఏసు, ఎన్.వై.ఎస్. నాయకులు వి.లక్ష్మణ, కె.రాహుల్, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి, 5.6.08:

పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదలకు నిరసనగా వెంకటగిరి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి కాశీపేట కూడలి వద్ద 'కేంద్ర ప్రభుత్వం' దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరల పెంపుదలను వ్యతిరేకిస్తూ అంతర్జాతీయ ఆయిల్ మార్కెట్‌పై పెత్తనం కలిగిన అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీని నిరసిస్తూ రైతుకూలీ సంఘం (ఆం ప్ర), ఎన్‌వైఎస్ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ జి.సునీత, జిల్లా కమిటీ సభ్యులు కా॥ ఆర్.సుబ్బరాయుడు, వి.వి.రమణయ్య, ఎన్‌వైఎస్ పట్టణ నాయకులు కా॥ జె.చలపతి, బి.ప్రసాద్‌లు పాల్గొని నాయకత్వం వహించారు. ర్యాలీలో రైతుకూలీలు, యువకులు పాల్గొన్నారు.

రాపూరు, 6.6.08:

డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెంపుదలను వ్యతిరేకిస్తూ జరిపిన రాష్ట్ర వ్యాప్త బంద్ సందర్భంగా రాపూరు పట్టణంలో రైతుకూలీ సంఘం (ఆం ప్ర),ఇతర సంఘాలతో కలిసి బంద్ విజయవంతంగా నిర్వహించాయి. ఆందోళన కారణంగా ఆర్.టి.సి. బస్సులు ఉదయం నుండే ఆగిపోయాయి. దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. పట్టణంలో ర్యాలీ నిర్వహించి బంద్‌కు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ జి.సునీత, జిల్లా కమిటీ సభ్యులు కా॥ ఆర్ సుబ్బరాయుడు పాల్గొని నాయకత్వం వహించారు

మచిలీపట్నం, 5.6.'08:

కోనేరు సెంటర్‌లో రైతుకూలీ సంఘం (ఆం ప్ర), ఏపిఎఫ్‌టియు సంయుక్తాధ్వర్యంలో ధర్నా విజయవంతంగా జరిగింది. ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేమన ఆదినారాయణ ప్రసంగిస్తూ "ఆయిల్ ధరలను పెంచటం ప్రజా వ్యతిరేక చర్య ఉన్న ప్రధాని ఆయిల్ ధరలు పెంచడాన్ని సమర్థించటం ప్రజల్ని వంచించడమే ఆయిల్ దరల పెంపుదల రవాణా రంగంతోసహా అన్ని రంగాలపై ప్రభావంచూపి ప్రజల జీవనస్థితిగతుల్ని దుర్భరం చేస్తున్నదన్నారు.

రైతుకూలీ సంఘం (ఆం ప్ర.) కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యులు కా॥ జె.జగన్ మాట్లాడుతూ "ప్రభుత్వం ప్రజలకు అంతగా అవసరం లేని వాహనాలను దిగుమతి చేసుకోవడం, ఉత్పత్తి చేయడం, వాడకాలను పెంచడం వల్ల ఆయిల్ అవసరాలను పెంచుతుందన్నారు. దేశంలోని ఆయిల్, గ్యాస్ నిక్షేపాల అన్వేషణ, వెలికితీత స్వంత వనరులను వినియోగించుకొనేందుకు చర్యలు తీసుకోకుండా దిగుమతులపై ఆధారపడటం వల్ల సంక్షోభంలో పడుతోంది. మన సహజవనరులైన గ్యాస్, ఆయిల్ నిక్షేపాలను రిలయన్స్ వంటి స్వదేశీ, అమెరికా, బ్రిటన్, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి విదేశీ బడా కంపెనీలకు కుదవపెట్టే ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడందే ప్రజలకు విముక్తి లేదని" అన్నారు. ఏపిఎఫ్‌టియు మచిలీపట్నం ఏరియా కార్యదర్శి కా॥ శీరంశెట్టి లక్ష్మణరావు, చిలకలపూడి సిడబ్ల్యుసి మురా వర్కర్స్ యూనియన్ నాయకులు పరసా శ్రీనివాసరావు, తోట నాగశివబ్రహ్మం, మచిలీపట్నం ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గొలిపర్తి ఆదినారాయణ, కొండేటి మురళి, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు అనిశెట్టి నాగేశ్వరమ్మ, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు పామర్తి అంజమ్మ, కొప్పినేని ఉమామహేశ్వరరావు, ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షుడు కా॥ ముచ్చు సుధాకర్‌లు పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నా సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు జరిగింది. ధర్నా శిబిరంలో గ్యాస్ బండలను ప్రదర్శించటం పలువుర్ని ఆకర్షించింది. ధర్నాలో కార్మికులు, కూలీలు, రైతులు, మహిళలు 100 మంది పాల్గొన్నారు.

చల్లపల్లి, 5.6.'08:

కేంద్ర ప్రభుత్వం పెంచిన ఆయిల్, గ్యాస్ ధరలకు నిరసనగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) చల్లపల్లి ఏరియా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎం.ఆర్.ఓ. కార్యాలయం ఎదుట సాయంత్రం 5 గంటలకు రాస్తారోకో జరిగింది. 30 నిముషాలపైగా జరిగిన రాస్తారోకో వల్ల పెద్ద ఎత్తున వాహనాలు నిలబడిపోయాయి. రాస్తారోకో అనంతరం రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) నాయకులు, కార్యకర్తలు, రైతుకూలీలు చల్లపల్లి సెంటర్ వరకు వెళ్ళి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) చల్లపల్లి ఏరియా కార్యదర్శి కా॥ ఈపూరి రాంబాబు ప్రసంగిస్తూ "ఇప్పటికే అధిక ధరలతో సతమతమవుతున్న ప్రజానీకంపై ఆయిల్, గ్యాస్ ధరలు పెంచటం దుర్మార్గమని" అన్నారు. ఎన్‌వైఎస్ నాయకులు కొల్లూరి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక, 5.6.'08:

కేంద్ర ప్రభుత్వం పెంచిన ఆయిల్, గ్యాస్ ధరలకు నిరసనగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నాగాయలంక ముఖ్యవీధుల్లో జరిగింది. ముఖ్యకూడళ్ళల్లో గ్రూపు మీటింగులను నిర్వహించారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కోశాధికారి కా॥ తలశిల మనోహర్ మాట్లాడుతూ "పూర్వం ఆయిల్‌పూల్ నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసి అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు పెరిగినపుడు నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా చూసేది. వరల్డ్ బ్యాంక్ సూచనతో ఆయిల్ పూల్ నిధిని రద్దు చేయడం వల్ల ఆయిల్ ధరలు పెంచటం పరిపాటిగా మారి ప్రజల పాలిట శాపంగా మారింది" అన్నారు. ఎన్.వై.ఎస్. జిల్లా నాయకులు బసవదేవుడు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం, 6.6.08:

కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచినందుకు నిరసనగా జరిగిన రాష్ట్రవ్యాపిత బంద్‌లో సిపిఐ (ఎం.ఎల్) క్రియాశీలంగా పాల్గొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బేనర్లు, ఎర్రజెండాలతో మచిలీపట్నంలోని బస్టాండు సెంటర్, కోనేరు సెంటర్, పంపుల చెరువు సెంటర్, జిల్లా కోర్టు సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్, జెడ్ పి. సెంటర్, పరాసుపేట సెంటర్, రామానాయుడుపేట సెంటర్, కోటవారితుళ్ళ సెంటర్‌లలో దళ ప్రచారం జరిగింది. కోనేరు సెంటర్ నుండి బస్టాండుసెంటర్ వరకు ప్రదర్శన జరిగింది ప్రచార సందర్భంగా గ్రూపు మీటింగ్‌లు నిర్వహించారు ఏ దేశంలోలేని విధంగా మన దేశంలో ఆయిల్ ఉత్పత్తులపై అత్యధికంగా పన్నుల భారాన్ని ప్రభుత్వం మోపుతోంది. తద్వారా ప్రజలను నిలువునా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకొంటున్నాయి. దళారీ పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు నిరసనగా ప్రజలు ఉద్యమించాలని" పిలుపునిచ్చారు.

గుంటూరు, 5.6.08:

పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని— డిమాండ్‌చేస్తూ కేంద్ర, రాష్ట ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సి పి ఐ (ఎం.ఎల్) నగరశాఖ ఆధ్వర్యంలో చుట్టుగుంట పున్నయ్య, శంకర్‌ల భవన్ నుండి బాషా హోటల్, రింగ్‌రోడ్, మార్కెట్, హిందూ కాలేజి మీదుగా జిన్నాటవర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన జరిగింది.

ఈ సందర్భంగా నిర్వహించిన గ్రూపు మీటింగులో సి.పి.ఐ. (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ జి.విజయ్ కుమార్ మాట్లాడుతూ 'యుపిఏ పాలకులు అంతర్జాతీయ విపణిలో ముడిచమురు ధరలు పెరిగినందున పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరలు పెంచక తప్పలేదంటూ ప్రజల నడ్డివిరిచే విధంగా ధరలను పెంచారు. దీని కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగటం వలన ప్రజల యొక్క జీవన పరిస్థితి మరింత కష్టభరితమైంది. పెట్రోలియంను త్రవ్వి తీసేందుకు భారత ప్రభుత్వం అనుమతినిచ్చిన బహుళజాతి కంపెనీలు, దేశ బడా బూర్జువాలు ముడిచమురు 100 రూపాయలున్న సమయంలో ప్రభుత్వానికి 30 రూపాయలు మాత్రమే చెల్లించారు. కనుక ఈ చెల్లింపు నుండి ముడి చమురు ధర పెరిగిన నిష్పత్తిలో పెంచితే ప్రస్తుతం ధరలు పెంచన వలసరముండదు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుంది. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సిపిఐ(ఎం.ఎల్) నగర కార్యదర్శి యు.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను ప్రతి ఐదారు నెలలకొకసారి పెంచడం ప్రజలకు పెనుభారంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసలు కారణాలను దాచిపెడ్తున్నారనీ వ్యవసాయఉత్పత్తులు తగ్గడం వలన మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని చెప్తున్నారనీ, ఈ దుర్మార్గమైన విధానాలను వ్యతిరేకించాలని మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో కె.హనుమంతరావు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)జిల్లా నాయకులు సింహాద్రి లక్ష్మారెడ్డి, దూపాటి శ్రీను, ఏపిఎఫ్‌టియు నగర కార్యదర్శి యు.క్రిష్ణ, స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర కో[illegible] సంఘటన జిల్లా కన్వీనర్ బి.మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు, 6.6.08:

ప్రజలకు పెనుభారంగా మారిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని (తరువాయి 14వ పేజీలో)

KLVA102M238

Janasakti (Communist Revolutionaries' Fortnightly) Printed Matter Book-Post 16 RNI No.8315/63 H/VJ-077/2007-09

జూన్ 23 నుండి 30 వరకు నిరసనాందోళన కార్యక్రమాన్ని నిర్వహించుదాం!!!

ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య (APFTU) పిలుపు

కార్మిక మిత్రులారా!

నేటి భారతం ఎలా వున్నది? ప్రభుత్వమూ, పాలకులూ తమ అవసరాల కొరకు నియమించిన కమిటీల లెఖ్ఖల ప్రకారమే దేశంలోని 110 కోట్ల జనాభాలో 75 శాతంకుపైగా ప్రజలు సగటున రోజుకు 20 రూ.లు మాత్రమే ఖర్చుపెట్టగలుగుతున్నారు. మరి వారి పొట్టకు నిండుగా తిండి ఎలా? చుట్టుకొనటానికి బట్టను సమకూర్చుకొనటం ఎలా? ఎండ, వానల తీవ్రత నుండి రక్షించుకొనటానికి ఇంత జాగా, పైకప్పులను సమకూర్చుకొనటం ఎలా? జీవనాన్ని సాగించటం ఎలా?

అయితే ఈ లెఖ్ఖలు తీయించిన పాలకులు+ప్రభుత్వాలు మాత్రం ఈ లెఖ్ఖలు చూపెడుతున్న పేదరికం, దైన్యం మొదలైన వాటిని చూసి గుండె గాబరా పడక, మిగిలిన 25 శాతం జనాభా కొనుగోలుశక్తి గురించి వివరణలను బహుళజాతి సంస్థల ముందు సమర్పించుకుంటున్నాయి. అలాగే పలురకాల విశేష వనరులున్న మన భరతభూమిని హారతిపళ్ళెంలోపెట్టి విదేశీ సామ్రాజ్యవాదులకు, బహుళజాతి సంస్థలకు పందేరం పంచుతున్నారు. 60 సంవత్సరాల మన 'స్వతంత్ర' భారతాన్ని చుట్టు ముట్టిన విషాదం ఎంతో!

మన దేశాన్ని పాలించుతున్నవారు (యు.పి.ఏ. కానివ్వండి లేక ఎన్.డి.ఏ. కానివ్వండి- ఎవరైనా) విదేశీ సంస్థలు చేసిన సూచనలాధారంగా, దేశంలోని వారి వంధిమాగదుల కోర్కెలకు అనుగుణంగా ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం తెచ్చారు. ఇబ్బడిముబ్బడిగా ఆర్థికమండళ్ళను, కారిడార్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రత్యేక ఆర్థికమండళ్ళు (సెజ్‌లు) ఎవరి ప్రయోజనాలకోసం?

ప్రజల ప్రయోజనాలకోసమే ఏర్పాటు చేస్తున్నామంటున్న ఈ "సెజ్"లకు భూమిని ఏ విధంగా, ఎవరివద్దనుండి సేకరిస్తున్నారు? ఈ భూముల సేకరణ వల్ల భూములపై ఆధారపడి జీవించే రైతుకూలీలకు ఒనగూడే ప్రయోజనం కంటె ఈ ఆర్థిక మండళ్ళు అదనంగా కలుగజేసే ప్రయోజనమేమిటి?

మన దేశంలో అత్యధిక ప్రజలు ఆధారపడి జీవిస్తున్న రంగం వ్యవసాయరంగం. ఆ రంగాన్ని అభివృద్ధి చేయడానికి పాలకులు ఏనాడైనా ప్రయత్నించారా? సాగుభూముల విస్తీర్ణాన్ని పెంచగలిగారా? ప్రభుత్వ అధీనంలోనున్న వినియోగంలోలేని భూమిని భూమిలేని నిరుపేద రైతుకూలీలకు పంచి వాటిని పంటభూములుగా అభివృద్ధి చేసే చర్యలు చేపట్టారా? ప్రభుత్వ విధానాల మూలంగా వ్యవసాయం గిట్టుబాటుకాక, వున్న కొద్దిపాటి భూమిని పోగొట్టుకొని గ్రామాల నుండి పొట్టచేత పట్టుకొని పట్టణాలకు వలసపోవలసిన దుస్థితి ఎందుకు వచ్చింది? రైతులకు -వ్యవసాయానికి కావలసిన విత్తనాలను, ఎరువులను, పురుగు మందులను సమకూర్చి సాగునీటి సౌకర్యం కల్పిస్తే వ్యవస్యాయరంగం వృద్ధి చెందదా? కాని అందుకు పూనుకొనని ప్రభుత్వం గుత్తపెట్టుబడిదార్ల ప్రయోజనాలకోసం, రైతుల నుండి భూములు లాగేసుకొని "సెజ్"ల పేరుతో కారుచౌకగా బహుళజాతి కంపెనీలకు, కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చెయ్యడమేకాకుండా వారికి అనేక రాయితీలు, పన్ను మినహాయింపులు ఇస్తున్నది. అంతేకాదు. సెజ్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల శ్రమను కూడా కారుచౌకగా దోచుకునేందుకు వీలుగా కొత్త నిబంధనలతో కార్మిక చట్టాలను రూపొందించింది. ఏ హక్కులూ లేని బానిసలుగా కార్మికులు పనిచేయాలి. హక్కులకోసం మాట్లాడితే ఉద్యోగం ఊడుతుంది. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలతోసహా అన్ని రాష్ట్రాలూ ఈ సెజ్‌ల ఏర్పాటుకు పోటీపడుతున్నాయి. రైతులను-భూమి నుండి, వ్యవసాయం నుండి వేరుచేస్తున్నాయి.

అవసరమైన భూమి కంటె అధికంగా ఆర్థిక [illegible] ప్రమేయం లేని ప్రైవేటు రాజ్యాల ఏర్పాటుకు పాలకులు సహాయపడుతున్నారు.

విదేశీయుల పెత్తనాన్ని నెలకొల్పే, పంటభూములను సమర్పించే శ్రమశక్తులను, నైపుణ్యాలను కారుచౌకగా అణచివేతతో కాజేసే ప్రత్యేక ఆర్థిక మండళ్ళను, కారిడార్‌లను వ్యతిరేకించుదాం!

అంతులేకుండా ధరలను పెంచుతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం!

కార్మికులం -మనపై సాగుతున్న శ్రమదోపిడీ, అణచివేతల తగ్గింపుకోసం మన కోసం మనం పోరాటం సాగించుదాం!

మన బిడ్డల కోసం, మన వారసులకోసం, సర్వమానవాళి క్షేమం -విముక్తికోసం పోరాటం నడిపించుదాం!

1990లో స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ కోసమంటూ కాకినాడలో 300 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించి ఎన్.ఆర్.గుజరాత్‌కు అప్పజెప్పారు. షరతులు కుదరలేదని ఫ్యాక్టరీ కట్టలేదు. ఆ భూమిని రాష్ట్ర పరిశ్రమాభివృద్ధి సంస్థకు దఖలు పరిచారు. వారు ఆ భూమిని లాభాలకు అమ్ముకున్నారు. భూమి ఇచ్చిన రైతులు దిక్కులేనివారైనారు.

400 మెగావాట్ల గ్యాస్ ఆధారిత పవర్‌ప్లాంటు కోసం కొత్తపల్లి మండలంలో 800 ఎకరాలు రైతుల నుండి తీసుకున్నారు. ఆ ప్లాంటును 200 మెగావాట్లకు కుదించి స్పెక్ట్రమ్ వారికి అప్పజెప్పారు. 400 ఎకరాలు నిరుపయోగంగా మిగిలింది.

రాయలసీమ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ కోసం వందల ఎకరాలు, ఎకరం 50 వేల చొప్పున కొన్నారు. చుట్టూ గోడ కట్టారు. ఏ నిర్మాణమూ జరగలేదు. అవసరం వున్నా, లేకున్నా పరిశ్రమలపేరు మీద, సెజ్‌ల పేరుమీద భూములు కారుచౌకగా కొనడం రైతులను బికారులు చేసి వీధులలోకి నెట్టటం జరుగుతున్నది.

హైదరాబాద్ నుండి మచిలీపట్నం వరకు, హైదరాబాద్-కృష్ణా డెక్కన్ కారిడార్ పేరుతో మైటాస్ కంపెనీకి అప్పగించారు. లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయని ఊదరగొడ్తూ దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నది. ప్రజాధనం అక్రమంగా ఖర్చుపెడుతున్నది.

ఇన్‌క్యాప్ (ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల సంస్థ) విశాఖపట్నం నుండి కృష్ణపట్నం వరకు కోస్టల్ కారిడార్‌కు తలపెట్టింది. అదే విధంగా కాకినాడ నుండి గంగవరం పోర్టు వరకు సుమారు 190 కి.మీ. సముద్రతీర ప్రాంతంలో "పెట్రో కారిడార్‌కోసం" 8 వేల ఎకరాలు సేకరించింది. తీరం వెంబడి విశాఖ నుండి కాకినాడ వరకు 8 లైన్ల రోడ్లు వేస్తారట. 7 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయట. ఒక ప్రక్క చమురు, గ్యాస్ సంపద, మరోప్రక్క పారిశ్రామిక వాడతో మొత్తం తీర ప్రాంతం మరో గల్ఫ్‌గా మారిపోతుందట. వేల ఉద్యోగాలు, లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని ఊదరగొడుతున్నారు. గంగవరం పోర్టు నిర్మాణంకోసం 5 గ్రామాల మత్స్యకారులు నిర్వాసితులయ్యారు. వేటకు దూరమయ్యారు. ఆ ప్రాంతంలో చేపల వేట నిషేధించారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం, ఉద్యోగాలు ఎండమావిగానే మిగిలాయి. అలాగే చెన్నై నుండి బెంగుళూరుకు సత్యవేడు నుండి చెన్నై వరకు, నెల్లూరు నుంచి రాజంపేట-కడప-అనంతపూర్, హిందూపూర్‌ల మీదుగా బెంగుళూరు వరకు పారిశ్రామిక కారిడార్‌లు రానున్నాయట. కెమికల్ హబ్‌లు, సెజ్‌లు, కారిడార్‌లకు జతచేసి, నీటి ప్రాజెక్టులు, కెనాల్ ప్రాజెక్టులను పాలకులు తలపెట్టారు. అలాంటి పోలవరం ప్రాజెక్టు పేరుతో 278 గ్రామాల గిరిజనులు తమ జీవనోపాధిని, సంస్కృతి, సాంప్రదాయాలను, నివాసాలను కోల్పోతున్నారు.

పాలకులు చెబుతున్నట్లు ఇక్కడ నిరుద్యోగులకు దొరికే ఉద్యోగాలు నామమాత్రమే. ఆ పరిశ్రమలన్నీ ఎక్కువగా ఆధునిక టెక్నాలజీతో నడిచేవే. ఏవైనా కొన్ని ఉద్యోగాలు లభించితే కాంట్రాక్టరు వద్ద కూలీలుగానే ఈ సంస్థలలోని కార్మికులు పనిచేయాల్సి వస్తున్నది.

ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించిన ఈ సెజ్ పరిశ్రమలైన బల్క్ డ్రగ్స్ తయారీ పరిశ్రమల్లో, బట్టలు, పాదరక్షలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నగలు, వజ్రాల పాలిషింగ్ తదితర పరిశ్రమల్లో కార్మికులు నిర్బంధ పని పద్ధతుల్లో, రోజుకు 10-12 గంటల పని, తక్కువ కూలితో బానిసల్లా బ్రతుకుతున్నారు. రెడీమేడ్ బట్టల తయారీ పరిశ్రమల్లో మహిళలు దారుణమైన దోపిడీ, పీడనలకు గురౌతున్నారు.

మన సహజవనరులను, పంటభూములను, ఖనిజాలను, గ్యాసు, నీరు వాటితోపాటు మానవ శ్రమను కారుచౌకగా స్వంతం చేసుకుంటున్నారు. అంతర్జాతీయ గుత్తపెట్టుబడి విషసర్పం యొక్క విన్యాసమిది. వీటి విన్యాసాలతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎలాంటి ప్రోత్సాహం లేక, పన్నులు చెల్లించలేక అంతరించిపోయే పరిస్థితుల్లో వున్నాయి.

ఈ ఆర్థిక మండళ్ళు, కారిడార్‌లు, అంతిమంగా ఆయా దేశాల ఆర్థిక, రాజకీయ సార్వభౌమత్వాలను కబళించేవే! సామ్రాజ్యవాదం తన సాధనాలైన ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్., ప్రపంచ వాణిజ్య సంస్థల ద్వారా ఈ దోపిడీని ఇంచుమించు ప్రపంచ దేశాలన్నింటిలోనూ అమలుపరిచింది. సెజ్‌లకు, కారిడార్‌లకు వ్యతిరేకంగా పాలకుల విధానాలకు వ్యతిరేకంగా బలమైన, నిలకడైన ఉద్యమాన్ని నిర్మించటానికి కార్మికులందరం పూనుకుందాం.

ధరలెందుకు పెరుగుతున్నాయి?

భారత పాలకులు ధరల పెరుగుదల అంతర్జాతీయ సమస్యగా వుందంటున్నారు. ధరల పెరుగుదల మన అభివృద్ధికి సూచికయని అంటున్నారు. దీనిని బట్టి ధరల పెరుగుదలను పాలకులు కోరుకుంటున్నట్లే కదా....

ధాన్యసేకరణ నుండి ప్రభుత్వం తప్పుకోవటం, ఫ్యూచర్, ఫార్వర్డ్ ట్రేడింగులకు అనుమతించడం, ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను నామమాత్రంగా మార్చడం, పెట్రోల్, డీజిల్ రేట్లు విపరీతంగా పెంచడం, తద్వారా రవాణా ఛార్జీలు పెరిగి అన్ని నిత్యావసర వస్తువుల ధరలూ పెరగడం నిరంతరం జరుగుతున్నది. ద్రవ్య చెలామణి పెంపు కారణంగా ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్ళు జరిపి సరుకులు నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. చీకటి వ్యాపారాన్ని చట్టబద్ధంగా మార్చివేసారు. దీనితో ఎవరైనా పంటలను కొని ఎంత కాలమైనా గోడౌన్‌లలో దాచిపెట్టుకొని అనువైనపుడు లాభాలకు అమ్ముకోవచ్చు. ఈ కారణాలన్నింటి పర్యవసానంగా ధరలు పెరిగి ప్రజల జీవనం దుర్భరంగా మారిపోయింది.

కేంద్ర, రాష్ట్ర పాలకులు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేసిన ఫలితంగాను, సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల ఆజ్ఞలను అమలుచేయడం ద్వారానూ ఆహార భద్రత కరువౌతున్నది. తిండిగింజల నుండి బయో డీజిల్ (ఇథనాల్)ని తయారుచేసి పెట్రోల్‌కు ప్రత్యామ్నాయంగా వాడవచ్చని, దీనివల్ల ఖర్చు ఆదా అవుతుందని, వాతావరణ కాలుష్యం తగ్గుతుందని అమెరికాలో ఖచ్చితంగా ఇథనాల్‌ను ప్రత్యామ్నాయ ఇంధనంగా వాడాలని శాశనం చేసారు. ప్రపంచ దేశాలలో పెట్రోలును అత్యధికంగా వాడుకునే దేశం అమెరికాయే. అమెరికన్ సామ్రాజ్యవాదుల అడుగు జాడల్లో నడిచే భారత్ ప్రధాని, వ్యవసాయశాఖ మంత్రి శరద్‌పవార్‌లు కూడా ఈ ఇథనాల్ వినియోగాన్ని పెంచాలని పదే పదే సూచిస్తున్నారు. 2008 అక్టోబరు నాటికి 10% ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపాలనే చట్టసవరణ నిర్ణయం కూడా ప్రభుత్వంచేత చేయించారు. దేశమంతా ఇథనాల్‌పై ఒకే విధంగా అమ్మకం పన్ను 4 శాతానికి మించి వసూలు చేయరాదని నిర్ణయించింది. ప్రభుత్వం ఇస్తున్న ఈ ప్రోత్సాహంతో అనేక ప్రైవేటు రంగ సంస్థలు ఇథనాల్ ఉత్పత్తి ప్లాంటులు నిర్మించడం ప్రారంభించాయి.

దేశంలోని దళారీ పెట్టుబడిదారుల కంపెనీల్లో ఒకటైన "టాటా కెమికల్స్" హైదరాబాద్‌లోని "ఇక్రిసాట్"తో మొక్కజొన్న నుండి బయో ఫ్యూయల్ చేసే పరిశోధనలు నిర్వహించడానికి ఒక కన్సార్టియంను ఏర్పాటు చేసుకున్నది. పంజాబ్ రాష్ట్రంలో రైతులకు సలహాలిచ్చే ప్రభుత్వ పి.ఎస్.ఎఫ్.సి. మొక్కజొన్న నుండి బయో ఇంధనం ఉత్పత్తి చెయ్యడం కోసం ప్రైవేటు కంపెనీలతో చర్చలు జరుపుతున్నది.

పశ్చిమగోదావరిజిల్లా తాళ్ళపూడి మండలంలో ఒక బయోఫ్యూయల్ ప్లాంటు నిర్మాణంలో వుంది. దీనిలో ముడిసరుకుగా వరిధాన్యాన్ని వాడతారు. ఈ ప్లాంటు తూర్పు, పశ్చిమ గోదావరిజిల్లాల్లోని వరిపంటలో 10 శాతాన్ని ముడిసరుకుగా వాడతారు.

నల్గొండజిల్లా చౌటుప్పల్ మండలంలోని సంస్థాన్ నారాయణపూర్‌లో "సదరన్ ఆన్‌లైన్ బయో టెక్నాలజీ" సంస్థ బయో డీజిల్ తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. ఇందుకోసం లక్షల ఎకరాల్లో జాత్రోఫా మొక్కలు (ఇథనాల్ తయారీకి ఉపయోగపడే మొక్కలు) పెంచటం జరుగుతున్నది. ఇదే సంస్థ విశాఖజిల్లాలోని అచ్యుతాపురంలో గల ఎస్.ఇ.జెడ్‌లో 10 ఎకరాల స్థలంలో రెండవ యూనిట్‌ను నెలకొల్పుతున్నది.

కర్నూలుజిల్లా నంద్యాలలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నందిపైపుల సంస్థ రోజుకి 360 టన్నుల మొక్కజొన్నను ఉపయోగించుకునే సామర్థ్యంతో ప్లాంటును నెలకొల్పుతున్నది. వేరుశెనగ పండించే అక్కడి రైతులను మొక్కజొన్న పండించి లాభాలు సంపాదించమని ప్రచారం చేస్తున్నది.

ఇవికాక రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు పంచదార మిల్లులన్నీ మొలాసిస్ నుండి ఇథనాల్‌ను తయారు చేస్తున్నాయి. చెరకు రసం నుండీ నేరుగా ఈ ఇంధనాన్ని తయారు చేసుకోవడానికి ప్రభుత్వ అనుమతిని కోరుతున్నాయి. ఈ విధంగా పంటలను, పంటభూములను ప్రజల ఆహార అవసరాల నుండి ధనికుల విలాస అవసరాలు తీర్చటం కొరకు ముడి పదార్థాలను అందించేవిగా మార్చటం వలన కూడా ఆహారకొరత ఏర్పడి, నిత్యావసరాల ధరలు పెరిగి పోతున్నాయి. ఇదంతా ప్రభుత్వాలు, పాలకులు అమలుపర్చుతున్న విధానాల చలువయే కదా!

వ్యవసాయరంగాన్ని నాశనంచేసి, దేశంలో సెజ్‌లపేరుతో ప్రైవేట్‌రాజ్యాలను సృష్టించుకొని, కార్మికుల శ్రమను కారుచౌకగా దోచుకుంటూ వారిని బానిసలుగా మార్చివేస్తున్న పాలకుల, ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా, నిత్యజీవితావసర వస్తువుల ధరలను అదుపు చేయకపోగా, నిరంతరం పెంచుతూ సామాన్యులకు బ్రతకలేని దుస్థితిని కల్పిస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలి. అన్ని రంగాల ప్రజలను ఐక్యంచేసి సంఘటిత పోరాటాలు సాగించాలి. ◈

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M238
పుస్తకం పేరు	జనశక్తి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	17
పెద్ద సైజు పేజీలు	yes
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	S/c Sharmila
పేజీలు విడదీసినది	S/c Sharmila
స్కాన్ చేసినది	Asod
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good